



ESTD: 1999

www.voodayam.com

# వుదయం






వరంగల్ | 24-07-2026 శుక్రవారం | సంపుటి : 11 | సంచిక : 37 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on


## విద్యార్థులతో చర్చలకు సిద్ధమన్న కేంద్రం

- ఎప్పుడైనా చర్చలకు రావచ్చు
- ఢిల్లీలో ముమ్మరమైన నీట్ నిరసనలు
- సాయంత్రానికే మూతపడనున్న కన్నాట్ ప్లేస్ వ్యాపారాలు
- ఆందోళనకారులపై బలప్రయోగానికి కేంద్రం కుట్ర : అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, జూలై 23 (ఎఎంఎస్) :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళనలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను వేగవంతం చేసింది. ఈ సమస్య పరిష్కారానికి శాంతియుతంగా చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని నిరసన తెలుపుతున్న విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నేతలకు మరోసారి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... "ఆందోళనకారుల సమక్షంలో చర్చించేందుకు ప్రభుత్వం పూర్తి సుముఖంగా ఉంది. విద్యార్థులకు అనుకూలమైన సమయంలో ఎప్పుడైనా రావొచ్చు. ఆందోళనకారుల తరపున ప్రతినిధులు వచ్చి కేంద్రంతో చర్చలు జరపవచ్చు. నిరసనకారుల ముందు ప్రభుత్వం ఇప్పటికే నాలుగు ప్రతిపాదనలను ఉంచింది" అని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యాలయంలో గానీ, ఆయన నివాసంలో గానీ చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చలు ప్రారంభిస్తేనే సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ప్రతి నిర్ణయాన్ని తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.

**కన్నాట్ ప్లేస్‌లో వ్యాపారాల నిలిపివేత:** మరోవైపు సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల దృష్ట్యా రాజధాని దిల్లీలోని 'న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్' కీలక నిర్ణయం తీసుకుంది. నిరసనల ఉద్ధృతి ఎక్కువగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు, కార్యాలయాలను మూసివేయాలని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేసింది. పరిస్థితుల దృష్ట్యా యజమానులందరూ సహకరించాలని కోరింది.

**కేంద్రంపై కేజ్రీవాల్ మండిపాటు:** ఎన్‌డీటీఏ తీసుకున్న ఆదేశాలపై ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. ఈ విషయమై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేస్తూ... సాయంత్రానికే షాపులు మూసివేయాలని చెప్పడం, జంతర్ మంతర్ పరిసరాల్లో భారీగా పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం మరొకసారి బలప్రయోగానికి దిగేందుకు కుట్ర పన్నుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.

# ఓట్ల తొలగింపుకు ఆస్కారం లేకుండా చర్యలు

**తప్పుడు ఫిర్యాదులు చేస్తే జైలుకే**



- తప్పుడు ఫిర్యాదులు చేస్తే జైలుకే
- హైడ్రా పనితీరు భేష్..
- కాళేశ్వరంలో అపార అవినీతి
- రాష్ట్రంలో 70 శాతం ఎస్ఐఆర్ పూర్తి
- కేటీఆర్, బీఆర్ఎస్‌లపై ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూలై 23 (వుదయం) :** రాష్ట్రంలో ఇప్పటివరకు 70 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం మీడియాతో నిర్వహించిన ముఖాముఖి (చిట్‌చాట్)లో ఆయన పలు సమకాలీన రాజకీయ, పాలనాంశాలపై మాట్లాడారు. ప్రక్షాళన నెపంతో ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే అవకాశం ఉన్నందున, అక్రమాలకు తావులేకుండా ఉండేందుకే బిఎల్ఓ (BLO)లను నియమించామని సీఎం వివరించారు. ఓటు హక్కు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు.

**రెండు ఓట్ల ఆరోపణలపై ఘాటు స్పందన**

తనకు రెండు చోట్ల ఓటు ఉందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. "నాపై ఆరోపణలు చేసేవారు ధైర్యముంటే ఆధారాలతో ఫిర్యాదు చేయాలి. తప్పుడు ఫిర్యాదులు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుని లోపల వేయిస్తాం. నేను నిబంధనల ప్రకారమే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుని నా ఓటును బదిలీ చేయించుకున్నాను" అని స్పష్టం చేశారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆంధ్ర ప్రాంత ఓటర్ల ఓట్లను అక్రమంగా తొలగిస్తే, కాంగ్రెస్ పార్టీ కోర్టును ఆశ్రయించిందని, దాంతో అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**హైడ్రా, కాళేశ్వరం ప్రాజెక్టుపై వ్యాఖ్యలు:** రాష్ట్రంలో 'హైడ్రా' చాలా బాగా పనిచేస్తోందని, ఇప్పటికే రూ.కోట్ల విలువైన ఆక్రమిత ఆస్తులను స్వాధీనం చేసుకుందని సీఎం కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా పక్కనబెట్టారని విమర్శించారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతి వల్లే కేసీఆర్, హరీశ్‌రావుకు కొంతకాలం మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టారని వ్యాఖ్యానించారు.

**కేటీఆర్‌పై ధ్వజం:** గత ప్రభుత్వ హయాంలో గ్లోబరీనా సంస్థ నిర్వాకం వల్ల ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతో 27 మంది అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని సీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని, బాధిత విద్యార్థుల కుటుంబాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. జన్వాడ ఫామ్‌హౌస్ భూములపై కేటీఆరే స్వయంగా విచారణ కోరాలని సవాలు విసిరారు.

**ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం:** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూసివేసిన ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరుద్ధరించిందని సీఎం తెలిపారు. నాడు ధర్నా చౌక్‌ను ఎత్తేసిన వాళ్లే, నేడు అదే స్థావరంలో ధర్నా చేస్తామని అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో పేదలకు అందాల్సిన ఇళ్లను బీఆర్ఎస్ నాయకులు దళారులకు అమ్ముకున్నారని, ప్రస్తుతం బీజేపీ నేతల మధ్య కూడా తీవ్ర అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



## రాజకీయ లబ్ధి కోసమే నిరాధార ఆరోపణలు

**హైదరాబాద్, జూలై 23 (వుదయం) :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీ రామారావు) లీగల్ నోటీసులు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ వ్యవహారంలో తనపై చేసిన నిరాధార ఆరోపణలను ఉపసంహరించుకుని, 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ నోటీసులో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... "ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి నాపై తీవ్రస్థాయిలో తప్పుడు ప్రచారం చేశారు. గ్లోబరీనా సంస్థతో నాకు ఎటువంటి ఆర్థిక సంబంధాలు కానీ, ఎలాంటి యాజమాన్య హక్కులు కానీ లేవు. అది నా బినామీ కంపెనీ అనడం, దానికి సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అనడం పూర్తిగా అవాస్తవం, బాధ్యతారాహిత్యం" అని మండిపడ్డారు.

# 'చలో పార్లమెంట్' రగడ




**న్యూఢిల్లీ, జూలై 23 (ఎఎంఎస్) :** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ చేపట్టిన 'చలో పార్లమెంట్' ఆందోళనల్లో పాల్గొన్న వారిపై చట్టపరంగా తీవ్ర చర్యలు తీసుకునేందుకు దిల్లీ పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. నిరసనల్లో పాల్గొన్న అల్లరిమూకలను, ఆందోళనకారులను ప్రత్యేకంగా గుర్తించి, వారి పాస్‌పోర్టులను కూడా రద్దు చేయాలని పోలీసులు యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించి ఇప్పటికే కార్యాచరణ కూడా ప్రారంభమైనట్లు సమాచారం.

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం సోమవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసేసి, ధ్వంసం చేస్తూ విద్యార్థులు, సీజేపీ నాయకులు నిరసనలకు దిగారు. పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసులు రంగంలోకి దిగి బాష్పవాయు గోళాలను ప్రయోగించడంతో పాటు తీవ్ర స్థాయిలో లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు ఆందోళనకారులతో పాటు పోలీసులకు కూడా గాయాలయ్యాయి.

**నేడు దేశవ్యాప్త నిరసనలకు పిలుపు:** పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులు, నిరసనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఎండగడుతూ శుక్రవారం (24వ తేదీన) దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు చేపడుతున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ ఆందోళన కార్యక్రమానికి దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, యువత మద్దతుగా నిలవాలని కోరింది. నిరసనల నేపథ్యంలో శుక్రవారం పలు విద్యాసంస్థలు మూతపడే అవకాశం ఉంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, నిరసనలు శాంతియుతంగా జరిగేలా స్థానిక విద్యార్థి నాయకులు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేశాయి.




## ఎర్రసముద్రంలో హూతీల కలకలం




**టెహ్రాన్:** పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య పరస్పర హెచ్చరికలు, దాడులతో పరిస్థితులు దిగజారుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ విరుచుకుపడుతుండటంతో గత 12 రోజులుగా ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇరాన్ ఇకపై ఏ నౌకపై దాడి చేసినా ఆ దేశంలోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు, ఇరాన్ సైనిక బలగాలు (యూఎస్ సెంట్రల్ కమాండ్) టెహ్రాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీసేలా ఇప్పటికే దాడులు నిర్వహించినట్లు ప్రకటించాయి.

**అమెరికాపై 9/11 తరహా దాడి చేస్తాం: ఇరాన్ హెచ్చరిక**

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తీవ్రంగా స్పందించింది. అమెరికాపై 2001లో జరిగిన 9/11 (సెప్టెంబరు 11) తరహా తీవ్రవాద దాడిని మళ్లీ పునరావృతం చేస్తామని బెదిరించింది. ఘర్షణలు ఇలాగే కొనసాగితే అమెరికా మరోసారి జాతీయ సంతాప దినాలు పాటించాల్సి వస్తుందని తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థ 'తస్నీమ్' వెల్లడించింది. అమెరికా చరిత్రలోనే అత్యంత విషాదకర సంఘటనగా నిలిచిన 9/11 దాడుల్లో అల్ ఖైదా ఉగ్రవాదులు నాలుగు విమానాలను హైజాక్ చేసి వరల్డ్ ట్రేడ్ సెంటర్ (ట్విన్ టవర్స్) పైకి దూసుకెళ్లేలా చేశారు.

## "మీ వెంట మేమున్నాం"

### విద్యార్థులకు రాహుల్ గాంధీ భరోసా!



**న్యూఢిల్లీ, జూలై 23 (ఎఎంఎస్)** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు విపక్ష కూటమి పూర్తి మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నివాసంలో సమావేశమైన విపక్ష కూటమి నాయకులు, ఈ వ్యవహారంపై విస్తృతంగా చర్చించి విద్యార్థుల పోరాటానికి అండగా నిలవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. అనంతరం కూటమి నేతలందరూ కలిసి 'గాంధీ స్మృతి' కేంద్రానికి చేరుకుని కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులకు ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు పలువురు విపక్ష నేతలు బస్సుల్లో బయలుదేరగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ నివాస ప్రాంగణంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ... "దేశంలో విద్యార్థులు ఎవరూ ఒంటరి వారు కాదు. వారి న్యాయమైన పోరాటానికి విపక్షాలన్నీ అండగా నిలుస్తాయి" అని స్పష్టమైన భరోసానిచ్చారు.

**జంతర్ మంతర్ వద్ద ఇంటర్నెట్ నిలిపివేత:** మరోవైపు నీట్ లీకేజీకి నిరసనగా సీజేపీ కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తున్న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ముందస్తు జాగ్రత్త చర్యగా గురువారం అర్ధరాత్రి వరకు జంతర్ మంతర్ పరిసరాల్లో 1.5 కిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## విద్యార్థులు ఉగ్రవాదులు కాదు..



**న్యూఢిల్లీ, జూలై 23 (ఎఎంఎస్)** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన 'చలో పార్లమెంట్' ఆందోళనపై పోలీసులు జరిపిన దాడి ఘటనను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీరుపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ యువత ఏ రంగంలో విజయం సాధించినా ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే ప్రధాని, ప్రస్తుతం విద్యార్థులపై జరుగుతున్న దాడులకు కూడా అంతే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. విద్యార్థులను తాను ఎంతో ప్రేమిస్తానని సోషల్ మీడియా వేదికగా నిత్యం పోస్టులు పెట్టే ప్రధాని మోదీ, హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించి, లాఠీఛార్జ్ చేయించడం అత్యంత దారుణమని విమర్శించారు.

**ఇదేం ప్రజాస్వామ్యం?**

"అధికార పక్షానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ బయట నిలబడి ఆందోళనలు చేయడం ఎక్కడైనా చూశామా? వారు సభా సమయాన్ని పూర్తిగా వృథా చేస్తున్నారు. అసలు మనం ప్రజాస్వామ్యంలోనే జీవిస్తున్నామా అని అనుమానం కలుగుతోంది. న్యాయమైన డిమాండ్లతో నిరసన తెలుపుతున్న పిల్లల (విద్యార్థుల) ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నారు. వాళ్లేమీ ఉగ్రవాదులు కాదు కదా! ఆందోళనకారులపై బాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీలతో ఇష్టమొచ్చినట్లు కొట్టడం ఏ రకమైన ప్రజాస్వామ్యం?" అని ప్రియాంక ఘాటుగా ప్రశ్నించారు.

# 'ఎక్స్ 'రోడ్డు వద్ద టికెట్ రిజర్వేషన్ సెంటర్ ప్రారంభం

**కోహీర్ జూలై 23 (వుదయం ప్రతినిధి)**



జహీరాబాద్ పరిధిలో ని కోహీర్ మండలం, కోహీర్ x రోడ్డు వద్ద నూతనంగా 'తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ' (TGSRTC) టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ('డి.కె. బ్రదర్స్ కౌంటర్స్') సెంటర్ ను.జహీరాబాద్ డిపో. మేనేజర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కౌంటర్ ద్వారా స్థానిక ప్రయాణికులకు దూరప్రాంత ప్రయాణాలు మరింత సులభతరం కానున్నాయి. ఇక్కడి నుండి ఒంగోలు, కందుకూర్, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, గుత్తి, అనంతపూర్, బెంగళూరు తదితర ముఖ్యమైన నగరాల మరియు పట్టణాలకు ముందస్తు టికెట్ రిజర్వేషన్ (అడ్వాన్స్ బుకింగ్) చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా కౌంటర్ ఏజెంట్, డప్పు నర్సిములు మాట్లాడుతూ 'గతంలో దూరప్రాంతాలకు టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ కౌంటర్ను ఏర్పాటు చేయడం జరిగింది.అన్నారు ప్రయాణికులు www.tgsrtcbus.in వెబ్సైట్ ద్వారా గానీ లేదా నేరుగా ఈ కౌంటర్ను సంప్రదించి తమ టికెట్లను బుక్ చేసుకోవచ్చు' అని తెలిపారు.స్థానిక ప్రజలు, వ్యాపారులు మరియు ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమాచారం కోసం లేదా బుకింగ్స్ కోసం 9849719285 / 9676219285 నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహీర్ మండలం. ఎస్. సీ. సెల్ అధ్యక్షులు అనిల్ పలువురు స్థానిక ప్రముఖులు, మిత్రులు పాల్గొన్నారు.అనంతరం డిపో మేనేజర్ ను.డప్పు. నర్సిములు శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు.

# పంట బీమా అమలయే వరకు బిజెపి పోరాటం కొనసాగిస్తాం



- **బిజెపి రాష్ట్ర నాయకులు ముచర్ జనార్ధన్ రెడ్డి**

**ఉర్కొండ న్యూస్ జూలై 23 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు యువకులకు భారతీయ జనతా పార్టీ పోరాటం పాపము అని బిజెపి రాష్ట్ర నాయకులు ముచర్ల జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు పంట బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఊరుకొండ మండల కేంద్రంలో గురువారం తాసిల్దార్ యూసుఫ్ అలీ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు పట్టణ నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పంట బీమా పథకం ఎంతో రక్షణ కల్పిస్తుందని అన్నారు రైతులకు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా ఫసల్ బీమా పథకాన్ని అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు మండల అధ్యక్షులు మాజీ అధ్యక్షులు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- **ఆపరేషన్ ముస్కాన్–12 సమీక్షలో**
- **జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు హెచ్చరిక**

**గద్వాల, జూలై 23 (వుదయం కరస్పాండెంట్):**

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జూలై 1 నుంచి కొనసాగుతున్న ఈ కార్యక్రమం పురోగతిపై గురువారం నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేపడుతున్నాయని, మహిళా-శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఎస్పీ తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుర్తించిన బాలబాలికలను షెల్టర్ హోమ్లకు తరలిస్తామని చెప్పారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని, 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాలల భవిష్యత్తును కాపాడడమే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జూలై 22 నాటికి జిల్లాలో మొత్తం 85 మంది చిన్నారులను రక్షించినట్లు ఎస్పీ వెల్లడించారు. వీరిలో 81 మంది బాలురు, 4 మంది బాలికలు ఉన్నారని, 67 మంది తెలంగాణకు చెందినవారు, 18 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అని చెప్పారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 24 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ గణాంకాలు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతంగా కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీసీఆర్బీ సీఐ టాటా బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ సహదేవుడు, మహిళా- శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, వివిధ శాఖల అధికారులు, ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# నేటి విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయండి

- **నారాయణపేట ఎస్ఎఫ్ఐ**

**నారాయణపేట టౌన్, జూలై 23(వుదయం ప్రతినిధి):**

కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలను, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలను నిరసిస్తూ నారాయణపేట జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు, కళాశాలల బంద్ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు భాను ప్రసాద్ మాట్లాడుతూ ఈ బంద్ను విద్యార్థులు, యువకులు, ప్రజా సంఘాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. వరుస పరీక్షల లీకేజీలు, విద్యా వ్యవస్థ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను వెంటనే రద్దు చేయాలని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు,యువతపై జరిగిన అన్యాయమైన పోలీస్ దాడులపై పారదర్శక విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.దేశంలో విద్యా రంగాన్ని దెబ్బతీసే కేంద్రీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని ,వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు ను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి పవన్ కుమార్,రాష్ట్ర కమిటీ సభ్యులు నరహరి, జిల్లా కమిటీ సభ్యులు కనకప్ప, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ జిల్లా కమిటీ సభ్యులు గోవిందు లతోపాటు తదితరులు హాజరు అయ్యారు.

# విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహమే నిజమైన పెట్టుబడి

- **ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**
- **టాప్ ర్యాంకర్లకు ల్యాప్టాప్ ల పంపిణీ**

**నాగర్ కర్నూల్, జూలై 23 (వుదయం ప్రతినిధి):**



జిల్లా కేంద్రంలోని CNR హై స్కూల్లో 10వ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో 1, 2, 3 ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ల్యాప్టాప్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, నేటి విద్యార్థులే రేపటి భారత దేశ నిర్మాణ శిల్పులని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడి చదివే తత్వంతో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్ మున్సిపల్ చైర్మన్ కీగల సునేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కా రాజు, కౌన్సిలర్లు నిజాం, పద్మమ్మ, ఖాజాఖాన్, కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట

- **మత్స్యకారులకు అండగా ఉంటాం**
- **చేపల మార్కెట్ ప్రారంభోత్సవంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**బిజినపల్లి, జూలై 23 (వుదయం ప్రతినిధి):**



మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల రాజేష్ రెడ్డి పేర్కొన్నారు గురువారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేపల మార్కెట్ ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం వారి సమస్యల పరిష్కారంలో ముందుంటామని హామీ ఇచ్చారు 10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో మత్స్యకారులను గాలికి వదిలేశారని విమర్శించారు మత్స్యకారులు ఆర్థికంగా రాణించాలంటే ఎదిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని కులవృత్తులకు సమాన అవకాశాలు కల్పిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చే పునవృత్తులను ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేపల మార్కెట్ వలన ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందని ఉపాధితో పాటు చేపలు ఆరోగ్యానికి మంచిగా ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరు చేపలను తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగన మోని కిరణ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు ఉపాధ్యక్షులు తుమ్మలల్లోజి బిజినపల్లి మాజీ సర్పంచ్ తిరుపతయ్య సాయినపల్లి మాజీ సర్పంచ్ అవంతి శంకర్ జిల్లా డైరెక్టర్ బంగారయ్య పర్వతాలు చిరంజీవి కేశవులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మురుగులో మునిగిన నడిగడ్డ అభివృద్ధి!



- **రోడ్డెక్కిన మురుగునీరు.. నడిరోడ్డుపైనే నరకయాతన!**
- **నడక కాదది.. నరకపరీక్ష! ప్రమాదాల బారిన పడుతున్న ద్విచక్ర వాహనదారులు**
- **బట్టబయలైన మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. అంటువ్యాధుల భయంలో స్థానికులు**
- **మాటలు కోటలు దాటుతున్నాయ్.. చేతలు గడప దాటడం లేదు!**

**గద్వాల, జూలై 23 (వుదయం బ్యూరో):**

గద్వాల పట్టణంలో మున్సిపల్ యంత్రాంగం నిద్రమత్తు వీడడం లేదు. 'నడిగడ్డ అభివృద్ధి' అంటూ వేదికలపై నాయకులు ఇచ్చే ఉపన్యాసాలకు, క్షేత్ర స్థాయి పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. మెల్ల చెరువు చౌరస్తా నుంచి పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గత నాలుగు రోజులుగా మురుగునీరు, వర్షపు నీటితో నిండిపోయి నరకకూపాన్ని తలపిస్తోంది. వందలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గం చెరువులా మారినా, అధికారుల కంటికి కనిపించకపోవడం గమనార్హం.

**ప్రాణాలు గుప్పిట్లో పట్టుకుని ప్రయాణం**

సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర దుర్వాసన మధ్య, మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దయనీయ స్థితి దాపురించింది. ద్విచక్ర వాహనదారులు రోజూ జారిపడుతూ గాయాలపాలవుతున్నారు.

**బుట్టదాఖలైన ఫిర్యాదులు.. జనం చందాలే దిక్కు!**

సమస్య తీవ్రతపై నాలుగు రోజుల క్రితమే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు నయా పైసా పనిచేయలేదు. విసుగుచెందిన కాలనీవాసులే స్వయంగా రూ. 6,000 చందాలు వేసుకుని ట్రాక్టర్లతో మట్టి వేయించినప్పటికీ సమస్య తాత్కాలికంగా కూడా పరిష్కారం కాలేదు. ప్రజలు కడుతున్న పన్నుల డబ్బులు ఏమవుతున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**'నాకు సమాచారమే లేదు' - కమిషనర్ రొటీన్ రాగం!**

ఈ దారుణ పరిస్థితిపై మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ను వివరణ కోరగా— "నాకు ఇప్పటివరకు ఈ సమస్యపై ఎలాంటి సమాచారం లేదు. వెంటనే సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం" అని అలవాటైన సమాధానమిచ్చారు. అయితే ఆయన మాట ఇచ్చి గంటలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఒక్క పారిశుద్ధ్య కార్మికుడు కూడా అడుగుపెట్టకపోవడంతో అధికారులు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది.

**అంటువ్యాధుల భయంలో కాలనీవాసులు**

వర్షాకాలంలో పారిశుద్ధ్యాన్ని గాలికొదిలేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# ఐజలో కాంగ్రెస్ 'రణభేరి'.. కేంద్రం నిరంకుశత్వంపై కరసేవ!

- **విద్యార్థుల జీవితాలతో కరడుగట్టిన చెలగాటం!**
- **తక్షణమే దిగిపో ధర్మేంద్ర ప్రధాన్.. మోదీ జవాబు చెప్పాల్సిందే!**
- **రాహుల్పై అక్రమ పాచికలు.. అగ్గిమీద గుగ్గిలమైన కాంగ్రెస్ శ్రేణులు**
- **మోదీ దిష్టిబొమ్మ దగ్ధం.. ఐజ పురవీధుల్లో మిన్నంటిన ఆగ్రహజ్వాలలు**

**ఐజ, జులై 23 (వుదయం కరస్పాండెంట్):**



దేశంలో విద్యార్థుల భవిష్యత్తును బలిపీఠం ఎక్కిస్తూ, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పాపాల చిట్టాపై కాంగ్రెస్ పార్టీ నిప్పులు చెరిగింది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ అవలంబిస్తున్న రైతు, విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఐజ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు సమరశంఖం పూరించాయి. వరుస ప్రశ్నపత్రాల లీకేజీల దారుణాలు, న్యాయం అడిగిన విద్యార్థులపై జరిగిన దాడులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని గొంతు నులిమే చర్యలపై కాంగ్రెస్ శ్రేణులు ఐజ వీధుల్లో రణభేరి మోగించాయి.కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలతో దిక్కులు పిక్కటిల్లేలా నిరసన తెలపడమే గాక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను తగులబెట్టి తమ ఆగ్రహజ్వాలలను బద్ధలు కొట్టారు.

**విద్యాశాఖ మంత్రికి నైతికత ఉంటే రాజీనామా చేయాలి!**

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు నిప్పులు చెరుగుతూ మాట్లాడారు... "దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల లీకేజీలతో లక్షలాది మంది నిరుద్యోగుల, విద్యార్థుల రక్తాన్ని కేంద్రం తాగుతోంది. ఈ నిలువుదోపిడీపై ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా దేశ ప్రజలకు, బాధితులకు సమాధానం చెప్పి తీరాల్సిందే" అని నిలదీశారు.

**రాహుల్ గాంధీని ఆపడం ఎవరి తరమూ కాదు!**

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రశ్నించే గొంతుకగా మారిన లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. "రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి గజగజ వణుకుతున్న కేంద్రం, అక్రమ అరెస్టులతో భయపెట్టాలని చూస్తోంది. రాహుల్ గాంధీ వెనుక కోట్లాది మంది కాంగ్రెస్ సైనికులు ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేంత వరకు, కేంద్రం దిగివచ్చే వరకు మా పోరాటం ఆగదు" అని హెచ్చరించారు.

**ఎగిసిపడిన కాంగ్రెస్ శ్రేణులు**

ఈ భారీ నిరసన పోరాటంలో జిల్లా కోఆర్డినేటర్ నల్లా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రామేశ్వరమ్మ, పీసీసీ వైస్ చైర్మన్ కురుమన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాముడు, పట్టణ కౌన్సిలర్లు మద్దిలేటి, సులోచనమ్మ, మైనర్ బాబు, మహబూబ్ పాషా, సీనియర్ నాయకులు ఆర్. శ్రీధర్, భూంపురం నరసింహారెడ్డి, ఉప్పల తిమ్మారెడ్డి, దేవేంద్ర, దేవరాజు, రాణమ్మ, హనుమన్న, ఉప్పల తిప్పన్న, రఘుగౌడ్, వీరేష్, తాంద్రపాడు ఉపసర్పంచ్ మహేష్, రవీందర్, గాల్ రెడ్డి, లాల్ గౌడ్, బసవరాజు లక్ష్మన్న, పాండు, షాలులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రదర్శనను ఉప్పెనలా మార్చేశారు.

# దైవచింతనతో మెలగాలి

- **లోక కళ్యాణం కోసం విశ్వశాంతి మహాయాగం**

**కల్వకుర్తి జులై23 (వుదయం ప్రతినిధి):**



సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవచింతన భక్తి భావంతో మెలగాలని ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలని చేస్తున్న విశ్వశాంతి మహాయాగం ఎంతో గొప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నా . పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహిస్తున్న విష్ణు పంచాయతనం, ఆయుత చండి, అతి రుద్రం, శ్రీకృష్ణ కాలచక్ర, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమాలతో పాటు హోమాలు, కుంకుమార్చనలు, కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తూ మానవాళి సుఖశాంతులతో జీవించాలని నిర్వహిస్తున్న యాగం కల్వకుర్తి ప్రజలకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ మంచి చేయాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు, వ్యాపారులు, సమాజంలోని ప్రతి ఒక్కరు సుఖశాంతులతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సమాజ హితం కోసం చేస్తున్న యాగాలు ఫలితాలు ఇచ్చి అందరికీ మంచి జరగాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ భక్తులు, . ఉదయం శ్రీ లక్ష్మి కుబేర, పాశుపత, అష్టలక్ష్మి, గురు గ్రహ హోమాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా, శోభాయమనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణం, భజనలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. 3000 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, జూలూరు రమేష్ బాబు, కల్వ మనోహర్, పోలా సురేందర్, కల్మిచర్ల గోపాల్, బాదం రాఘవేందర్, వాసా శేఖర్, శ్రీధర్, కిషన్, జంగయ్య గౌడ్, మదన మురళి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

- **ఎస్ ఐ ఆర్ సర్వేలో బిఎల్ఎలు చురుగ్గా పాల్గొనాలి**
- **నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

**బిజినాపల్లి, వుదయం ప్రతినిధి:**



అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి పేర్కొన్నారు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బిఎల్ఎ అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు సలహాలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కొత్తగా అర్హత పొందిన వారి పేర్లను నమోదు చేయడంతో పాటు తప్పులు లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని బిఎల్ఎ లకు సూచించారు ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన హక్కు అని ఏ ఒక్క అర్హుడు కూడా ఓటరు జాబితాకు దూరం కాకుండా పార్టీ నాయకులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు

# యూజీసీ స్వయంప్రతిపత్తి హోదా సాధించిన మూన్ రే ఫార్మసీ కళాశాల

**షాద్ నగర్ న్యూస్, జూలై 23,వుదయం ప్రతినిధి:**



షాద్ నగర్లోని మూన్ రే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (MIPS) కు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) ప్రతిష్ఠాత్మక స్వయంప్రతిపత్తి (Autonomous) హోదా మంజూరు చేసింది.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ శ్రీ కె. పర్వత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ గుర్తింపు సంస్థ అభివృద్ధిలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా పేర్కొంటూ, యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి కృషి ఫలితమే ఈ విజయం అని అన్నారు.డైరెక్టర్ కె. సాయి కృష్ణ మాట్లాడుతూ, స్వయంప్రతిపత్తి ద్వారా నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. బి. రాజ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆధునిక సిలబస్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన విద్యను అందించేందుకు ఈ హోదా దోహదపడుతుందని తెలిపారు. సంస్థకు ఇప్పటికే NAAC B++ గ్రేడ్, UGC 2(f) గుర్తింపు, PCI ఆమోదం, JNTUH అనుబంధం, IIC మరియు UBA వంటి గుర్తింపులు ఉన్నాయి. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.



- **కుల మతాలకు అతీతంగా పాఠశాలలు**
- **రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్**

**వెల్దండ, జూలై 22 (వు దయం):**

రాష్ట్రంలో ప్రజా పాలనలో భాగంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రణాళికలు రచించి వందలాది కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి పాఠశాలల నిర్మాణాలు చేపడుతున్నారని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్ చెప్పారు. బుధవారం అచ్చంపేట నియోజకవర్గం లోని వంగూరు, పోల్కంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సలహాలు సూచనలు అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించి ఒక్కో పాఠశాలలో 2500 మంది కి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు ఆ పాఠశాలలో నాణ్యమైన విద్య మంచి భోజనంతోపాటు కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల మాదిరిగానే అన్ని సౌకర్యాలు కలిపిస్తున్నట్లు తెలిపారు దీంతోపాటు తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను ఏర్పాటు చేసి మెరుగైన విద్యఅందించి రాష్ట్రంలోని విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తో తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని చెప్పారు రాష్ట్రంలోని పేద విద్యార్థులు అందరికీ కార్పొరేట్ విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని సూచనలు సలహాలతో తమ విద్యా కమిషన్ పనిచేస్తుందని అన్నారు



# నివాళులర్పించిన రాష్ట్ర నేత

**వెల్దండ, జులై 23 (వు దయం):**

మండల పరిధిలోని రాచూరు గ్రామానికి చెందిన గంగాధరి రాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరా మార్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతు ని కురుంబానికి 5 వేల రూపాయలను అంద జేశారు. ఈ కార్యక్రమంలోమునిసిపల్ చైర్మెన్ సత్యం మాజీ ఎంపిపి పుట్ట రామ్ రెడ్డి మాజీ వైస్ ఎంపిపి అనిల్ కుమార్ మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య నాయకు లు నాగులు నాయక్ అంజి నాయక్ అంజి మాస్టార్ వెంకటయ్య నిరంజన్ రాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బస్సుల్లేవు.. చదువుల్లేవు.. ఇక బతకడమూ నేరమేనా?!



- **పాలకులు నిద్రమత్తులో.. పల్లె చదువులు అగాధంలో!**
- **ఆర్టీసీ రాబందుల అలసత్వానికి బలివుతున్న గ్రామీణ అక్షరాలు!**
- **'బేటీ పఢావో' మాటల ముచ్చటే.. చేతల్లో శూన్యమే!**
- **సీజే ముంగిట కన్నీటి సంతకాలు.. అధికారుల గుండెల్లో గుబులు పుట్టించేలా 'పోస్టుకార్డు' తిరుగుబాటు!**

**గద్వాల, జూలై 23 (వుదయం బ్యూరో):**

డిజిటల్ విప్లవం గురించి సుదీర్ఘ ఉపన్యాసాలిచ్చే పాలకుల పాలనలో.. బడికి వెళ్లేందుకు కనీసం ఒక్క ఆర్టీసీ బస్సు కూడా దొరకని దౌర్భాగ్యం మన తెలంగాణ పల్లెల్లో రాజ్యమేలుతోంది! అధికారుల నిర్ నిర్లక్ష్యం, పాలకుల ఉదాసీనత గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుంటే, విసిగివేసారిన విద్యార్థులు చివరకు తిరుగుబాట పట్టారు. విన్నపాలు వినని చెవిటి అధికారులకు బుద్ధి చెప్పేందుకు నేరుగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికే 'పోస్టుకార్డుల' ద్వారా సవాల్ విసిరారు!

**పల్లెలపై ఆర్టీసీ పగ!**

జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని ఇర్కిచేడు తండా, విద్యాశాఖ అధికారులకు కానీ, ఆర్టీసీ యాజమాన్యానికి కానీ కనీసం చలనం లేకపోవడం దారుణం.

**అక్కడే చచ్చిపోతున్న బాలికల కలలు!**

ప్రభుత్వాలు ఎంతసేపూ మైకులు పట్టుకుని 'ఆడపిల్లలను చదివించండి' అని ఊకదంపుడు ఉపన్యాసాలు దంచడమే తప్ప, వారు బడికి వెళ్లేందుకు ఒక బస్సు వేసే దిక్కులేకుండా పోయింది. ఇది అధికారుల నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న 'అక్షర హత్య' కాదా? అని విద్యార్థినులు ఘాటుగా ప్రశ్నిస్తున్నారు.

రాజ్యాంగం ఇచ్చిన విద్యాహక్కును ఈ అధికారులు బస్సుల్లేకుండా చేసి కాలరాస్తున్నారు. మా భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఆర్టీసీ అధికారుల ఊచలు లెక్కించేలా కఠిన ఆదేశాలివ్వండి. వెంటనే బస్సులు నడిచేలా చర్యలు తీసుకోండి" అని ఆ లేఖల్లో విద్యార్థులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



# గ్రేటర్ హైదరాబాద్



## కేశంపేటలో కాంగ్రెస్ నిరసన ధర్నా



కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేసే విధంగా వ్యవహరిస్తూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలను అరెస్టు చేయడాన్ని, విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ ఈ రోజు కేశంపేట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అనుమగళ్ల రమేష్ ఆధ్వర్యంలో, మాజీ జెడ్పీటీసీ శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తల సమక్షంలో కేశంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన NEET పేపర్ లీక్ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, వారికి మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ఈ క్రింది డిమాండ్లు చేసింది:* కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి.* NEET పేపర్ లీక్ ఘటనపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి.* విద్యార్థులపై లాఠీచార్జ్‌కు ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.* రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.* విద్యార్థుల భవిష్యత్తును రక్షించేలా పారదర్శకమైన పరీక్షా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి.ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, విద్యార్థుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.జై హింద్ - జై కాంగ్రెస్

## రాహుల్ అరెస్ట్: కాంగ్రెస్ నిరసన

**- నీట్ పేపర్ లీకేజ్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన**

**ముషీరాబాద్, జూలై 23(వుదయం)**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు (LOP) రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గురువారం కవాడిగూడ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజ్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర, పారదర్శక విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష స్వరం కీలకమని, అలాంటి ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే నాయకుల గొంతును అణచివేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తోందని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తు రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు



హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏ బ్లాక్ వి.డి కృష్ణ,పి. భాస్కర్,లక్ష్మణ్, శేఖర్, సాయిబాబా, ధర్మేంద్ర,మల్లేష్ యాదవ్, శ్రీను, మద్దెల ప్రభాకర్,రాకేష్, అరుణ్, కృష్ణ, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఐ ప్రవీణ్ రెడ్డికి ఘన సన్మానం



**- అభినందనలు తెలిపిన బీరంగూడ గ్రామ కమిటీ, అమీన్‌పూర్ బీజేపీ నాయకులు**

**- శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడి**

**అమీన్‌పూర్ (వుదయం):**

అమీన్‌పూర్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ రెడ్డిని బీరంగూడ గ్రామ కమిటీ, అమీన్‌పూర్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. బీరంగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు అదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు నూతన సీఐ ప్రవీణ్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అమీన్‌పూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.అదేవిధంగా అమీన్‌పూర్ బీజేపీ కన్వీనర్ ఆగరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అదెల్లి రవీందర్, రాష్ట్ర నాయకుడు ఎడ్ల రమేష్తో పాటు పార్టీ నాయకులు సీఐ ప్రవీణ్ రెడ్డిని కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీరంగూడతో పాటు అమీన్‌పూర్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖతో ఎల్లప్పుడూ సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం, సామాజిక సామరస్యం కొనసాగేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం పెరిగేలా, సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా నూతన సీఐ ప్రవీణ్ రెడ్డి సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ చేపట్టే శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ వంటి కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్ రెడ్డి తనను సన్మానించి అభినందనలు తెలిపిన బీరంగూడ గ్రామ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీరంగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు అదెల్లి రవీందర్, గ్రామ పెద్ద ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షులు పిర్జపతి సత్యనారాయణ, నక్కల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న వీరేశం, కోశాధికారి శివ, కార్యదర్శి బంటు రమేష్, కుత్తడి ప్రభాకర్, బంటు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ తరపున రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అదెల్లి రవీందర్, రాష్ట్ర నాయకుడు ఎడ్ల రమేష్, అమీన్‌పూర్ కన్వీనర్ ఆగరెడ్డి, రమేష్ రెడ్డి, కొండా లక్ష్మణ్, గోపి, రఘు పటేల్, మహేష్, శ్రవణ్, బంటు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగలోపు మాలబస్తీలో నూతన సీసీ రోడ్డు పూర్తి



**- అధికారులతో కలిసి పనులను పరిశీలించిన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్**

**ముషీరాబాద్, జూలై 23(వుదయం)**

మాలబస్తీలో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బోనాల పండుగలోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ తెలిపారు.గాంధీనగర్ డివిజన్ పరిధిలోని మాలబస్తీలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్ గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ సూచనల మేరకు గురువారం ఎ. వినయ్ కుమార్ జలమండలి డీజీఎం వెంకట్ రెడ్డి, మేనేజర్ శివ కుమార్, సంబంధిత అధికారులతో పాటు బీజేపీ నాయకులు, స్థానిక బస్తీవాసులతో కలిసి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడిన వినయ్ కుమార్... ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మురుగునీటి (సేవరేజ్), తాగునీటి పైప్‌లైన్ పనులను మరో రెండు రోజుల్లో పూర్తి చేసి, అనంతరం సీసీ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేసి బోనాల పండుగలోపు పూర్తిచేస్తామని అధికారులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పను పూర్తి చేసి రోడ్డును త్వరలోనే వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, బీజేవైఎం నాయకులు అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, కార్తీక్, మాలబస్తి నాయకులు మధుసూదన్, రమేష్, సత్యనారాయణ, జానకిబాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అన్నారం ఇండస్ట్రియల్ పార్క్‌కు భూసేకరణ ప్రక్రియ ప్రారంభం

**- 66 ఎకరాల స్వాధీనానికి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ**

**- 60 రోజుల్లో అభ్యంతరాలు సమర్పించాలని భూ యజమానులకు సూచన**

**గుమ్మడిదల, జూలై 23 (వుదయం):**

గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఇందుకోసం అవసరమైన 66 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు భూసేకరణ చట్టం-2013 నిబంధనల మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం జూన్ 4, 2026న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజోపయోగ అవసరాల దృష్ట్యా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఈ భూమి అవసరమని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.44 (మార్చి 13, 2026) ప్రకారం ఈ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావ మదింపు (ఎస్ఐఏ) నుంచి మినహాయింపు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఉత్తర్వు మార్చి 16, 2026న తెలంగాణ గెజిట్‌లో ప్రచురితమైంది. భూసేకరణకు సంబంధించిన ప్రణాళికను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో కార్యాలయ వేళల్లో పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు. అలాగే భూసేకరణకు సంబంధించిన తదుపరి చర్యలను చేపట్టేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారికి అధికారాలు అప్పగించినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.నోటిఫికేషన్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి సంబంధిత భూములను జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా విక్రయించడం, కొనుగోలు చేయడం, బదిలీ చేయడం లేదా ఇతర ఎన్‌కంబరెన్స్‌లు సృష్టించరాదని స్పష్టం చేశారు. భూసేకరణపై అభ్యంతరాలు ఉన్న భూ యజమానులు లేదా హక్కుదారులు 60 రోజులలోపు జిల్లా కలెక్టర్ లేదా భూసేకరణ అధికారిగా వ్యవహరిస్తున్న రెవెన్యూ డివిజనల్ అధికారికి లిఖితపూర్వకంగా తమ అభ్యంతరాలను సమర్పించాలని సూచించారు.ఈ నోటిఫికేషన్‌తో అన్నారం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్లు స్పష్టమైంది.

## SIR కార్యక్రమంపై అవగాహన కల్పించిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



రామచంద్రాపురం)

రామచంద్రాపురం డివిజన్లో ఉన్న కాకతీయ నగర్ కాలనీ లో పర్యటించి,కాలనీ లో జరుగుతున్న SIR ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ప్రతి ఒక్క ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫార్మ్ లు ఎలాగా రాయాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఎన్యూమరేషన్ ఫార్మ్ లు అయిపోయినవి వెంటనే సంబంధిత BLO లతో మాట్లాడి ఫారంలను అందచేసి ఆన్లైన్ చేయించిన రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ గారు. సొసైటీ లో కాలనీ అధ్యక్షులు అమృత్ సాగర్ మరియు కాలనీ వాసులతో కలిసి బూత్ లెవెల్ ఆఫీసర్స్ లతో సమావేశం ఏర్పాటు చేసి,ఓటర్ జాబితాలో ఓటర్ పోకుండా చూడాలి అని,అలాగే ఓటర్ కి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి అని ఎన్యుమరేషన్ ఫార్మ్ లో ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలి అని బూత్ లెవెల్ ఆఫీసర్స్ కి సూచించారు.

## కన్నుల పండుగ గా వారాహి మూల మంత్ర హోమం

**హుస్నాబాద్ వుదయం (జులై 23)**

హుస్నాబాద్ పట్టణంలో శ్రీ గాయత్రి ఆధ్యాత్మిక యజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వారాహి మూలమంత్ర మహా హోమ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 జంటలతో 27 హోమ గుండాలతో అతి వైభవంగా హుస్నాబాద్ పట్టణంలో మొట్టమొదటిసారి మహా యజ్ఞం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, టి హెచ్ యు ఎఫ్ అధ్యక్షులు రాపోలు వీర మోహన్, శ్రీ గాయత్రి ఆధ్యాత్మిక యజ్ఞ సేవా సమితి ఫౌండర్ అండ్ చైర్మన్ వేముల ఉమారాణి ముఖ్య అతిథులుగా పాల్గొనగా ప్రధాన అర్చకులుగా భానుమూర్తి హస్తముల మీదుగా పురోహితుల వేద మంత్రం చరణల నడుమ శ్రీ వారాహి మూల మంత్ర హోమ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ మహా ఓమ కార్యక్రమానికి భక్తజన కోటి అధిక సంఖ్యలో తరలివచ్చి వారాహి అమ్మవారి కృపకు పాత్రులైనారు. అలాగే అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

## భారతి నగర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లను సందర్శించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపురం**

భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి గారు నేడు డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ మరియు మ్యాక్ సొసైటీ కాలనీలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లను సందర్శించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు మరియు బూత్ లెవల్ ఏజెంట్లు ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను నింపుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతి అర్హులైన ఓటరికి సరైన మార్గదర్శనం అందిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, ఏజెంట్లకు సూచించారు.అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్‌ఓకు అందించాలని, తద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మ్యాక్ సొసైటీ డైరెక్టర్లు నందగోపాల్, దుర్గా రెడ్డి, రామారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో జరిగిన నిరసన సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించిన వారు, నీట్ లీకేజీపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని కోరారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, ప్రతిపక్ష నేతలపై పోలీసుల ద్వారా చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీ ఘటనలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏసీబీ పట్టుకున్నా లెక్కలేదు

**విద్యుత్ ఉద్యోగుల అక్రమాలకు అడ్డుకట్ట పడేదెన్నడు?**

**ప్రతి పనికి రూ.వేలల్లో లంచాల డిమాండు**

**వికారాబాద్ జులై 24 ( వుదయం బ్యూరో)**

విద్యుత్ ఉద్యోగుల అక్రమాలకు అంతులేకుండా పోయింది. ఈ శాఖలోని కొందరు ఉద్యోగులను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు పట్టుకుంటున్నా ఏమాత్రం భయం కనిపించడం లేదు. పనుల కోసం వచ్చే ప్రజల నుంచి లంచాలు వసూలు చేస్తున్నారు. తాజాగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఉప ఇంజినీరు(డీఈ)ఇంటిపై ఏసీబీ దాడులు చర్చనీయాంశంగా మారింది. కొందరు ఇంజినీర్లు, ఉద్యోగులతోపాటు పొరుగుసేవల సిబ్బంది సైతం సర్వసాధారణంగా మారింది. చౌరబడి రూ.5 లక్షలను అక్రమంగా మంజూరు అప్పుడు డిస్కం సిబ్బంది వినియోగదారుడికి కనెక్షన్ ఇవ్వాలి. ఇదే విధానాన్ని హెచ్‌టీ కేటగిరీలోనూ ప్రవేశపెట్టేందుకు ఫిబ్రవరి మూడో వారంలో ప్రక్రియ ప్రారంభించినా ముందుకు సాగలేదు.నామమాత్రంగా కాల్‌సెంటర్: దక్షిణ డిస్కం కార్యాలయంలో గతంలో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరైనా విద్యుత్ ఉద్యోగులు పనులు చేయకపోయినా, లంచాలు అడిగినా ఈ సెంటర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. దీనికి ఫోన్ చేస్తుంటే అవినీతిపై ఫిర్యాదులు తీసుకోవడంలేదని, ఆధారాలుంటే ఈమెయిల్ చేయాలని చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**IN THE COURT OF THE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS(EXCISE), RANGA REDDY - CUM - V ADDL. JUNIOR CIVIL JUDGE- V ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**

**O.S. No. 540 OF 2026**

**Between:**

**1. AKELLA SOMI DEVI,** W/o. Late Akella Satyanarayana, Aged about 66 Years,

**2. AKELLA SREELEKHA** Alias Naga laxmi Banu Srilekha, D/o. Akella Satyanarayana, Aged about 27 years, Occ: unemployed,

Both are R/o. H.No.1-4-464, Plot No.8, Satya Nagar, Saroornagar Mandal, Ranga reddy District, Telangana - 500035. ...Plaintiffs

**AND**

**1. THE TAHSILDAR,** Saroornagar Mandal, Ranga Reddy District.

**2. All Concerned** ...Defendants

To,

**ALL CONCERNED**

Please take notice that the above Plaintiffs herein have filed the above Suit for declaration of Plaintiffs as legal heirs of **Late Akella Satyanarayana**, who died intestate on12.12.2025. The above Said case is posted to **17.08.2026 at 10.30 am,** if anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**( BY ORDER OF THE COURT )**

**K. VIJENDER,** Advocate, H.No.11-13-1397, Road No.2, Margadarshi Colony, Kothapet, Hyderabad-500102.

**Cell: 70130 61662**

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD**

**O.S. No. 1930 OF 2026**

***Between:***

1. **Suresh Chavan** S/o. Late Shankar Rao Chavan, age: 65 years, Occ.: Retired Government Employee,
2. **Nikitha Chavan** D/o. Suresh Chavan. Aged about 35 years, Occ: Private Employee,
3. **Ankitha Chavan**, D/o. Suresh Chavan. Aged about 30 years, Occ: Private Employee, On behalf of the Plaintiff No. 1 and 2 GPA Holder i.e., Plaintiff No.1 Rep. by their Natural Guardian i.e., father Suresh Chavan R/o. H.No.2-2-1146/16/A, Tilak Nagar, New Nallakunta, Hyderabad, T. G.

**.... Plaintiff/s**

**AND**

1. The Tahsildar, Amberpet Mandal, Amberpet, Hyderabad.
2. All concerned.

**...Defendants**

**NOTIC**

To,

All Concerned

Pleas ta ke notice that the above-said Plaintiff's had filed a suit to Declare Plaintiff's as Legal Heir of LATE DECEASED KALPANA CHAVAN, on the file of Hon'ble XIX Junior Civil Judge, CCC, Hyderabad The said Suit is posted on07.08.2026 for appearance and objections. In case anybody having any claims in the above suit, they may appear on the above mentioned court either in person or through authorized representative at 10.30 A.M. on 07.08.2026, failing which the Hon'ble Court shall pass appropriate orders placing you exparte.

***[BY ORDER OF THE COURT]***

***sd/-***

**G. SANGEETHA ADVOCATE**

**#Shoop No. 6, Silver Oak Complex, Ghansi Bazar, Hyderabad TG 500 002**

**Cell: 9290098191**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT : AT: L.B.NAGAR**

**O.S. NO. 448 OF 2026**

***Between:***

Thakur Yashwanth singh S/o. Late Dilcep Singh

**.... Plaintiff/s**

**AND**

Thakur Akshay singh S/o. Late Dileep Singh Occ: Pvt employe,R/o. Plot NO.21, Ar200, Door No.35-21 WP, Sri vidya Township, Badangpet, Ranga Rcddy District.
2. The Tahsildar, Saroornagar, R.R.DISt.
3. All Concerncd

**...Defendants**

To,

All Concerned

**... Defendant No. 3**

**NOTICE**

Take notice that the above named Plaintiff have filed the above said Suit Vide O.S.NO. 448 OF 2026 for declaration to declare that the plaintiff and Defendant.No.1 are the legal heirs of the deccased Smt Thakur Sujatha Singh W/o. Thakur Dileep Singh as absolute owner cum possessors of the suit schedule property, and the suit is stands posted to 27.08.2026. if any person or persons having any objections or claims they may appear before court on 27.08.2026 at 10:30Am, either in person or through an advocate, failing which the matter will be decide basing on the document available on record.

**SCHEDULE PROPERTY.**

All that the plot nO. 21 western part, in Sy.No.169, admcasuring 160 Sq.Yards or 133.77 sq.mtrs., situtated at Badangpet Village, Saroornagar Mandal, Ranga Reddy District is bounded by:-

NORTH : Plot No. 17
SOUTH : 25' wide road
EAST : Plot No.21 castern Part
WEST : Plot No.22

***[BY ORDER OF THE COURT]***

***sd/-***

**J.V.RAMANAMURTHY ADVOCATE**




## అభిమానులంటే నాకు ప్రాణం

"నా అభిమానుల్ని ఇష్టపడతాను. వాళ్లు ఎదిగితే ప్రాణప్రదంగా చూసుకుంటాను. నన్ను స్ఫూర్తిగా తీసుకుని అందరూ గర్వించేలా ఎదిగారంటే అదే వాళ్లు నాపై చూపించే నిజమైన ప్రేమ అని భావిస్తా. అలాంటి అభిమానుల్ని వివిధ వేదికలపై చూడటం ఆనందంగా ఉంటుంది. జీవితంలో ఎదిగిన అభిమానుల్ని చూసి ముచ్చటపడిపోతుంటా. ప్రతి ఒక్కరూ కలలు కనాలి, నమ్మకంతో ముందడుగు వేస్తే తప్పకుండా అనుకున్నది సాధిస్తారు. కొత్త రక్తం సినిమా పరిశ్రమకి రావాలి. ఆ తరం మరింత ఉన్నతస్థాయికి చేరాలని కోరుకుంటున్నా. తెలుగమ్మాయిలు శక్తి సామర్థ్యాలు చూపించి ఎదగాలని కోరుకుంటున్నా."

**-మెగాస్టార్ చిరంజీవి, అగ్ర కథానాయకుడు**

## వే'మన' పద్యం

**చిప్పబడ్డ స్వాతిచినుకు ముత్యంబాయె**
**నీటబడ్డ చినుకు నీటఁగలిసె**
**బ్రాప్తిగల్గుచోట ఫలమేల తప్పురా**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



# సంపాదకీయం

## పోరాటాన్ని లాఠీలు ఆపగలవా?

వాగన్‌యాన్, చంద్రయాన్4 లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సంసిద్ధమవుతున్నవేళ ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో సీనియర్ శాస్త్రవేత్తల వరస స్వచ్ఛంద రాజీనామాలు, ఉద్యోగ విరమణల నిర్ణయాలు దేశం మొత్తాన్ని కుదిపేస్తున్నాయి. ఇలా సీనియర్ల రాజీనామాలు ఇస్రోలో కొత్తేమీ కాదు. కానీ, ఒకేసారి నూట ఇరవై మంది, అది కూడా 'ఏ' గ్రూప్ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు రాజీనామాలు చేయడం మాత్రం కచ్చితంగా ఇదే మొదటిసారి. వీరంతా ఎందుకు రాజీనామాలు చేశారు? అసలు ఇస్రోలో ఏం జరుగుతోంది? ఈ పరిణామాలు దేనికి సంకేతం? ఇవి ఇప్పుడు అందరిని వేధిస్తున్న ప్రశ్న. నిజానికి 2020 వరకు అంతరిక్ష రంగానికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ ఇస్రో ఆధిపత్యమే కొనసాగేది. కానీ 2023లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "భారత అంతరిక్ష విధానం" ఈ రంగాన్ని సమూ లంగా మార్చేసింది. ప్రయివేటు రంగానికి తలుపులు బార్లా తెరవడంతో అనేక స్టార్టప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చాయి. ఉపగ్రహాల తయారీ, రాకెట్ల నిర్మాణం, భూమి నుంచి అంతరిక్ష కార్యకలాపాలను పరిశీలించే కేంద్రాల నిర్వహణలో కార్పొరేట్ కంపెనీల పాత్ర గణనీయంగా పెరిగింది. ప్రయివేటీకరణ వల్ల ఇస్రోపై భారం తగ్గుతుందనే కుంటిసాకులు చెప్తున్నప్పటికీ, అసలు సవాలు అది కాదు. ఈ ప్రయివేటురంగ సంస్థలు అనుభవజ్ఞులైన ఇస్రో శాస్త్రవేత్తలకు భారీ వేతనాలు, మెరుగైన సదుపాయాలు కల్పించి తమ వైపు తిప్పు కుంటున్నాయి. దీనిపై కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేంద్రసింగ్ స్పందిస్తూ "ఎంతో మంది వెళ్తుంటారు.. వస్తుంటా రు" అని ఒక్క మాటలో తేల్చేశారంటే కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో స్పష్టమవుతుంది. అంతరిక్ష రంగాన్ని ప్రయివేటు సంస్థలకు, దేశీవిదేశీ పెట్టుబడి శక్తులకు తెరిచి ఉంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాలు ఇస్రో స్వయం ప్రతిపత్తిని దెబ్బతీశాయి.

లాభాపేక్షే పరమావధిగా పనిచేసే ప్రయివేటు కార్పొరేట్ సంస్థలు, ఇస్రోలో తయారైన మేధోసంపత్తిని భారీ ప్యాకేజీలతో తమ వైపు తిప్పు కుంటున్నాయి. ప్రభుత్వ రంగంలో శాస్త్రవేత్తల శ్రమకు తగిన గుర్తింపు, సరైన వేతనాలు, పరిశోధనలకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులను ఉద్దేశపూర్వకంగానే తగ్గించడం వెనుక ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉంది. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచి, ఆ తర్వాత "నిర్వహణ సాధ్యం కావడం లేదు" అనే మిషతో ప్రయివేటుకు అప్ప గించే క్రమబద్ధమైన దోపిడీ వ్యూహం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. భద్రత, సార్వభౌమత్వంతో ముడిపడి ఉన్న అంతరిక్ష రంగాన్ని కేవలం లాభ నష్టాల కోణంలో చూడటం చారిత్రక తప్పిదమవుతుంది. ప్రయివేటీకరణ వల్ల తాత్కాలికంగా నిధులు సమకూరినట్టు అనిపించినా, దీర్ఘ కాలంలో అది దేశ స్వయం సమృద్ధిని దెబ్బతీస్తుంది. జాతీయ ప్రయోజనాల కంటే కార్పొరేట్ లాభాలు ముఖ్యం కాదనే సత్యాన్ని పాలకులు గుర్తించి, అంతరిక్ష రంగంలో ప్రయివేటీకరణ దూకుడుకు బ్రేకులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వరుస రాజీనామాలు దేశ సార్వభౌమత్వానికి, ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థకు కేంద్ర పాలకులు చేస్తున్న ద్రోహాన్ని కండ్లకు కడుతున్నాయి. అనుభవజ్ఞులు వెళ్లిపోతే వారి స్థానాలు భర్తీ చేయడం అంత సులభం కాదు. రాజీనామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎదుర్కోవలసిన పెద్ద సవాలిదే. అంత రిక్ష రంగంలో ప్రయివేటు రంగం పాత్ర పెరగాలన్నది ప్రభుత్వ విధానం. ఉపగ్రహాలు, రాకెట్ల తయారీ, భూమ్మీద నుంచి అంతరిక్ష వ్యవహారాలను పరిశీలించే కేంద్రాలు ప్రయివేటు రంగంలో పెంచాలన్నది ప్రభుత్వ ఆలోచన. అనుభవజ్ఞులైన, సామర్థ్యం గల శాస్త్రవేత్తలు ఇస్రో వదిలి వెళ్ల కూడదంటే వారి ఉద్యోగాల్లో ఎదుగుదలకు తగిన అవకాశాలు కల్పించాలి. పరిశోధన చేయడానికి ఎక్కువ స్వేచ్ఛ ఇవ్వాలి. విధాన నిర్ణయాల్లోనూ తగిన స్వతంత్రత ఉండాల్సిందే. ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించాలన్న ధ్యాస ప్రభుత్వానికి ఉంటే ఇవన్నీ ఆశించవచ్చు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం అయినప్పుడు వీటన్నింటికీ అవకాశం ఎక్కడ ఉంటుంది? రక్షణ విభాగంలోనే ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తున్న దశలో ప్రభుత్వ రంగ వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యం ఉంటుందనుకోలేం. అయితే గగన్‌యాన్, చంద్రమండలం నుంచి నమూనాల సేకరణ, చంద్రయాన్4 లాంటి భారీ కార్యక్రమాలు ఉన్నప్పుడు ఆ లక్ష్యాలు సాధించడం ఎలా అన్నది అసలు సమస్య. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహిం చడమంటే ప్రభుత్వ రంగం పీక నొక్కేయడం కాకూడదు. కానీ ప్రయివేటు రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆతృతలో ప్రభుత్వమే పనిగట్టుకుని ప్రభుత్వ రంగ సంస్థలను బలిపెట్టిన ఉదంతాలు కొల్లలుగానే ఉన్నాయి. గగన్‌యాన్ అంటే మానవులు ఉండే అంతరిక్ష పరిశోధనలు, అంతరిక్షంలో మన పరిశోధనా కేంద్ర నిర్మాణం లాంటివి ఉదాత్తమైన లక్ష్యాలే. అవి సాధ్యం కావాలంటే ఇస్రోలో ఉన్న సమర్థులను కాపాడుకోవడానికి తగిన ఆలోచన ప్రభుత్వానికి ఉందా అనేదే అసలు ప్రశ్న.


**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవల సిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః, స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం''ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం.

కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించే వాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు.

కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 జూలై 24, 1899) బ్రిటిష సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిష భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టెనెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు.అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 182829 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు.

కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటిష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు.

అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846



ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది.

1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియోగించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. తర్వాత 1852 గన్నవరం అక్విడక్టు పనులు కూడా కాటన్ ప్రారంభించారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటు లోకి వచ్చింది. ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు.

20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెనువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామి కాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దే. ఆయన బెంగాల్, ఒడిసా, బీహారు, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు, ఒరియాలు, బెంగాలీలు, ఒరియాలు, బీహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమ పాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్... అపర భగీరథునికి, ప్రాతః స్మర స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకోగలరు.

**నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః, స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం" ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం. కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు.**



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్


# మన ఆరోగ్యం మన చేతుల్లోనే

స్వీయ సంరక్షణ అనేది ఒక విలక్షణమైన ప్రక్రియ. దీని ద్వారా ప్రజలు, కుటుంబాలు, సమాజాలు, ఆరోగ్య సంరక్షణ నిపుణుల సహాయంతో లేదా వారి సహాయం లేకుండా, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా తమ ఆరోగ్యాన్ని తాము ప్రోత్సహించుకోవడం, కాపాడుకోవడం, వ్యాధులను నివారించుకోవడం, అనారోగ్యాల కట్టడి చేసుకోవడం, వైకల్యాన్ని ఎదుర్కోవడం చేస్తారు. స్వీయ సంరక్షణ అంటే, ముఖ్యంగా ఒత్తిడి సమయాల్లో, ఒకరి సంతోషాన్ని, శ్రేయస్సును పద్ధతి ప్రకారం కాపాడుకోవడం. ఇది ఒక స్వయం నిర్ణయం తీసుకునే ప్రక్రియ, ఇది ప్రజలు తమ ఆరోగ్యాన్ని త్వరగా, సౌకర్యవంతంగా కాపాడుకోవడానికి వీలు కల్పిస్తుంది. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు స్వీయ సంరక్షణను ఏడు కోణాలలో నిర్వచిస్తున్నాయి. వీటినే ఆరోగ్య అక్షరాస్యత, మానసిక శ్రేయస్సు, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన ఆహారం, ప్రమాద నివారణ, మంచి పరిశుభ్రత, మరియు ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, సేవల బాధ్యతాయుతమైన ఉపయోగం అని గుర్తుంచుకోవాలి.

**అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం :**

ప్రతి సంవత్సరం జూలై 24న ప్రపంచ వ్యాప్తంగా "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం (ఇంటర్నేషనల్ సెల్ఫ్‌కేర్ డే)"ను జరుపుకుంటున్నాం. ఇది 24/7 నిరంతరాయంగా స్వీయ సంరక్షణ పాటించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ ఫౌండేషన్" 2011లో "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవాన్ని" ఏర్పాటు చేసింది, అప్పటి నుండి ప్రతి సంవత్సరం జూలై 24న దీనిని పాటిస్తున్నారు. . ఈ రోజున, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమ స్వీయ సంరక్షణ చర్యల గురించి ప్రజల జ్ఞానాన్ని పెంచడానికి, అవి ప్రజల జీవితాల్లో తెచ్చే ప్రయోజనాలను, ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించు కోవడానికి వేదికగా జరుపుకుంటారు.

**అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం-2026 ఇతివృత్తం:**





ఈ సంవత్సరం 2026లో, "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం" ఇతివృత్తంగా "స్వీయ సంరక్షణ మీ ఆరోగ్యాన్ని మీ చేతుల్లో ఉంచుతుంది: టెస్ట్, ట్రాక్, డ్రైవ్". ఇది ప్రజలు తమ ఆరోగ్య స్థితిని అర్థం చేసుకుని, ముందుస్తుగా చర్యలు తీసుకోవడానికి, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, రోజువారీ అలవాట్లను గమనించుకోవడం పట్ల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. స్వీయ సంరక్షణ వ్యక్తులు మరింత ఆరోగ్యంగా ఉండటానికి, సమస్యలను నివారించడానికి, బ్లాగులు రాయడం, బహిరంగ సభలలో ప్లకార్డులను ప్రదర్శించడం, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో స్వీయ సంరక్షణ కిట్‌లు, విజన్ బోర్డులను సృష్టించి పోస్ట్ చేయడం మొదలైన వాటి ద్వారా ప్రజలకు స్వీయ సంరక్షణపై అవగాహన కల్పించడానికి దోహదపడతారు.

**స్వీయ సంరక్షణ దినోత్సవం యొక్క ముఖ్యమైన చర్యలు:**

ఈ పవిత్రమైన రోజున, మన ఆరోగ్యాన్ని నెమ్మదిగా, స్థిరంగా మెరుగుపరుచుకోవడానికి చర్యలు ప్రారంభించాలని సంకల్పించుకుందాం. 30 నిమిషాలకు పైగా నడవడం, 34 లీటర్ల నీరు త్రాగడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, సుమారు 7 గంటలు నిద్రపోవడం, స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవడం, ఈ స్వీయ సంరక్షణ కార్యకలాపాలు గుండె సంబంధిత ఆరోగ్యం, ఒత్తిడి తగ్గింపు, రోగనిరోధక శక్తిని పెంచడం, గ్రహణశక్తిని మెరుగుపరచడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, మంచి నిద్ర, ఆందోళన తగ్గింపు, భావోద్వేగ నియంత్రణ, మానసిక స్పష్టత వంటి ప్రయోజనాలకు మీకు సహాయపడతాయి.

**మానవీయ సంక్షోభాలు - మహమ్మారులు:**

ప్రపంచవ్యాప్తంగా, ప్రధానంగా అల్ప మరియు మధ్యఆదాయ దేశాలలో, 430 కోట్ల మంది ప్రజలకు అవసరమైన ఆసుపత్రి ఆధారిత ఆరోగ్య కార్యకర్తల సేవలు సక్రమంగా అందడం లేదని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభాలో 20 శాతానికి పైగా మానవీయ సంక్షోభాల బారిన పడుతున్నారు, దీనివల్ల ఆరోగ్య వ్యవస్థలు అవసరమైన చికిత్సలను అందించడం కష్టతరం అవుతోంది. సాయుధ పోరాటాలు, కోవిడ్19 వంటి మహమ్మారులు, వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ప్రభావితం చేసి, దానిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ చిన్న చిన్న కార్యకలాపాలను రోజూ పాటించడం వల్ల మన ఆరోగ్యాన్ని, దీర్ఘకాలిక శ్రేయస్సును అత్యంత ప్రభావవంతంగా కాపాడుకోవచ్చు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మర్చిపోవద్దు. ఒక్క రోజుకే పరిమితం కాకుండా, దీర్ఘకాలం కొనసాగే ఈ అలవాట్లను పాటించండి. గుర్తుంచుకోండి, స్వీయ సంరక్షణలో ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన శారీరక వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ మరియు ఆరోగ్య సంరక్షణ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించడం వంటివన్నీ ఉంటాయి. ఈ స్వీయ సంరక్షణ పద్ధతులు అనారోగ్యాన్ని నివారించడంలో, దీర్ఘకాలిక వ్యాధులను నిర్వహించడంలో, వ్యవస్థలపై భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.





# విద్యా వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లితే

ఓదేశం నాశనం అవ్వా లంటే పెద్ద యుద్ధాలే జరగనవసరం లేదు, అణు బాంబులే పడాల్సిన పనిలేదు. ఆ దేశంలోని విద్యావ్యవస్థపై ప్రజలకు నమ్మకం సడలిపోతే చాలు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థపై ఉద్భవించిన ఆగ్రహా నికి ప్రతీకగా నిలిచిన వ్యక్తి సోనమ్ వాంగ్ చుక్. ఆయన జూన్ 28న ఢిల్లీలో మొదలు పెట్టిన నిరాహార దీక్షకి ఎంతో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేధావుల నుంచి భారీ మద్దతు లభించింది. కానీ ఆయన చేపట్టిన దీక్ష పట్ల ప్రభుత్వం స్పందించిన తీరు మాత్రం అప్రజాస్వామికంగా ఉంది. ఆయన పోరాటం ముగియకముందే... జూలై 18న అక్రమంగా దీక్షా శిబిరం నుంచి తరలించింది. ఆయన ఎవర్నీ కొట్టలేదు, బంధించలేదు, హింసించనూ లేదు. ప్రభుత్వం దిగొచ్చి, చర్చలు జరిపి, సమాధానం ఇవ్వాల్సింది పోయి, ఇలా చెప్పాపెట్టకుండా ఆయన్ను బలవంతంగా లాకెళ్లి ఆస్పత్రిలో పడేసింది. తమ కోసం నిలబడి, ప్రభుత్వాన్ని ప్రశ్నించి, ప్రాణాన్ని పణంగా పెట్టిన వాంగ్‌చుక్ కోసం వేలాది మంది విద్యార్థులు తరలిరావడం మంచి పరిణామం. కానీ, వారు అనుకున్న తీరుగా సర్కార్ నుంచి ఆశించిచన స్పందన లేదు. ఇది నీతి,నిజాయితీ లేని చిత్తశుద్ధిలేని ప్రభుత్వం కదా! అందుకే పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని అంతకుముందే పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధర్యంలో యువత, విద్యార్థులు ఆదివారం చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. విద్యార్థి, యువతను రక్తం కారేలా హింసించింది. ఇదంతా చూస్తే మనది ప్రజాస్వామ్య ప్రభుత్వమా? లేక రాచరిక వ్యవస్థనా? అన్న ప్రశ్నలు సామాన్యపౌరుల్లో తలెత్తడం సహజం.

నేను చాలా వరకు విన్న ప్రశ్నలు ఏంటంటే... 'అవును పేపర్ లీక్ ఎప్పుడూ జరిగేలా జరిగింది. క్షమాపణ కూడా ముగిసింది. అన్ని చోట్లా జరగలేదని తెలిసింది. ముందు ముందు జరగకుండా చూస్తామనే వాగ్దానం జరిగింది. మరెందుకీ దీక్ష? ఎందుకీ యాత్ర? ఎందుకు ఈ అన్యాయమనే అరుపులు? ఎందుకు ప్రభుత్వంపైన ఈ అసంతృప్తి?' వీటన్నింటికీ సమాధానాలు లేకపోలేదు. నీట్ పేపర్ లీక్ జరగడం ఇది మొదటిసారి కాదు. మొట్టమొదటగా 2015లో జరిగింది. అప్పుడు నీట్ స్థానంలో ఉన్న ఎఐపిఎంటి ప్రశ్నా పత్రాలు లీక్ అవడం వల్ల సుప్రీం కోర్టు ఆ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. కొన్ని రాష్ట్రాల్లో కొంత మంది చేసిన తప్పుకి కొన్ని వేల మంది మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. దాని తర్వాత కూడా 2024 లో జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ దేశంలోనే పెద్ద వివాదంగా మారింది. అప్పుడు మళ్లీ విచారణ జరిగింది. దాని సందర్భంగా కొందరిని అరెస్ట్ చేసి, Public Examinations ( Prevention of Unfair means) Act 2024 అనే ఓ కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. ఆ చట్టం ముఖ్య ఉద్దేశ్యం పరీక్ష పత్రాల లీక్‌ని ఆపి, మరింత భద్రతగా పరీక్షలు నిర్వహించి, ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడడం. చట్టమైతే కొత్తది మొదలైంది కానీ ఇప్పుడు 2026 లో జరిగిన పేపర్ లీక్ చూస్తుంటే దాని అమలు ఎంతగా జరిగిందో స్పష్టంగా చెప్పనవసరం లేదు.

ఒక పరీక్షా పత్రం లీక్ అవడం వల్ల ఎవరికి నష్టం? కేవలం విద్యార్థులకు మాత్రమే కాదు అది పూర్తి దేశానికి నష్టం. ఎందుకంటే ఇక్కడ ఓ పోటీ పరీక్షంటే కేవలం మూడు గంటల ప్రక్రియ కాదు, దాని వెనుక ప్రతీ ఒక్కరికి కొన్ని సంవత్స రాల శ్రమ ఉంటుంది. పండగలు పబ్బాలనీ లేకుండా, ఎన్నో సరదాలను కాదనుకున్న రోజులుంటాయి. తిండీ.. నిద్రను పక్కనపెట్టి, రేయింబవళ్లు పుస్తకాలను చూస్తూ గడిపిన కండ్లుంటాయి. తల్లిదండ్రులు చేసిన త్యాగాలుంటాయి. ఓ సీటు కోసం కన్న లక్షల కలలుంటాయి. ఓ పరీక్షే కదా రద్దయిపోయిందని చూసేవాళ్లనుకున్నంత తేలిక కాదు దాన్ని భరించడం. ఇదేదో సాధారణంగా మొదటిసారి జరిగిన పేపర్ లీక్ కాదు. మూడు సార్లు ఓడిన ఓ వ్యవస్థకు ఈ విద్యార్థి తరం ఇచ్చిన ఆఖరి అవకాశం. దాన్ని కూడా నిలబెట్టుకోలేకపోతే... దీన్ని ఏ రకమైన ప్రజాస్వామ్యం అనగలం? ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాళ్లను కోల్పయినవాళ్లు కుంగిపోతున్నారు. ఇప్పటికే ఎన్నో రంగాల్లో స్కాములు జరిగాయి, ఎన్నో రకాల అవినీతులు మొదలయ్యాయి. ఇప్పుడు అందులో విద్యావ్యవస్థ కూడా చేరిపోవడం జీర్ణించుకోలేని నిజంలా మారింది. ఇప్పుడు దేశంలో చేపట్టిన శాంతియుత దీక్షలు, నిరసనలు, ఆందోళనలు వ్యవస్థలోని లోపాలకు, అన్యాయాలకు ప్రతీకలు. అయితే దేశంలోని అతి కొద్ది మంది కోరుకుంటున్నట్లు ఈసారి కూడా అన్యాయమే గెలవొచ్చు. విద్యార్థి ఓడిపోవచ్చు కానీ దాని వల్ల కేవలం విద్యార్థులకే నష్టం అనుకుంటే మాత్రం అది మూర్ఖత్వమే. దేశం మీద, ప్రభుత్వం మీద ప్రజలు నమ్మకం గనుక కోల్పోతే... అది కచ్చితంగా దేశం మొత్తానికి ఓ తీరని శాపంగా మారుతుంది. చదువుతున్న విద్యార్థులంతా... నేను "నిజాయితీగా చదివితే మాత్రం సరిపోతుందా? ఈ దేశంలో నా చదువుకి విలువుందా?" అన్న ప్రశ్న ఉదయిస్తే... ఒక దేశానికి ఇంతకంటే ప్రమాదకరమైన క్షణం మరొకటి ఉండదు. ప్రతీ వ్యవస్థలో పొరపాట్లు జరుగుతాయి. కానీ అలాంటి తప్పిదం జరిగినప్పుడు దాన్ని అంగీకరించి, విశ్లేషించి, తగిన చర్యలను తీసుకుని, నష్టపరిహారాలను భరించి, పోగొట్టుకున్న వస్తువుని జనానికి తిరిగివ్వడం మాత్రమే కాదు, అది మళ్లీ జరగదని హామీ ఇవ్వగలగాలి. ఇచ్చిన దాని మీద నిలబడగలగాలి. అంతే కానీ ప్రశ్నించిన వాళ్లను దేశద్రోహులనడం, ఆడపిల్లలూ... పిల్లలూ అని చూడకుండా, హక్కుల కోసం నిలబడిన వాళ్లను హింసించడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాదు, వాటిని భద్రతగా అమలు చేయగలగాలి. అలా చేయలేనప్పుడు, వ్యవస్థ విఫలమై, దాన్ని ఒప్పుకోనప్పుడు ఎవరో ఒకరు ఇలా దేశం ముందుకొచ్చి నిలబడతారు. ఒక్కరిగా మొదలై, కోట్ల మందికి విస్తరిస్తారు. వాళ్ల ఆకలి అన్నానికి అతీతమై ఉంటుంది. ఈ రోజు ఒక్క వాంగ్ చుక్ మాత్రమే కాదు. దేశం మొత్తం ఆకలితోనే ఉంది. న్యాయం కోసం, పారదర్శకత కోసం, జవాబుదారీతనం కోసం, ప్రజాస్వామ్యం కోసం దేశం మొత్తం ఆకలితోనే అలమటి స్తోంది. పరీక్ష పేపర్ లీక్ అయిన ప్రతీసారి కేవలం పరీక్ష మాత్రమే రద్దు కాదు, ప్రభుత్వం మీద విద్యార్థి ఉంచిన నమ్మకం కూడా అదేస్థాయిలో కరిగిపోతోంది. మంచి విద్యావ్యవస్థ లేని దేశం ప్రజాస్వామ్యంగా నిలబడలేదు. ప్రజాస్వామ్యం లేని ప్రభుత్వం ఎన్నటికీ మనజాలదు. చరిత్ర చెబుతున్న సత్యమిదే.

**ఓదేశం నాశనం అవ్వా లంటే పెద్ద యుద్ధాలే జరగనవసరం లేదు, అణుబాంబులే పడాల్సిన పనిలేదు. ఆ దేశంలోని విద్యావ్యవస్థపై ప్రజలకు నమ్మకం సడలిపోతే చాలు.**

## ప్రియ నేస్తాలు

కుచేల కృష్ణులు ...
కర్ణ దుర్యోధనులు...
ఇతిహాసపు ఆదర్శ మిత్రులు

తూర్పు వేదికపై జనించే
రవిబింబం
రాతిరి ఉదయించే
చంద్రబింబం
ఇవే కదా జగతికి ఆప్తమిత్రులు

జాబిల్లి రాకతో వికసించే
కలువల్లా
పెదవులపై నవ్వుల పువ్వులు
పూయించేది
మిత్రుల ఆగమనమే

మోడువారిన ప్రకృతికి
జీవం పోసేది మబ్బుతునక

జీవన సమరంలో నలిగి
బంధనాల మధ్య బందీయైన
మనసుకు
ఊరటనిచ్చేది స్నేహం

బాధలో తోడునిలిచే చిరునవ్వు
ఒంటరితనంలో ఆత్మీయ
పలకరింపు
దిక్కు తోచనప్పుడు...
మనకు అందే మార్గదర్శనం

స్నేహం

ఆనందంలో మనల్ని
మైమరిపించే
మధుర గానమే నేస్తం

కుల మతాల ప్రస్తావన లేక
హోదాలకతీతమై
మనసెరిగిన ప్రాణ సఖుడు
కోయిలకు ఆమనిలా...
మిత్రులే మన జీవితపు
వసంతాలు

అనంతాకాశాన రేడు చుట్టు
చేరిన
లక్ష నక్షత్రాలు నేస్తాలు

మంచ కొండల్లోని
జీవనదీ ఝరి స్నేహం
మాటలకందని భావం
ఎన్నెన్నో జ్ఞాపకాలు

మరెన్నో
మధురానుభూతుల కలయిక
దోస్తీ
పసితనపు పరిమళాలు
హృదయ దర్పణంలో నింపి
మరో బాల్యాన్ని చవి చూపేవి
ప్రియ నేస్తాలే...



# జాతీయం-అంతర్జాతీయం







## అది అత్యంత తీవ్రమైన సమస్య

- ప్రశ్నాపత్రాల లీకేజీపై సల్మాన్ ఖాన్
- విద్యార్థుల ఉద్యమానికి పూర్తి మద్దతు

**ముంబయి, జులై 23 (ఎ.ఎం.ఎస్):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై, సీజేపీ చేపట్టిన ఉద్యమానికి బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ తన మద్దతు తెలిపారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో విద్యార్థి దశకు సంబంధించిన ఫొటోను పంచుకుంటూ, ఈ వివాదంపై ఆయన భావోద్వేగపూరిత సందేశాన్ని పోస్ట్ చేశారు.ప్రశ్నపత్రాల లీకేజీ అనేది అత్యంత తీవ్రమైన సమస్య అని, మెరుగైన విద్యా వ్యవస్థ సాధన కోసం విద్యార్థులంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయడం అభినందనీయమని సల్మాన్ పేర్కొన్నారు. అయితే, శాంతియుతంగా మొదలైన ఈ ఉద్యమం హింసాత్మక రూపం దాల్చడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘర్షణల్లో గాయపడిన విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు ఆయన తన సానుభూతిని తెలియజేశారు.

ఈ ఉద్యమ ఘనత అంతా విద్యార్థులకే చెందాలని, ఈ సున్నితమైన సమస్యను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోకూడదని సల్మాన్ ఖాన్ స్పష్టం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించి, విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భారత్ అంతర్జాతీయ విద్యా కేంద్రంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ప్రస్తుతం సల్మాన్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటికే ఈ విద్యార్థి ఉద్యమానికి నసీరుద్దీన్ షా, జీనత్ అమన్, సోనాక్షి సిన్హా, ఓమీ వైద్య వంటి పలువురు సినీ ప్రముఖులు తమ మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## వారికి న్యాయం జరగాలి



- విద్యార్థులకు సుప్రీంకోర్టు న్యాయవాదుల మద్దతు

**న్యూఢిల్లీ, జులై 23(ఎ.ఎం.ఎస్):** నిరసన చేపడుతున్న విద్యార్థులకు సుప్రీంకోర్టు న్యాయవాదుల బృందం మద్దతు ప్రకటించింది. నీట్ పేపర్ లీక్ ఆరోపణలు, ఢిల్లీలో ఆందోళనకారులపై జరిగిన పోలీసుల చర్యలను ఖండిస్తూ న్యాయవాదుల బృందం బుధవారం 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, రాజ్యాంగాన్ని కాపాడండి' అనే ప్రచారంలో భాగంగా సంఘీభావం ప్రకటించారు. విద్యార్థులకు న్యాయం జరగాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ పీఠికను చదివారు.

న్యాయవాద వర్గం విద్యార్థులకు మద్దతుగా నిలిచిందని సీనియర్ న్యాయవాది, ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి ఎస్. మురళీధర్ ఉద్ఘాటించారు. హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామని అన్నారు. విద్యార్థులకు జరిగిన అన్యాయం, పోలీసుల అరాచకత్వాన్ని వ్యతిరేకించేందుకు బార్ సభ్యులు ఏకమయ్యారని, వారికిపూర్తి న్యాయపరమైన మద్దతు అందిస్తామని న్యాయవాది అభయ్‌సింగ్ తెలిపారు. యువత హక్కులు సాధించడంపైనే ఈ సమావేశం పూర్తిగా దృష్టి సారించిందని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు.విద్యార్థుల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.

# వరసగా 11వ రోజూ దాడులు, ప్రతిదాడులు

- మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని విస్తరిస్తానంటున్న ఇరాన్
- పికాక్స్ పర్వతమే తదుపరి టార్గెట్ : ట్రంప్
- హౌతీల పైనా దాడులు చేస్తామంటూ బెదిరింపు
- నానాటికీ మోయలేని సైనిక భారం
- అమెరికా చెలగాటం
- సేనలకు ప్రాణసంకటం



**టెహ్రాన్, దుబాయి, జులై 23:** మధ్యప్రాచ్యంలో వరుసగా 11వ రోజు రాత్రి కూడా దాడులు, ప్రతి దాడులు కొనసాగాయి. నతంజ్ సమీపంలోని భూగర్భ అణు కేంద్రంపై త్వరలోనే దాడి చేస్తానని అమెరికా బెదిరించింది. మరోవైపు తన అణు స్థావరాలపై దాడి చేస్తే ఊరుకునేది లేదని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా బెదిరింపుల నేపథ్యంలో రాజధాని టెహ్రాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేసింది. తబ్రిజ్ నగరం పైన, ఛాబహార్, కొనారక్ ఓడరేవు పట్టణాల పైన దాడులు జరిగాయి. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న బుషెహర్ నగరం పైన కూడా అమెరికా దాడి చేసింది. ఇరాన్ సైనిక కార్యకలాపాల కేంద్రాలు, సముద్రయాన సామర్థ్యాలు, డ్రోన్ నిల్వ స్థావరాలు, సైనిక లాజిస్టిక్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపామని సెంట్‌కామ్ తెలియజేసింది. గత మూడు నెలల కాలంలో హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించిన 30 వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేసిందని ఆరోపించింది. కాగా ఇరాన్‌లోని ఖుజెస్థాన్ రాష్ట్రంలోని విమానాశ్రయం సమీపంలో మంటలు వ్యాపించాయని సీఎన్ఎన్ వార్తా సంస్థ తెలియజేసింది. అమెరికా దాడులకు ప్రతిగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడింది. కువైట్, బహ్రెయిన్, జోర్డాన్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. తమ తదుపరి సైనిక లక్ష్యం పికాక్స్ పర్వతమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతంలో ఇరాన్ భూగర్భ అణు స్థావరం ఉన్నదని, అక్కడ యురేనియం శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తున్నారని అమెరికా అనుమానిస్తోంది. 'త్వరలోనే ఆ ప్రాంతంపై దాడి చేస్తాం... అది కూడా భారీగా' అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్స్‌తో మంగళవారం శ్వేతసౌధంలో జరిగిన సమావేశం సందర్భంగా ట్రంప్ విలేకరులకు చెప్పారు. తాను సాధారణంగా లక్ష్యాలను ప్రకటించబోనని, కానీ ఈ దాడి గురించి తెలిసినా వారు చేసేదేమీ ఉండదని అన్నారు. సౌదీ ఓడరేవులను దిగ్బంధిస్తానంటూ చేసిన ప్రకటనకు హౌతీలు కట్టుబడి ఉంటే వారి పని కూడా పడతానని చెప్పుకొచ్చారు. కాగా ఒకవేళ అమెరికా కనుక పికాక్స్ పర్వతంపై దాడి చేస్తే దానిని మధ్యప్రాచ్యంలో యుద్ధ విస్తరణగా చూస్తానని ఇరాన్‌కు చెందిన ఖతమ్ అల్ 'అన్బియా సైనిక కమాండ్ తెలిపింది. అమెరికా, దాని మిత్రదేశాలు, మద్దతుదారులకు చెందిన ఆస్తులన్నింటి పైన దాడులు చేస్తానని హెచ్చరించింది.

ఇరాన్‌లోని పికాక్స్ పర్వతంపై దాడి చేస్తామని ట్రంప్ పదే పదే చెబుతున్నారు. తాను శుద్ధి చేసిన యురేనియం నిల్వలలో కొంత భాగాన్ని, అధునాతన సెంట్రిఫ్యూజ్‌లను (వేర్వేరు సాంద్రతలను కలిగిన పదార్థాలను వేరు చేయడానికి ఉపయోగించే యంత్రాలు) అక్కడి భూగర్భ అణు కేంద్రంలో ఇరాన్ దాచి పెట్టిందని ఇజ్రాయిల్, అమెరికా అనుమానిస్తున్నాయి. పికాక్స్ పర్వతం ఇరాన్ మధ్యలో, భూమి లోపల చాలా లోతులో ఉన్న అత్యంత పటిష్టమైన స్థావరం. ఇది గతంలో అమెరికాఇజ్రాయిల్ బాంబు దాడులకు గురైన నతంజ్ యురేనియం శుద్ధి కేంద్రానికి దక్షిణ దిశగా మైలు దూరంలో ఉంది. దీని నిర్మాణం 2020లో ప్రారంభమైంది. అయితే ఇక్కడ ఇంకా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని, నిర్మాణం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నదని అంటారు. గత జూన్‌లో జరిగిన దాడుల తర్వాత శుద్ధి చేసిన యురేనియం నిల్వలలో కొంత భాగాన్ని ఇరాన్ అక్కడికి తరలించిందని ఇజ్రాయిల్ నిఘా వర్గాలు భావిస్తున్నాయి. పికాక్స్ పర్వతంలోని అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోవాలంటే భూతల దాడులు తప్పవు. అయితే అది చాలా సంక్లిష్టమైన పని. అయినప్పటికీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ (ఐఎస్ఐఎస్) నివేదిక, ఆ ప్రాంతంలో వెంటిలేషన్, హీటింగ్, కూలింగ్, డెలివరీలు, విద్యుత్ సరఫరా, సిబ్బంది నియామకం వంటి విషయాలను పరిశీలించి సాధ్యాసాధ్యాలపై నిర్ణయం తీసుకోవాలని అమెరికా అనుకుంటోంది. ఏదేమైనా అణు కేంద్రం ప్రధాన భాగం భూమి లోతులలో ఉన్నందున దాడుల నుంచి ఆశించిన ప్రయోజనాలు పొందలేకపోవచ్చు.

సౌదీ అరేబియా నౌకలను దిగ్బంధిస్తానంటూ హౌతీలు చేసిన ప్రకటన ఇరాన్ యుద్ధాన్ని విస్తృతం చేసింది. మధ్యప్రాచ్యంలో ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు ఇప్పటికే ఆపసోపాలు పడుతున్న అమెరికా సేనలు హౌతీల నిర్ణయంతో మరింత ఒత్తిడికి గురవుతున్నారు. . హౌతీలతో పోరాడాల్సి వస్తే అమెరికా యుద్ధ విమానాలను గల్ఫ్ నుంచి యెమన్‌కు తరలించాల్సి ఉంటుంది. అప్పుడు సాయుధ దళాలు మిలిటెంట్లతో ఘర్షణలకు దిగుతూనే హౌతీలు ప్రయోగించే క్షిపణుల నుంచి తమనుతాము కాపాడుకోవాల్సి వస్తుంది. హౌతీల ప్రవేశంతో యుద్ధం మరో మలుపు తిరుగుతుంది. పరిస్థితి మరింత దారుణంగా మారి ట్రంప్‌కు తలనొప్పి కలిగిస్తుంది. ఒకవేళ అమెరికా యుద్ధ నౌకలు, విమానాలు హౌతీల క్షిపణులు, డ్రోన్లను కూల్చివేయడం మొదలు పెడితే దాని వద్ద ఉన్న ఆయుధ నిల్వలు అడుగంటిపోతాయి. గగనతల రక్షణ వ్యవస్థలు బలహీనపడతాయి. సౌదీ నేతృత్వంలోని అరబ్ కూటమి జరుపుతున్న దాడులను హౌతీలు ఇటీవలి కాలంలో సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు. హౌతీలపై బాంబుల వర్షం కురిపించారు. పీవోకేకే ప్రధాని అవుతా అదే నా కోరిక పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు ఇస్లామాబాద్, జులై 23: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)కు ప్రధాని కావాలన్నదే తన కోరికని పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ అన్నారు. పీఓకేతో వ్యక్తిగతంగా తనకు ఎంతో అనుబంధం ఉందన్న పాకిస్థాన్ ముస్లిం లీగ్‌నవాజ్ పార్టీ అధినేత.. తాను పీఎం అయితే అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షించే అవకాశం దక్కుతుందని తెలిపారు. పీఓకేలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన నవాజ్... తన పూర్వీకులు కశ్మీర్ నుంచే వలసవచ్చారని చెప్పారు.. మా పూర్వీకులు ఈ ప్రాంతం నుంచే వలస వచ్చారు.. ఈ ఎన్నికల్లో మా పార్టీ గెలిస్తే నన్నే ప్రధానిని చేయాలని ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ను కోరతాను... నేను ప్రధాని అయితే అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షించే అవకాశం దక్కుతుంది' అని నవాజ్ తెలిపారు. పీఎంఎల్-ఎన్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ ప్రాంత అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని నవాజ్ హామీ ఇచ్చారు. మౌలిక సౌకర్యాల కల్పన, రోడ్లు, విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిస్తామని ఆయన స్పష్టం చేశారు. పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసి స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వివరించారు. పీఓకే అసెంబ్లీకి జులై 27, ఆగస్టు 10న ఎన్నికలు జరగనుండగా.. పాకిస్థాన్‌లో మిత్రపక్షాలుగా ఉన్న పీఎంఎల్ (ఎన్), పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)లు ప్రత్యర్థులుగా పోటీచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో శరణార్థులకు ప్రత్యేకంగా సీట్లను కేటాయించడాన్ని నిరసిస్తూ గత నెలన్నర రోజులుగా పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీఓకేలో ఆందోళనలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే.

పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న భారీ నిరసనలతో పీఓకే అట్టుడికిపోతోంది.

# పీవోకేకే ప్రధాని అవుతా అదే నా కోరిక

- పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్, జులై 23:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)కు ప్రధాని కావాలన్నదే తన కోరికని పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ అన్నారు. పీఓకేతో వ్యక్తిగతంగా తనకు ఎంతో అనుబంధం ఉందన్న పాకిస్థాన్ ముస్లిం లీగ్‌నవాజ్ పార్టీ అధినేత.. తాను పీఎం అయితే అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షించే అవకాశం దక్కుతుందని తెలిపారు. పీఓకేలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన నవాజ్... తన పూర్వీకులు కశ్మీర్ నుంచే వలసవచ్చారని చెప్పారు. ఒకవేళ ఈ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తే.. తననే ప్రధానిగా చేయాలని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ను కోరతానని ఆయన తన మనసులో మాటను బయటపెట్టారు.

"పంజాబ్ ప్రావిన్సులు తన మొదటి ఇల్లు అయితే.. పీఓకే నాకు రెండో సొంతిల్లు.. ఈ ప్రాంతం అంటే నాకు ఎంతో ఇష్టం.. మా పూర్వీకులు ఈ ప్రాంతం నుంచే వలస వచ్చారు.. ఈ ఎన్నికల్లో మా పార్టీ గెలిస్తే నన్నే ప్రధానిని చేయాలని ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ను కోరతాను... నేను ప్రధాని అయితే అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షించే అవకాశం దక్కుతుంది' అని నవాజ్ తెలిపారు. పీఎంఎల్-ఎన్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ ప్రాంత అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని నవాజ్ హామీ ఇచ్చారు. మౌలిక సౌకర్యాల కల్పన, రోడ్లు, విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన స్పష్టం చేశారు. పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసి స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వివరించారు.

పీఓకే అసెంబ్లీకి జులై 27, ఆగస్టు 10న ఎన్నికలు జరగనుండగా.. పాకిస్థాన్‌లో మిత్రపక్షాలుగా ఉన్న పీఎంఎల్ (ఎన్), పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)లు ప్రత్యర్థులుగా పోటీచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో శరణార్థులకు ప్రత్యేకంగా సీట్లను కేటాయించడాన్ని నిరసిస్తూ గత నెలన్నర రోజులుగా పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీఓకేలో ఆందోళనలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే.

పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న భారీ నిరసనలతో పీఓకే అట్టుడికిపోతోంది. అదుపు తప్పిన ద్రవ్యోల్బణం, విద్యుత్ ఛార్జీలు, ఉన్నత వర్గాల ప్రత్యేక హక్కులకు నిరసనగా జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (JKJAAC) ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తోంది. రోజు రోజుకూ ఉద్యమం ఉద్ధృతం కావడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. సైన్యం సహాయంతో ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తున్న పాక్.. ఆందోళనకారులపై దమనకాండకు పాల్పడుతోంది. పాక్ సైన్యం కాల్పుల్లో ఇప్పటి వరకూ 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ జులై 21న తలపెట్టిన లాంగ్ మార్చ్‌ను జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ వాయిదా వేసింది. దీనిపై పాక్ నిషేధం విధించడంతో మళ్లీ భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ముజఫరాబాద్‌కు ఈ వారంలోనే లాంగ్ మార్చ్ ప్రారంభమవుతుందని, అదే సమయంలో పీఓకే వ్యాప్తంగా ధర్నాలు కూడా కొనసాగుతాయని హెచ్చరించింది.



పీఓకే అసెంబ్లీకి జులై 27, ఆగస్టు 10న ఎన్నికలు జరగనుండగా.. పాకిస్థాన్‌లో మిత్రపక్షాలుగా ఉన్న పీఎంఎల్ (ఎన్), పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)లు ప్రత్యర్థులుగా పోటీచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో శరణార్థులకు ప్రత్యేకంగా సీట్లను కేటాయించడాన్ని నిరసిస్తూ గత నెలన్నర రోజులుగా పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీఓకేలో ఆందోళనలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే.



## నిరసనలో పాల్గొంటే కేసుల్లో ఇరికిస్తాం

- విద్యార్థులకు పోలీసుల బెదిరింపు
- సోషల్ మీడి యాలో వీడియో వైరల్

**ముంబయి, జులై 23 (ఎ.ఎం.ఎస్):** నిరసనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని ముంబయి పోలీసులు విద్యార్థులను బెదిరించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సిజెపికి మద్దతుగా ముంబయిలోనూ కొందరు విద్యార్థులు నిరసన చేపట్టారు. అయితే వారిపై పోలీసులసు బెదిరింపులకు దిగారు. నిరసనల్లో మళ్లీ మీరు నాకు కనిపిస్తే డ్రగ్స్ కేసులో ఇరికిస్తా. అప్పుడపు మీ జీవితం నాశనమవుతుంది. బెయిల్

**నిరసనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని ముంబయి పోలీసులు విద్యార్థులను బెదిరించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సిజెపికి మద్దతుగా ముంబయిలోనూ కొందరు విద్యార్థులు నిరసన చేపట్టారు.**

కూడా రాదు. జైల్లోనే మగ్గిపోవాల్సి వుంటుంది. అని విద్యార్థులను ఉద్దేశించి ఒక పోలీస్ అధికారి చెబుతున్నట్లు వీడియోలో ఉంది. ముంబయి కాంగ్రెస్ ఈ వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది. వీడియోపై నగర పోలీసులు దర్యాప్తుకు ఆదేశించారు. తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆ పోలీసుని పోస్టింగ్ నుండి తప్పించినట్లు పోలీసులు తెలిపారు.

## కేంద్ర మంత్రి కూతురికి ఆన్‌లైన్ నిరసనలు



- ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డీయాక్టివేట్ చేసిన ధర్మేంద్ర ప్రధాన్ కుమార్తె

**న్యూఢిల్లీ, జులై 23 (ఎ.ఎం.ఎస్):** దేశంలో పోటీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళనలు, విపక్షాల నిరసనలు ఉద్ధృతమవుతున్న వేళ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కుమార్తె నైమిషా ప్రధాన్ ఆన్‌లైన్ నిరసనలను ఎదుర్కొంటున్నారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న నెగెటివ్ ప్రచారం, వ్యక్తిగత విమర్శల నేపథ్యంలో ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డీయాక్టివేట్ చేసుకున్నారు. తండ్రి దేశ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, కుమార్తె మాత్రం విదేశాలలో ఉన్నత చదువులు అభ్యసించడంపై పలువురు నెటిజన్లు ప్రశ్నలు గుప్పిస్తూ ఆమె ఖాతాలో కామెంట్ల వర్షం కురిపించారు. నైమిషా ప్రధాన్ 2023లో అమెరికాలోని మాసాచుసెట్స్‌లో ఉన్న టఫ్ట్స్ యూనివర్సిటీకి చెందిన ఫ్లెచర్ స్కూల్ నుంచి మాస్టర్ ఆఫ్ లాస్ (ఎల్ఎల్ఎం) పూర్తి చేశారు. అనంతరం ఆమె యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్‌లో సీనియర్ అసోసియేట్‌గా చేరారు. అయితే ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల పార్లమెంట్ మార్చ్‌పై పోలీసులు విరుచుకుపడటంతో నిరసనలు మరింత వేడెక్కాయి. ఈ క్రమంలో నెటిజన్లు ఆమె ఇన్‌స్టాగ్రా్ ఖాతాను వెతికి పట్టుకుని, భారత్‌లోని విద్యా వ్యవస్థపై నమ్మకం లేకే విదేశాలకు వెళ్లారా? అంటూ తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాకుండా ఆమె చదువుకున్న టఫ్ట్స్ విశ్వవిద్యాలయం అధికారిక సామాజిక మాధ్యమ పేజీలలో కూడా ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కామెంట్లు పెట్టారు.

## తన రూల్‌ను తానే బ్రేక్ చేసిన నేపాల్ ప్రధాని

- భారత్, చైనాలతో సంబంధాలను సమతౌల్యం చేసేందుకే
- ఈ వారంలో ఇరు దేశాల రాయబారులతో భేటీ
- ది కాఠ్మాండ్ పోస్ట్' పత్రిక వెల్లడి

**ఖాట్మాండు, జులై 23:** విదేశీ రాయబారులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించకూడదనే తన స్వీయ నిబంధనను నేపాల్ ప్రధాన మంత్రి బాలేంద్ర షా బ్రేక్ చేసినట్టు సమాచారం. భారత్, చైనా ఇరుదేశాలతోనూ సంబంధాలను సమతౌల్యం చేసేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ వారంలోనే భారత, చైనా రాయబారులతో ఆయన వేర్వేరుగా భేటీ కానున్నారు. న్యూఢిల్లీ, బీజింగ్ రెండింటికీ నేపాల్ సమాన ప్రాధాన్యత ఇస్తుందని నొక్కిచెప్పేందుకు భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ, చైనా రాయబారి ఝూంగ్ మావోమింగ్‌లతో ఒకే రోజున బాలేన్ షా భేటీ కావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు 'ది కాఠ్మాండ్ పోస్ట్' పత్రిక ఓ కథనం వెలువరించింది.




అయితే, ఈ భేటీ ఖచ్చితమైన తేదీలు ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని నేపాల్ ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బాలెన్ షా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబరు 2025లో 'జెన్ జీ' ఉద్యమంతో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కూలిపోగా.. ఈ ఏడాది మార్చిలో జరిగిన నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో బాలేష్ షా పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సాంప్రదాయ దౌత్య విధానాలకు దూరంగా ఉంటున్నారు. విదేశీ రాయబారులను వ్యక్తిగతంగా కలవడానికి నిరాకరిస్తూ వచ్చిన ఆయన.. ఇప్పటివరకు రెండుసార్లు కాఠ్మాండ్‌లోని అన్నిదేశాల రాయబారులతో కలిసి ఉమ్మడి సమావేశాలు మాత్రమే నిర్వహించారు. గతంలో కొత్తగా ఎన్నికైన ప్రధానులు బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే విదేశీ దౌత్యవేత్తలతో అధికారిక నివాసంలో లేదా ప్రధాని కార్యాలయంలో విడివిడిగా భేటీ అయ్యే సాంప్రదాయం కొనసాగేది. కానీ, ఈ నెల ప్రారంభంలో ఆసియా అభివృద్ధి బ్యాంక్ అధ్యక్షుడు మసాత్సుగు అసకావా నేపాల్‌లో పర్యటించినప్పుడు మాత్రమే ఆయనకు మినహాయింపునిస్తూ షా వ్యక్తిగతంగా కలిశారు. స్థానిక మీడియా నివేదికల ప్రకారం.. ఇటీవల కాలంలో ఆయన వ్యాపార, పారిశ్రామిక వర్గాలు,కాంట్రాక్టర్లు, ఎగుమతిదారులతో తరుచూ సమావేశమవుతున్నారు. "గడిచిన రెండు వారాలుగా వివిధ వర్గాల భాగస్వాములతో ప్రధాన మంత్రి భేటీలు ప్రారంభించారు. ఇప్పుడు విదేశీ రాయబారులు, దౌత్యవేత్తలతో కూడా ఆయన చర్చలు జరపాలని భావిస్తున్నారు. దేశ విదేశాంగ విధాన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని, మన పొరుగు దేశాలైన భారత్, చైనా రాయబారులతో దీనిని ప్రారంభించడం సహజం" అని నేపాల్ ప్రధాని సలహాదారు ఒకరు తెలిపారు. మార్చి 27న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నేపాల్ సందర్శించిన అమెరికా ఉన్నతాధికారుల భేటీ విజ్ఞప్తులను కూడా బాలేన్ షా తోసిపుచ్చారు. కాఠ్మాండ్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కోరినప్పటికీ, సౌత్ సెంట్రల్ ఆసియా అమెరికా వ్యవహారాల సహాయ మంత్రి సమీర్ పాల్ కపూర్, అలాగే డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి సెర్గియో గోర్ వంటి ముఖ్యులను కలిసేందుకు కూడా ఆయన సుముఖత చూపలేదు.

## 74 ఏండ్ల తర్వాత విమాన శకలాల గుర్తింపు

- అట్లాంటిక్ మహాసముద్రం అడుగు భాగంలో ధృవీకరణ
- ఎక్స్‌పెడిషన్ అన్-నోన్' బృందం పరిశోధనలో వెల్లడి
- విమాన వ్యవస్థలోని లోపాలకు ప్రత్యక్ష నిదర్శనం

**న్యూయార్క్, జులై 23:** అంతర్జాతీయ విమానయాన చరిత్రలో అత్యంత ఘోరమైన, అందరూ గుర్తుంచుకునే విమాన విమాన ప్రమాదం 1952లో జరిగింది. ముఖ్యంగా పాన్ యామ్ విమానం ప్రమాదానికి గురి కాగా.. 52 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ విమానానికి సంబంధించిన శకలాలు.. ఇంతకాలం ఎంతగా వెతికినా దొరకలేదు. కానీ 74 ఏళ్ల తర్వాత అంటే ఇప్పుడు ఈ విమానానికి సంబంధించిన శకలాలను పరిశోధకులు గుర్తించారు. 'ఎయిర్/సీ



హెరిటేజ్ ఫౌండేషన్', డిస్కవరీ ఛానెల్‌కు చెందిన 'ఎక్స్‌పెడిషన్ అన్‌నోన్' బృందం సంయుక్తంగా జరిపిన శోధనలో ఈ ఏడాది జూన్ 2వ తేదీన.. సదరు విమాన శకలాలను అట్లాంటిక్ మహాసముద్రం అడుగు భాగంలో ఉన్నట్లు కనుగొన్నారు.

1952 ఏప్రిల్ 11వ తేదీన గుడ్ ఫ్రైడే. అయితే అదే రోజు 'క్లిప్పర్ ఎండీవర్' అనే డగ్లస్ డిసి4 విమానం 64 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో ప్యూర్టో రికోలోని శాన్ జువాన్ నుంచి న్యూయార్క్ వెళ్లేందుకు బయలుదేరింది. టేకాఫ్ అయిన సరిగ్గా 10 నిమిషాలకే విమానం కుడివైపు ఉన్న రెండు ఇంజిన్లు విఫలం అయ్యాయి. దీంతో కెప్టెన్ జాన్ సీ బర్న్ విమానాన్ని శాన్ జువాన్‌కు వాయవ్యంగా 11 మైళ్ల దూరంలో అట్లాంటిక్ సముద్ర ఉపరితలంపై అత్యవసరంగా ల్యాండ్ చేశారు. నీటిపై పడిన సమయంలో ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నప్పటికీ.. విమానంలోకి వేగంగా నీరు చేరడంతో తీవ్ర అలజడి రేగింది. ఎయిర్ ఫోర్స్ సిబ్బంది వచ్చి ఐదుగురు విమాన సిబ్బందితో పాటు కేవలం 12 మంది ప్రయాణికులను మాత్రమే రక్షించగలిగారు. మిగిలిన 52 మంది సముద్రంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

.రాలు కల్గిన స్వయంప్రతిపత్తి సముద్ర అంతర్గత వాహనాల ద్వారా ప్యూర్టో రికో తీరంలో 2,000 అడుగుల లోతున రెండు ముక్కలుగా విరిగిపడి ఉన్న విమానాన్ని గుర్తించారు.

## పసిడి ధరలు పైపైకి
## 10 గ్రాముల బంగారం ధర రూ.1.46,520



**ముంబయి, జులై 23(ఎ.ఎం.ఎస్):** బంగారం, వెండి ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి. పసిడి ప్రియులకు ఇది కొంత నిరాశ కలిగించే అంశమే అయినప్పటికీ, అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ క్రమంలో, నేడు (23వ తేదీ) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో నమోదైన బంగారం, వెండి ధరల వివరాలు కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,520గా నమోదైంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో వినియోగించే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,34,310 వద్ద కొనసాగుతుండగా, 18 క్యారెట్ల ధర రూ.1,09,890గా ఉంది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా పయనించాయి. కిలో వెండి ధర స్వల్పంగా పెరిగి రూ.2,45,100కి చేరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరులోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర మెట్రో నగరాల్లోనూ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,570గా ఉండగా, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాల్లో రూ.1,46,520 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి సిసి రోడ్ల శంకుస్థాపన

**ధర్మసాగర్/హనుమకొండ, జులై 23 (వుదయం ప్రతినిధి)**



ఉనికిచర్ల గ్రామానికి పట్టణ రూపురేఖలుగ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ పరిధిలోని ఉనికిచర్ల గ్రామంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2కోట్లతో నిర్మించనున్న కుడా వెంచర్ నుండి ఉనికిచర్ల వరకు డబుల్ లైన్ సిసి రోడ్డు నిర్మాణానికి, 50లక్షలతో చేపట్టనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు మరియు 2కోట్లతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అలాగే సుమారు 700మంది మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..... పేద ప్రజల స్వంత ఇంటి కళను సాకారం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రెండేళ్లలోనే 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అంటూ ఎన్నో గొప్పలు చెప్పిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉనికిచర్ల గ్రామానికి ఒక్క ఇల్లు అయినా ఇచ్చిందా అని అడిగారు. 1994 ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు ఉనికిచర్ల గ్రామంలో ఎస్సిలకు 70పక్కా ఇల్లు నిర్మాణం చేయించానని అలాగే గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజిలు వంటి అనేక అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. మధ్యలో 20ఏళ్ళు నేను ఎమ్మెల్యేగా లేనని ఈ 20ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న పెద్ద మనుషులు ఎం చేశారో మీకు తెలుసని అన్నారు. మళ్ళీ నేను ఎమ్మెల్యే అయిన ఈ రెండున్నర ఏళ్లలో కోటి 50లక్షలతో అభివృద్ధి పనులు చేశానని ఇవాళ ఒక్క రోజే సుమారు 5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. ఓఆర్ఆర్ నుండి ఉనికిచర్ల వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రానేజిల నిర్మాణం చేపట్టానున్నట్లు అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే స్మశాన వాటికలో 50లక్షలతో ప్రహరీ గోడ, బర్నింగ్ ప్లాట్ ఫామ్ తో పాటు బోర్, వాటర్ ట్యాంక్, ప్రధాన రహదారి నుండి స్మశాన వాటిక వరకు సిసి రోడ్డు 6నెలలలో నిర్మాణం పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ నిధుల ద్వారా త్వరలోనే మహిళా కమ్యూనిటీ హాల్ తో గ్రామంలో అవసరమైన ఇతర అభివృద్ధి పనులను సైతం మంజూరు చేస్తానని తెలిపారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందని మళ్ళీ కడియం శ్రీహరి వచ్చాకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్, ఎంపిడివో, మాజీ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ..

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై - 23**



రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కోకుండా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ దిశగా ప్రజా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసింది. జిల్లావాసులకు ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని గత సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు యంత్రాంగం వేగంగా స్పందించి చర్యలు చేపట్టింది.వేగంగా నీటి తరలింపుభద్రాచలం వద్ద ఉన్న దుమ్ముగూడెం నుంచి రాజీవ్ కాలువ ద్వారా గోదావరి వెనుక జలాలను నాగార్జునసాగర్ (NSP) మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నేరుగా వైరా చెరువుకు తరలిస్తున్నారు.క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం పరిశీలనగురువారం నాడు ఎన్ఎస్పీ మెయిన్ బ్రాంచ్ కాలువకు వేగంగా వస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని, తరలింపు ప్రక్రియను సమీక్షించిన ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను ఈ గోదావరి జలాలతో త్వరితగతిన నింపాలని ఆదేశించారు.నీటి ఎద్దడికి తావులేకుండా జాగ్రత్తలు ఎల్ నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రజలకు ఊరట ఎల్ నినో ముప్పు పొంచి ఉన్న వేళ, సాగర్ మెయిన్ బ్రాంచ్ ద్వారా గోదావరి జలాలు వైరా చెరువుకు చేరుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లయింది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇర్రిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాస చారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 11.55 లక్షల విలువైన గంజాయి ని స్వాధీనం చేసుకున్న కల్లూరు పోలీస్ లు

**సత్తుపల్లి జులై 23(వు దయం ప్రతి నిధి)**



కల్లూరు పట్టణ శివారులో అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కల్లూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, వారి వద్ద నుండి రూ. 11,55,000/- విలువైన 23.100 కేజీల ఎండు గంజాయి, ఒక ఆటో రిక్షా, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు మరియు రూ. 5,000/- రోకడను స్వాధీనం చేసుకున్నట్లుఏసీపీ కల్లూరు వసుందరా యాదవ్ ఐ పి యస్ తెలిపారు.

ఏ.సి.పి తెలిపి వివరాలుతేదీ 22 బుధవారం నాడు ఉదయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సె డి . హరిత తమ సిబ్బంది తో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో పట్టణ శివారు కాశ్మీర శివాలయం ఖాళీ ప్రాంగణంలో ఆటో మరియు బైక్‌లపై కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు.పోలీసు వాహనాన్ని చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీస్ సిబ్బంది వారిని వెంబడించి ఐదుగురిని పట్టుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలు వదిలేసి పారిపోయారు.పట్టుబడిన వారి ఆటోలో తనిఖీ చేయగా 12 ప్యాకెట్లలో ఎండు గంజాయి లభ్యమైంది. వెంటనే కల్లూరు తహశీల్దార్ వారి ద్వారా జి.పి.వో నరసింహరావు, రామకృష్ణ లను పిలిపించి, చట్టబద్ధంగా పంచ నామా నిర్వహించి గంజాయి తో పాటు గా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

అదుపులో తీసుకున్న నిందితుల వివరాలు: ఎ-1 గా పాల్వంచ,మంచి కంటినగర్ చెందిన మహమ్మద్ అన్వర్ తండ్రి:అక్బర్ ఖాన్,ఆటో డ్రైవర్.ఎ -2 గా కల్లూరు పుల్లయ్యబంజర రోడ్డు కు చెందిన షేక్ ముజాహిద్ పాషా తండ్రి: మగ్బూల్, ఆటో డ్రైవర్.ఎ -3 పాల్వంచలోని మంచికంటినగర్ కు చెందిన మహమ్మద్ వజీర్ ఖాన్ తండ్రి: యాకూబ్ అలీ, కార్ డ్రైవర్.ఎ -4 గా హైదరాబాద్ యూసుఫ్‌గూడ కి చెందిన దేవరం రాకేష్ అలియాస్ రాఖీ తండ్రి: నారాయణరావు, ప్రైవేట్ ఉద్యోగం,ఎ -5 గా సికింద్రాబాద్ మహమ్మద్ ఆదిల్ (24) తండ్రి: బోయగూడ కి చెందిన ఖలీద్ వృత్తి బట్టల వ్యాపారం,ఈ కేసులో పరారీలో ఉన్నవారు ఎ -6 రాజు, ఎ -7 కార్తీక్ (ఒరిస్సా మల్కనగిరి చెందినవారుగా గుర్తించారు వీరందరూ

నేర నేపథ్యం, విచారణ ముఖ్యాంశాలు: ఎ -1 మహమ్మద్ అన్వర్ గతంలో ఒరిస్సాలోని మల్కనగిరి జిల్లా యం వి -72 గ్రామానికి చెందిన రాజు, కార్తీక్ ల వద్ద కేజీ రూ. 3,000/- చొప్పున గంజాయి కొనుగోలు చేసి పాల్వంచ, కొత్తగూడెంలో విక్రయించేవాడు. గతంలో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత, హైదరాబాద్‌కు చెందిన ఎ -4 రాకేష్ కు కేజీ రూ. 12,000/- చొప్పున హోల్‌సేల్‌గా విక్రయించడం ప్రారంభించాడు. పోలీసు నిఘా పెరగడంతో తన బావ అయిన ఎ -2 ముజాహిద్ పాషా, బాబాయి ఎ -3 వజీర్ ఖాన్ లను ఈ వ్యాపారంలో భాగస్వాములుగా చేర్చుకున్నాడు. ఒరిస్సానుండి ఆటోలో తెచ్చిన గంజాయి ని కల్లూరులోని ముజాహిద్ పాషా ఇంట్లో నిల్వ చేసి, హైదరాబాద్ నుండి వచ్చిన రాకేష్ (ఎ -4) అతని స్నేహితుడు ఆదిల్ (ఎ-5) లకు విక్రయించేందుకు కల్లూరు శివాలయం వద్ద పంపిణీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు

ఎండు గంజాయి 23.100 కిలోగ్రాములు (12 ప్యాకెట్లు) మార్కెట్ విలువ రూ. 11,55,000/,

వాహనాలు: బజాజ్ డీజిల్ ఆటో (టీ ఎస్ -28-టీ -9175) 2 ద్విచక్ర వాహనాలు (హోండా షైన్, హోండా యస్ పి -160).

ఫోన్లు,నగదు 5 స్మార్ట్‌ఫోన్లు/కీ ప్యాడ్ ఫోన్లు, రూ.5,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు.తదుపరి గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగం చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని మరియు వారికి తగిన పారితోషికం అందించబడుతుందని తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన సి.ఐ ముత్తులింగయ్య,సత్తుపల్లి రూరల్, ఎస్సె డి.హరిత, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, కానిస్టేబుల్లు రంగారావు, రఫీ, విజయకాంత్, డ్రైవరు ఏ.ప్రసాద్లను ఏసీపీ అభినందించారు.

## డీపీహెచ్‌బీ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**యాదాద్రి భువనగిరి జిల్లా తేది: 23.07.2026**



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఈరోజు డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ (DCHB), విలేజ్ డైరెక్టరీ, టౌన్ డైరెక్టరీ సంబంధిత ఫీల్డ్ ఫంక్షనరీల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ కె. భాస్కర్ రావు మాట్లాడుతూ, డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీలో గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన సమాచారం అత్యంత కీలకమని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి ఖచ్చితత్వంతో డేటాను సేకరించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు భవిష్యత్ జనగణన కార్యక్రమాలకు నాణ్యమైన గణాంక సమాచారమే పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ఫీల్డ్ ఫంక్షనరీలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని కోరారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, చార్జ్ అధికారులు, సాంకేతిక అధికారులు మరియు ఫీల్డ్ ఫంక్షనరీలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు నాణ్యమైన శిక్షణతో ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అవుతుంది: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట/భద్రాద్రి కొత్తగూడెం, జూలై 22 (వుదయం ప్రతినిధి):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల మండల స్థాయి ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ (స్పెల్ -1) కార్యక్రమాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN), సామర్థ్యాధారిత బోధన, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ వంటి అంశాల్లో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడంలో ఎంతో దోహదపడతాయనిపేర్కొన్నారు. అలాగే దమ్మపేట మండలంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు నాణ్య మైన ఆహారంతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో శిక్షణ అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఇలాంటి అనుకూల వాతావరణంలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు ఉపాధ్యాయులు మరింత ఏకాగ్రతతో నేర్చుకుని, బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడతాయని తెలిపారు.జూలై 21 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న స్పెల్-1 శిక్షణ కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని ఆధునిక బోధనా పద్ధతులు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN), సామర్థ్యాధారిత బోధన, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ పొందుతున్నారు.ఈ సందర్భంగాత్వరలో పదవీ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు శ్రీ ఎం. మరియన్న (ఎస్‌జీటీ, మొద్దులగూడెం), శ్రీ రాజేశ్వరరావు (మంగాపురం)లను అశ్వారావుపేట ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ దమ్మపేట మండల విద్యాధికారి శ్రీ పి. జగపతి సంయుక్తంగా ఘనంగా సన్మానించి, వారి విద్యా సేవలను అభినందించారు.ఈ శిక్షణ కార్యక్రమానికి దమ్మపేట మండల విద్యాధికారి ( ఎంఈఓ ) శ్రీ పి. జగపతి కోర్స్ కోఆర్డినేటర్గా వ్యవహరించారు. మండల రిసోర్స్ పర్సన్స్ ( ఎమ్మార్పీఎస్ )గా వి. రాంబాబు (గణితం), జె. ప్రభాకర్ (తెలుగు), వి. షరోని కుమారి (ఇంగ్లీష్), బి. రామ్‌సాగర్ (జనరల్ సబ్జెక్ట్స్) శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రామవరం మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ఆ కస్మిక తనిఖీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 23 (వుదయం ప్రతినిధి)**



గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ వైద్య అధికారులను ఆదేశించారు.గురువారం రామవరం మాతా-శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణ, ఓపీ విభాగం, ప్రసూతి వార్డులు, లేబర్ రూమ్, శిశు వార్డు, ఔషధ నిల్వ గది తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందిస్తున్న చికిత్సపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిస్థితి, వారికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, పోషకాహార సదుపాయాలు, ప్రసవాల సంఖ్య తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని ఆరోగ్య సేవలు ప్రతి అర్హ లబ్ధిదారునికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రోగుల నమోదు పుస్తకాలు, ప్రసవాల రికార్డులు, మందుల నిల్వలు, విధి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు నమోదును క్షుణ్ణంగా తనిఖీ చేసి, ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి, అవసరమైన వైద్య సేవలను ఎలాంటి ఆలస్యం లేకుండా అందించాలని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సూచించారు. గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణం రోగుల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ఆసుపత్రి పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా వైద్యులు, నర్సులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.ఈ తనిఖీలో మాతా-శిశు ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గడ్డం లక్ష్మీనారాయణ చిత్రపటానికి సీనియర్ జర్నలిస్టుల ఘన నివాళి



**వరంగల్, జూలై 23 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ వాయిస్ ఈవెనింగ్ డిజిటల్ పేపర్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి సోదరుడు, దివంగత గడ్డం లక్ష్మీనారాయణ దశదినకర్మ వేడుకల్లో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రభ ప్రతినిధి మెండు రవీందర్, అక్షరదర్బార్ ఎడిటర్ వేముల రాజేశ్వర్ రావు, ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత, మన తెలంగాణ ప్రతినిధి వల్లాల వెంకటరమణ, విశ్రాంత ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొని గడ్డం లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లక్ష్మీనారాయణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, మిత్రులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు తగ్గుతున్నాయి

### ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి: కలెక్టర్

**సూర్యాపేట జులై 23; వుదయం ప్రతినిధి**



ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గే అవకాశం ఉందని, భూగర్భ జలాలు నానాటికి తగ్గుతున్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గురువారం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ, తప్పని పరిస్థితుల్లో రైతులు వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. భారతదేశ దక్షిణ ప్రాంతాల్లో వానాకాలం వర్షాలు తక్కువగా ఉంటాయని ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ద్వారా పీజేటీఎస్ఏయూ సౌజన్యంతో వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించిందన్నారు. జూన్ 3 నుండి 12 వరకు నిర్వహించిన గ్రామ సభల ద్వారా వాతావరణ మార్పులపై రైతులు, స్వయం సహాయక సంఘాలకు వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈసారి వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటలు సాగు ఆశాజనకంగా ఉంటుందన్నారు.వరికి నీరు ఎక్కువ - ఆరుతడికి నీరు తక్కువఒక ఎకరా వరికి 44 నుంచి 55 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా, పత్తికి 24-28 లక్షల లీటర్లు, కందులు, పెసలు, మినుములకు 11-14 లక్షల లీటర్లు మాత్రమే అవసరమని తెలిపారు. జొన్న, సజ్జలు, బొబ్బర్లు, రాగులు, కొర్రలు, నువ్వులు వంటి చిరుధాన్యాలకు నీటి అవసరం చాలా తక్కువగా ఉంటుందని, వాటి వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు.జిల్లాలోని నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ స్టేజ్-2, మూసి ప్రాజెక్టు, 1071 చెరువుల్లో నీరు తక్కువగా ఉందని, 54 ఐడీసీ లిఫ్టులు నడిచే పరిస్థితి లేదని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న నీటిని త్రాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. సాగు వివరాలు ఇలా ఉన్నాయిపత్తి: సాధారణంగా 97,566 ఎకరాలు, జూలై 18 వరకు 81,607 ఎకరాల్లో సాగువరి: సాధారణంగా 4,73,656 ఎకరాలు, జూలై 18 వరకు 46,361 ఎకరాల్లో సాగు మొత్తం: 5,80,729 ఎకరాల్లో సాగు లక్ష్యం, జూలై 18 వరకు 1,30,504 ఎకరాల్లో మాత్రమే సాగుఆగస్టు 15 వరకు వర్షాలు ఇదే విధంగా ఉంటే చిరుధాన్యాల విత్తనాలు సరిపడా నిల్వ ఉన్నాయని, 11 రకాల చిరుధాన్యాలతో పాటు కూరగాయల విత్తనాలు 1,45,202.99 ఎకరాల్లో సాగుకు అంచనా ఉందన్నారు. అవసరమైన 29,254.07 క్వింటాళ్లకు గాను 33,486 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సరిపడా ఎరువుల నిల్వలు 2026 సంవత్సరానికి 1,28,183 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటివరకు 44,357 మెట్రిక్ టన్నులు అమ్మగా, 26,763 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

## జల నిర్వహణలో వినూత్న సాంకేతికతలకు ప్రాధాన్యం– కలెక్టర్



**హనుమకొండ, జూలై 23 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పరిధిలో జల వనరుల సమర్థ నిర్వహణ, మురుగునీటి శుద్ధి మరియు నీటి వృథా నివారణకు వినూత్న సాంకేతికతలకు పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో నీటి పరిరక్షణకు సంబంధించిన రెండు వినూత్న స్టార్టప్‌లపై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు.NIT వరంగల్ ప్రొఫెసర్ డా. శిరీష్ ఆధ్వర్యంలోని "హరికేన్ ప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్" స్టార్టప్ ద్వారా గ్రే, బ్లాక్ మురుగునీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించే విధానాన్ని వివరించారు. GWMC, NIT వరంగల్, ASKIల త్రైపాక్షిక ఒప్పందంతో కలెక్టరేట్ (IDOC) ప్రాంగణంలో పైలట్ ప్రాజెక్ట్‌గా మురుగునీటిని శుద్ధి చేసి గార్డెనింగ్‌కు వాడాలని నిర్ణయించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రతినిధి హిరణ్య తల్లం IoT సాంకేతికతతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, పంపింగ్ సిస్టమ్‌లకు స్మార్ట్ సెన్సార్లు, మీటర్లు అమర్చి నీటి సరఫరాను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే విధానాన్ని ప్రదర్శించారు. దీనివల్ల నీటి లీకేజీలు, విద్యుత్ వృథా తగ్గి పంపింగ్ వ్యవస్థ మెరుగవుతుంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ సాంకేతికతలను దశల వారీగా ప్రయోగాత్మకంగా అమలు చేయాలని, ప్రజలకు మేలు చేసే ఇటువంటి ఆవిష్కరణలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో SE ఎస్. రాజ్‌కుమార్, EE మహేందర్, NIT వరంగల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్ ని నో ప్రభావం పై రైతులకు అవగాహన

**చిలుకూరు జూలై 23: (వుదయం)**



ఎల్ ని నో ప్రభావంతో మండలంలో వర్షపాతం తక్కువగా ఉండడం వలన వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ రైతులకు సూచించారు. గురువారం చిలుకూరు రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్కువ నీటితో పండే జొన్న, రాగులు, కందులు, పెసలు, సజ్జలు, కొర్రలు, సాగు చేయాలని సూచించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 'గిఫ్ట్ ఏ స్మైల్' ద్వారా యువకుడికి చేయూత: మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**కాజిపేట్, జూన్ 23 (వుదయం ప్రతినిధి):**



బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని చేపట్టిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఒక నిరుపేద యువకుడికి మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆర్థిక చేయూతను అందించారు. మహబూబాద్ జిల్లా గూడూరు మండలం, తీగలవేణి గ్రామానికి చెందిన ధారావత్ వినోద్ కుమార్ అనే యువకుడి స్వయం ఉపాధి కోసం రూ. 2 లక్షల వ్యయంతో కిరాణం, జనరల్ స్టోర్ షాపును ఏర్పాటు చేసి ఇచ్చారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా వినోద్ కుమార్‌కు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.యువతకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే 'గిఫ్ట్ ఏ స్మైల్' ముఖ్య ఉద్దేశమని దాస్యం వినయ్ భాస్కర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు శ్రీకాంతాచారితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి పర్యవేక్షణతో ప్రభుత్వ సేవల్లో మరింత జవాబుదారీతనం రావాలి: కలెక్టర్

**పెద్దపల్లి ( ధర్మారం) (జూలపల్లి ) జూలై-23 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ శాఖల పనితీరు క్షేత్రస్థాయిలో మెరుగుపడి ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం పెద్దపల్లి, ధర్మారం, జూలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్ ఎంపీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయం, పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి ఎం.పీ.పీ.ఎస్, జడ్పీ.హెచ్.ఎస్, అంగన్‌వాడీ కేంద్రం, రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాగినేడు జడ్పీ.హెచ్.ఎస్, బొంపల్లి జడ్పీ.హెచ్.ఎస్ ప్రాథమిక పాఠశాల, ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే, జూలపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు బోధన అందించాలని, విద్యా ప్రమాణాల పెంపే

**ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రాథమిక నైపుణ్యాలు అందించాలి**

**అంగన్‌వాడీలు, సంక్షేమ హాస్టళ్లు, పీహెచ్‌సీలలో సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి**

**భూముల రీ సర్వేను ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించాలి**

**రెవెన్యూ శాఖలో పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి**



ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులకు అందుతున్న ఆహారం, వసతి, పరిశుభ్రత, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎదుగుదల, పోషకాహార పంపిణీని పరిశీలించిన కలెక్టర్ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితర ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి సాధ్యమైనంత ఎక్కువ వైద్య సేవలను స్థానికంగానే అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామంలోని జడ్పి.హెచ్.ఎస్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు వివరాలు ,ఉపాధ్యాయుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరియు విద్యార్థులకు ఉదయం పాఠశాల లో అందిస్తున్న (రాగి జావా) నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్ రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా రైతులకు రీ సర్వే ప్రయోజనాలను వివరించి ప్రజల పూర్తి సహకారంతో ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.జూలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు జాప్యం లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడం ప్రతి అధికారికి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వేగవంతం చేయాలి

**ధర్మపురి, జూలై 23 (వుదయం ప్రతినిధి):**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశం**

**నేరెళ్లలో నిర్మాణ పనుల క్షేత్ర స్థాయి పరిశీలన**



ధర్మపురి నియోజకవర్గ పరిధి లోని నేరెళ్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన' యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురో గతి, నాణ్యతా ప్రమాణాలు, భవన నమూనా, తరగతి గదులు, వసతి గృహాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత ఇంజనీరింగ్,విద్యా శాఖ అధికారులతో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు అత్యుత్తమ వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు.భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమా ణాల విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం వంటి ప్రాథమిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకుని అధి కారులు ప్రతి పనినీ బాధ్యతా యుతంగా నిర్వహించాలని, పనుల పురోగతిపై ఎప్పటి కప్పుడు సమీక్షలు జరపాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డీవో మధుసూదన్, డిఈఓ కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ కసారపు. బాల గౌడ్ ఇంజనీరింగ్ విభాగాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలన...కలెక్టర్



**జగిత్యాల జులై 23 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల దరూర్ క్యాంపులోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని విద్యార్థులకు అనుకూలంగా ఉండే విధంగా కిచెన్ షెడ్ నిర్మాణ పనులు నాణ్యతతో వేగవంతంగా నిర్మించాలని నిర్మాణం పనులలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె రాజ్ కుమార్ గుత్తే దారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్ జులై 23 (వుదయం ప్రతినిధి):**

**ప్రజలకు ఇబ్బందులు పడకుండా కార్యాచరణ చేపట్టాలి**

**రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, అదనపు కలెక్టర్లు, మూడు జిల్లాల వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో సమస్యలు వచ్చిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని,ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఆరుతడి పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహించాలని, పశుసంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పడిన ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కాలువల భూసేకరణ కోసం రూ.250 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అయితే ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగునీటి కంటే తాగునీటి అవసరాలకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలైన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

## వానకాలంలో ఆరుతడి పంటలే మేలు



**ధర్మపురి, జూలై 23 (వుదయం ప్రతినిధి):**

ఈ వానకాలంలో ఎల్‌నినో ప్రభా వంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున,రైతులు వరికి బదు లు ఆరుతడి పంటలు సాగు చేసేలా చైతన్యపరచాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అధి కారులను ఆదేశించారు. గురు వారం ధర్మపురి రైతు వేదికలో డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రైతులు కంది, మొక్కజొన్న, పెసర, మినుము, జొన్న,వేరుశెన గ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా అవగాహన కల్పిం చాలన్నారు.రైతులకు కావలసిన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రతినిధి జాన్ సుధాకర్,ధర్మపురి సహాయ వ్యవసాయ సంచా లకులు రాంచందర్, మండల వ్యవసాయాధికారులు, విస్తరణఅధికారులు పాల్గొన్నారు.

## 'జలసిరి' ఫామ్ పాండ్ లు భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేస్తాయి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 23 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా, ఫామ్ పాండ్ నిర్మాణ శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో, ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి, అభినందించారు. వారి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ ల నిర్మాణాలు దోహదం చేస్తాయని వివరించారు. ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ ఉన్నాయని, ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంటకు నీరు అందుతుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించి గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి , తహసిల్దార్ శ్రీదేవి, ఎంపిడిఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

**కామారెడ్డి, జూలై 23 (వుదయం ప్రతినిధి):**



జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర వార్షిక తనిఖీల్లో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి స్టేషన్ పని తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ సంతోష్ కుమార్, తాడ్వాయి ఎస్‌హెచ్‌ఓ నరేష్ ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ యూనిఫాం టర్నౌట్‌ను పరిశీలించి, సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణ, క్రమశిక్షణ, ప్రజాసేవలపై సమీక్ష నిర్వహించారు. అధికారులకు ఇచ్చిన సూచనలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉందా లేదా అన్నది స్వయంగా అడిగి తెలుసుకున్నారు.తదుపరి పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, బ్యారెక్స్, టెక్నికల్ రూమ్, స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్ భౌగోళిక మ్యాప్, క్రైమ్ హాట్‌స్పాట్స్ తదితర అంశాలను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై ఎస్‌హెచ్‌ఓను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.అలాగే పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు విధానం, ఆన్‌లైన్ సీసీటిఎన్ఎస్ వ్యవస్థ పని తీరు, ఫిర్యాదుదారులను స్వీకరించే విధానం, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను పూర్తిగా తెలుసుకొని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసం, భద్రత, భరోసా పెంపొందేలా పని చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించాలని, ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తమకు కేటాయించిన గ్రామాన్ని నిరంతరం సందర్శిస్తూ గ్రామ స్థాయిలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట

**నిజామాబాద్, వుదయం, జూలై 23, 2026:**

**నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బ్లాక్ స్పాట్ల నివారణకు రూ.1,023 కోట్లు**

**లోక్ సభలో ఎంపీ అర్వింద్ ప్రశ్నకు మంత్రి గడ్కరీ సమాధానం**




తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్ల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానంలో కీలక వివరాలు వెల్లడయ్యాయని ఓ ప్రకటనలో ఆయన తెలిపారు.తెలంగాణలో గత కొన్నేళ్లలో ప్రమాదాల ఆధారంగా మొత్తం 1,513 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 1,308 బ్లాక్ స్పాట్లకు సంబంధించిన శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. మరో 205 బ్లాక్ స్పాట్లలో శాశ్వత నివారణ చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యత నిజామాబాద్ జిల్లాలో మొత్తం 78 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 75 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 3 ప్రాంతాల్లో చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా జగిత్యాల జిల్లాలో మొత్తం 107 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, అందులో 99 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 8 ప్రాంతాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ ప్రజల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు.నిజామాబాద్ జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తన వంతు కృషి కొనసాగుతుందని అర్వింద్ తెలిపారు.NH-63, NH-61, NH-44పై రోడ్డు భద్రతా పనులు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలోని NH-63, NH-61, NH-44 జాతీయ రహదారులపై వంతెనలు, బైపాస్‌లు, రోడ్డు భద్రతా చర్యలతో కూడిన అభివృద్ధి పనులు వివిధ జాతీయ రహదారి అభివృద్ధి కార్యక్రమాల కింద ప్రణాళిక, అమలు దశల్లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని అర్వింద్ తెలిపారు.నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రోడ్డు భద్రతకు కట్టుబడి ఉన్నాంనిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని తెలిపారు.నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ, వంతెనలు, బైపాస్‌లు, ఇతర రోడ్డు భద్రతా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1,023 కోట్లు కేటాయించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా రోడ్డు భద్రతా పనులను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వైద్యో నారాయణ హరి... ఆ భావానికి నిలువెత్తు నిదర్శనం

**మంచిర్యాల /జూలై 23,(వుదయం ప్రతినిధి)**

**నార్మల్ డెలివరీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న డాక్టర్ శ్రీలత సేవలకు ప్రశంసలు**



డాక్టర్ శ్రీలత, గైనకాలజిస్ట్

వైద్య వృత్తిని కేవలం ఉపాధి మార్గంగా కాకుండా సేవా ధర్మంగా భావిస్తూ వేలాది మంది గర్భిణుల జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్న గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలత, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీలత నర్సింగ్ హోమ్ ద్వారా ఆమె అందిస్తున్న ప్రసూతి, స్త్రీరోగ వైద్య సేవలు జిల్లావ్యాప్తంగా ప్రశంసలుఅందుకుంటున్నాయి. గర్భధారణ ప్రారంభం నుంచి ప్రసవం వరకు ప్రతి దశలో గర్భిణులకు వ్యక్తిగత శ్రద్ధతో వైద్య పర్యవేక్షణ అందిస్తూ, తల్లి–శిశువు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని రోగులు, వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అవసరం లేని శస్త్రచికిత్సలను నివారిస్తూ, నార్మల్ డెలివరీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం డాక్టర్ శ్రీలత సేవల్లో ప్రత్యేకతగా నిలుస్తోందని వారు పేర్కొంటున్నారు.గత వారం రోజుల్లోనే ఐదు విజయవంతమైన నార్మల్ డెలివరీలు నిర్వహించడం ఆమె వైద్య నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు, రోగుల కుటుంబ సభ్యులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి గర్భిణి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, సహజ ప్రసవానికి అవకాశం ఉన్నప్పుడు నార్మల్ డెలివరీనే ప్రోత్సహిస్తూ తల్లి, శిశువు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందిస్తున్నారని చెబుతున్నారు.సాధారణ ప్రసవాలతో పాటు క్లిష్టమైన గర్భధారణ కేసులను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తూ అనేక కుటుంబాలకు ధైర్యాన్ని అందిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. గతంలో ఇలాంటి క్లిష్ట కేసుల కోసం హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మంచిర్యాలలోనే ఆధునిక వైద్య సదుపాయాలతో చికిత్స అందుబాటులో ఉండటంతో సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని గర్భిణులు అంటున్నారు.అత్యవసర పరిస్థితుల్లో సైతం సకాలంలో వైద్య సేవలు అందించడం, రోగుల పట్ల ఆప్యాయతతో వ్యవహరించడం, చికిత్సకు సంబంధించిన ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యులకు వివరించి ధైర్యం చెప్పడం డాక్టర్ శ్రీలత సేవల్లో మరో విశేషమని స్థానికులు పేర్కొంటున్నారు. వైద్యో నారాయణ హరి" అన్న నానుడికి అర్థం చెప్పేలా సేవలందిస్తున్న డాక్టర్ శ్రీలతకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలలనుంచి గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేస్తున్నారు. సేవాభావం, అంకితభావం, వైద్య నైపుణ్యంతో మరెన్నో కుటుంబాల్లో సంతోషాలను నింపాలని ఆకాంక్షిస్తూ ఆమె సేవలను కొనియాడుతున్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు.. కలెక్టర్

**ఆసిఫాబాద్(వుదయం ప్రతినిధి):**



విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం మోవాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని గుర్తించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లు ఖాళీగా ఉండటంతో పాటు మందుల వివరాలు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. హాజరు పట్టికను పరిశీలించగా గత పది రోజులుగా సిబ్బంది హాజరు నమోదు లేకపోవడంతో వారికి గైర్హాజరు వేశారు. అనంతరం గ్రామం లోని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, 58 మంది విద్యార్థులకు 10 మంది ఉపాధ్యాయులు ఉండడాన్ని గమనించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన ఆమె విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలపై ఆరాతీశారు.భోజనం నాణ్యంగా అందించడంతో పాటు విద్యార్థులకు ఆర్.ఓ. తాగునీరు అందుబాటులో ఉండేలాచూడాలనిఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామ పటేల్‌ను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రతి కుటుంబం తమ వివరాలనుతప్పనిసరిగానమోదు చేయా లని సూచించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆక్రమణల 'వల'లో రేగుమానుకుంట!

- నీటి వనరుపై నేతల పంజా.. జూరాల ఆయకట్టుకు ఉరితాళ్లు!
- ఎఫ్‌టీఎల్‌ను పిండేసి.. చేపల చెరువులు తవ్వేసి!
- సర్వే కొంపముంచుతుందనే.. అధికార పక్ష అగ్రనేత అనుచరుడి 'గడబిడ'!
- 'వాల్టా' చట్టానికి నీళ్ళు.. రెవెన్యూ మామూళ్ళ 'మౌనం'పై అగ్గిమీద గుగ్గిలమవుతున్న రైతాంగం!

గద్వాల, జూలై 23 (వుదయం బ్యూరో):



గద్వాల మండలం లత్తిపురం సమీపం లోని *'రేగుమానుకుంట'*పై అక్రమా ర్కుల శని నీడలు కమ్ముకున్నాయి. వందలాది ఎకరాల పొలాలకు ప్రాణా ధారమైన జలవనరును కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కుంటనే మింగేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. జూరాల ప్రాజెక్టు కుడి కాలువ కింద అత్యంత కీలకమైన ఈ కుంటను చాపకింద నీరులా కబళించి, యథేచ్ఛగా అక్రమ చేపల చెరువులుగా మార్చేస్తుంటే.. రైతాంగం కన్నీరుము న్నీ రవుతోంది. ఈ దందాపై సాగునీటి శాఖ అధికారులు దిగి, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) హద్దులు తేల్చేందుకు రెవెన్యూ యంత్రాంగంతో సంయుక్త సర్వేకు సిద్ధమవడంతో అధికార పార్టీ అగ్రనేత అనుచరుడికి పూనకం వచ్చింది. సర్వే జరిగితే తమ పాపపు పుట్ట బద్దలై, కబ్జాకోరులు బయటపడతా యన్న భయంతోనే ఆ నేత అనుచరుడు సర్వే ప్రక్రియను అడ్డుకునేందుకు సామ దామ దండ భేదాలను ఉపయోగిస్తున్న ట్లు స్థానికంగా సంచలనం రేపుతోంది.

**ఎఫ్‌టీఎల్‌లోనే నాలుగు చెరువులు.. బఫర్ జోన్ కూడా బొకే!**

జూరాల ప్రాజెక్టు 9L, 10L డిస్ట్రిబ్యూ టర్ల ద్వారా 40 ఎకరాల అధికారిక ఆయకట్టుకు నీరందించే ఈ కుంట విస్తీర్ణం కాగితాల్లో 28.03 ఎకరాలు. కానీ, క్షేత్రస్థాయిలో కన్నుపడిందో లేదో అక్రమార్కులు కుంటను నలుమూలలా పిండేశారు.కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఏకంగా నాలుగు భారీ చేపల చెరువులు తవ్వేశారు!నీటి పారకానికి రక్షణ గోడ లాంటి బఫర్ జోన్‌ను సైతం బరితెగించి ఆక్రమించి, వ్యవసాయ భూములుగా మార్చేశారు.

కుంట స్వరూపాన్నే మార్చేయడం తో రాబోయే రోజుల్లో ఆయకట్టు ఎండిపోయి, రైతుల కడుపు కాలే పరిస్థితి దాపురిస్తుందని సాగునీటి శాఖ అధికా రులు లబోదిబోమంటున్నారు. ఈ అక్ర మాల చిట్టాను ఇప్పటికే జిల్లా కలెక్టర్ ముందర ఉంచినట్లు సమాచారం.

పంచాయతీ అనుమతుల్లేవు.. 'వాల్టా'ను పాతిపెట్టేశారు!ఎలాంటి పంచాయతీ అనుమతులు లేకుండా, నిబంధనలకు పాడేసి ఆయకట్టు భూముల్లో యంత్రా లతో చెరువులు తవ్వుతుంటే రెవెన్యూ యంత్రాంగం నిద్రపోతోందా? లేక అక్రమార్కుల ముసుగులో ముడుపుల మత్తులో జోగుతోందా? అని రైతులు నిలదీస్తున్నారు. అధికారుల జేబులు నిండాయా?: నిబంధనల ప్రకారం సేద్యానికి పనికిరాని చౌడు భూముల్లో మాత్రమే చేపల చెరువులకు అను మతివ్వాలి. కానీ, సస్యశ్యామలమైన ఆయకట్టు పరిధిలోనే యంత్రాలు పెట్టి కుంటను తవ్వేస్తుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు కళ్ళు అప్పగించి చూస్తున్నారు? చట్టం చచ్చింది: భూగర్భ జలాలు, జలవనరులను కాపాడాల్సిన 'వాల్టా' చట్టాన్ని ఈ అక్రమార్కుల కాళ్ళ దగ్గర తాకట్టు పెట్టారా అని రైతాంగం ఆగ్రహంతో రగిలిపోతోంది. మల్దకల్ మండలంలోనూ అదే 'రాబందుల' దందా! రేగుమానుకుంటపై పడ్డ కబ్జా రాబందుల నీడ గద్వాలకే పరిమితం కాలేదు. పొరుగునే ఉన్న మల్దకల్ మండ లంలోని బూడిదపాడు, ఎల్కూర్ గ్రామా ల్లోనూ నీటి వనరులను ధ్వంసం చేస్తూ అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు జరుపుతున్నారు. రేగుమానుకుంట సర్వే కనుక సజావుగా జరిగి ఆక్రమణ లు కూల్చేస్తే.. తమ అక్రమ సామ్రాజ్యా లు కూలిపోతాయనే భయంతోనే ఈ కబ్జాకోరుల ముఠా సర్వేను అడ్డుకోవడా నికి సర్వశక్తులూ ఒడ్డుతోంది.తోకము డిచేది లేదు.. పారదర్శకంగా సర్వే జర గాల్సిందే! ఎవరి అండదండలతో ఈ అక్రమ చెరువులు తవ్వారు? ఎంత మేర ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను మింగేశారు? అనే నిజాలు తేలాలంటే సంయుక్త సర్వే జరిగి తీరాల్సిందే. ఏ నాయకుడి ఒత్తిళ్ల కు తలొగ్గకుండా సర్వే పారదర్శకంగా నిర్వహించాలి.— బాధిత రైతాంగం హెచ్చరిక అధికార పార్టీ నేతల బెది రింపులకు భయపడకుండా, సర్వేను పారదర్శకంగా పూర్తి చేసి ఎఫ్‌టీఎల్ హద్దులను ఖరారు చేయాలని, కుంటను ఆక్రమించిన ముఠాపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాం గాన్ని ఘాటుగా హెచ్చరిస్తున్నారు.

## త్వరలో స్టేడియాన్ని అందుబాటులోకి తెస్తాం

- ఉదయ్ ఆర్మీ అకాడమీని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్, జూలై 23 (వుదయం బ్యూరో)



జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్ వెనుక ఉన్న ఉదయ్ ఆర్మీ అకాడమీని ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గురువారం నాడు సందర్శించారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యా ర్థులతో మాట్లాడి వారి లక్ష్యాలు, శిక్షణ విధానం గురించి అడిగి తెలుసుకున్నా రు. అనంతరం విద్యార్థులతో కలిసి రన్నింగ్ చేస్తూ వారిని ఉత్సాహపరిచా రు.ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహ కులు శిక్షణ కోసం ప్రత్యేక గ్రౌండ్ అవ సరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఇప్పటికే స్టేడియం మంజూరైందని, ప్రస్తుతం తగిన స్థలాన్ని పరిశీలిస్తున్నామని, త్వ రలోనే స్టేడియాన్ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.ఈ అకాడమీ ఇప్పటికే విశేష ఫలితాలు సాధించింది. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన 39 మంది విద్యార్థుల్లో 37 మంది భారత ఆర్మీలో ఎంపికయ్యారు. ప్రస్తుతం 100 మంది విద్యార్థులు దేశ సేవే లక్ష్యంగా కఠిన శిక్షణ పొందుతున్నారని నిర్వా హకులు తెలిపారుఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, కౌన్సిలర్ మాధవి రాజు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట, జూలై 23 (వుదయం ప్రతినిధి):




ఎల్ నినో వాతావరణ పరిస్థితులలో రైతులు వ్యవసాయ ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.గురువారం నారా యణపేట జిల్లా కేంద్రం స్కిల్ డెవలప్మెం ట్ సెంటర్ లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యం లో ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా తయారు చేయబడ్డ ఎల్ నినో నేపథ్యంలో పంటల ప్రణాళికలు పుస్తకాన్నీ ఆవిష్క రించడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల పంపిణీలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందనీ ఈ పరిస్థితుల్లో ప్రతి రైతు ముందస్తు ప్రణాళికతో వ్యవసా యం చేపట్టడం అవసరం అన్నారు. వాతావరణ శాఖ విడుదల చేసే అంచ నాలను ఎప్పటికప్పుడు గమనించి వ్యవ సాయ పనులను ప్రణాళికాబద్ధంగా ని ర్వహించాలని రైతులకు సూచించారు. ఆలస్యంగా వర్షాలు వచ్చినట్లయితే తక్కువ కాలవ్యవధి గల కరువు తట్టుకు నే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల వైవిధ్యీకర ణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించా రు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్ట ర్ కి రైతులు తెలిపారు. వారి సమస్యలు విని, సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రైతు శాస్త్రవేత్త డాక్టర్ సత్య నారాయణ మాట్లాడుతూ వివిధ పంటలలో సస్య రక్షణ చర్యల గురించి, ఎల్ నినో వాతా వరణ పరిస్థితుల్లో రైతులు చెప్పల్సిన చర్యల గురించి, నానో యూరియా నానో డి ఏ పి వాడకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, , జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, శాస్త్రవేత్తలు ,గ్రోమోర్ అధికారి ఇతర అధికారులు, రైతులు,గ్రోమోర్ కంపెనీ వారు, బి కే ఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వేంకోబా హాజరయ్యారు.

## ఎస్ఐఆర్‌లో పాల్గొనండి పటాన్చెరు అభివృద్ధిలో భాగస్వాములు కండి

- ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనది
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఎస్ఐఆర్ అవగాహన కోసం 30 ప్రచార రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

పటాన్చెరు, (వుదయం):



ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతి ఓటు ప్రాణ ధారమని, ఓటు హక్కును పరిరక్షించు కోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పటా న్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవ ర్గంలో ఓటర్ల జాబితా నిరంతరం కొనసాగా లంటే అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ (Special Intensive Revision) ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, ఆగస్టు 3వ తేదీ లోపు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గురువారం పటాన్చెరు డి విజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందు కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 30 ప్రచార రథాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల భాగస్వా మ్యంతోనే ఒక ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఆ భాగస్వామ్యా నికి తొలి మెట్టు ఓటు హక్కేనని స్పష్టం చేశారు.పటాన్చెరులో శాశ్వతంగా నివసి స్తున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో పాల్గొనని వారు తమ విలువైన ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి, పటాన్చెరు అభివృద్ధి ప్రస్థా నంలో భాగస్వాములు కావాలంటే ప్రతి ఓటరు బాధ్యతగా ఎస్ఐఆర్‌లో పాల్గొనా లని కోరారు. నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లు, మూడు మున్సిపాలి టీలు, రెండు మండలాల్లోని ప్రతి వార్డు వరకు ఈ ప్రచార రథాలు చేరుకుని ప్రజల కు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. అలాగే ప్రజా స్థలాలు, క్రీడా ప్రాంగణాలు, విద్యా సంస్థలు, పార్కులు, మార్కెట్లు, పారిశ్రామిక ప్రాంతాలు తదితర ప్రజా ప్రదేశాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ఎస్ఐఆర్ ప్రాముఖ్య తను విస్తృతంగా తెలియజేస్తున్నట్లు వెల్ల డించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్ర తినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ నేను ప్రభావం వల్ల వర్ష ప్రభావం తగ్గే అవకాశం

- వ్యవసాయ అధికారిణి లావణ్య

వుదయం న్యూస్, శివ్వంపేట జూలై 23:



మెదక్ జిల్లా శివ్వంపేట మండల వ్య వసాయ శాఖ అధికారిణి లావణ్య విలేకర్లసమావేశంలో రైతులను ఉద్దే శించి ఆమె మాట్లాడుతూ . ఎల్ నినో ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో వర్ష పాతం తగ్గడం. అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం. పంటల సాగుపై దీని ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. రైతులు వాతావరణ సూ చనలను బట్టి పంటల సాగు చేసుకో వాలి. నీటి వినియోగాన్ని పొదుపుగా నిర్వహించడం. నేలలోని తేమను కాపాడే చర్యలు చేపట్టాలి. అలాగే ప్యాక్స్ ఇతర ఎరువుల డీలర్లకు రవాణా చార్జీల భర్తులను ఇటీవల నిలిపివేసిన నేపథ్యంలో దూరాన్ని బట్టి విక్రయ కేంద్రాలు రవాణా చార్జీలు తీసుకుంటారని. యూరియా ధరలో మార్పులు ఉంటాయని తెలిపారు.

## 33వ వార్డులో సీసీ రోడ్డు పనులపై కమిషనర్ పరిశీలన



- నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలి: మున్సిపల్ కమిషనర్

సంగారెడ్డి, వుదయం:

: సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని 33వ వార్డు రెవెన్యూ కాలనీలో జరు గుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కాం ట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనులను నిర్ణీత ప్రమాణాల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈ రఘు, కౌన్సి లర్ రవీందర్ నాయక్, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ధర్నా చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు

- నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్...

మెదక్ జిల్లా ,వుదయం:



నిజాంపేట మండలం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్ష నాయకుడు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసిస్తూ నిజాంపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకటేష్ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ మోడీ రాజీనామా చేయాలంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి పరీక్షలు లీక్ అయినందున విద్యార్థులు శాంతియు తంగా ధర్నా చేపడుతుంటే పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేయడం దారుణమ ని వెంటనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ త్యాగాల కుటుంబమని ఇందిరా గాంధీ నుండి మొదలుకొని రాజీవ్ గాంధీ వరకు దేశానికి చేసిన సేవలు మర్చిపోలేవు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థి నాయకుల సంఘాలకు క్షమాపణ చెప్పాలని నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం ధర్నా వద్దకు ఎస్సై రాజేష్ చేరుకుని నాయకులకు సర్ది చెప్పి ధర్నా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొమ్మట బాబు, పి ఎస్ సి ఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు బొమ్మన మల్లేశం, రామచందర్ నాయక్, జెల్ల లక్ష్మణ్ గౌడ్, లక్ష్మా గౌ డ్,ఉప సర్పంచ్ లు ఆకుల మహేందర్, అంజిరెడ్డి,కుమార్, దేవరాజ్, నాయకు లుగరుగుల శ్రీనివాస్,సుధాకర్, రాజేష్, కనకరాజు,శ్రీకాంత్,కంతల కొండల్, పరశురాములు, భూపతి రెడ్డి, టంకరి లక్ష్మణ్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 26న "పసరంటిన కొడవలి" కవిత్వం ఆవిష్కరణ

- ముఖ్యఅతిథులు: సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి
- నెలపొడుపు ఆధ్వర్యంలో సాహిత్య సభ

నాగర్ కర్నూల్, జూలై 23 (వుదయం ప్రతినిధి) :

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ ఆదివారం వనపట్ల సుబ్బయ్య రచించిన "పసరంటిన కొడవలి అమ్మ జీవితం" కవిత్వ పుస్తకా విష్కరణ సభ జరగనుంది.ఆదివారం ఉదయం 10 గంటలకు నల్లవెల్లి రోడ్డు లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ శాసనసభ్యుడు మర్రి జనార్ధన్ రెడ్డి హాజ రవుతారని నెలపొడుపు సాహిత్య సాం స్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్, కల్వకోల్ మద్దిలేటి, ఎదిరేపల్లి కాశన్న గురు వారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రధాన వక్తగా ఆచార్య కోయి కోటేశ్వరరావు పాల్గొంటారని, విశిష్ట అతిథులుగా కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, చిం తలపల్లి భాస్కర్ రావు, కవులు నాగవరం బాల్ రాం, తగుళ్ల గోపాల్ తదితరులు హా జరవుతారని వారు పేర్కొన్నారు.కవులు, కళాకారులు, రచయితలు, సాహిత్య అభిమానులు పెద్దఎత్తున హాజరై కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అభివృద్ధికి కేంద్ర సహకారం కోరిన ఎమ్మెల్యేలు

సంగారెడ్డి, వుదయం:



సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవ ర్గాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని కోరుతూ పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్రతో కలిసి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబా ద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కేంద్ర రైల్వే, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఢిల్లీలో కలసి వినతిపత్రాలు సమర్పించారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంగా వేగంగా అభి వృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రతిపా దిత హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) కారిడార్‌లో సంగారెడ్డిలో ప్రత్యేక స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మె ల్యే చింతా ప్రభాకర్ కోరారు. సంగారెడ్డి హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పాటు ఐఐటీ హైదరాబాద్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఔషధ పరిశ్రమలు, జాతీయ రహదారులు, రీజినల్ రింగ్ రోడ్ వంటి కీలక మౌలిక సదుపాయాలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వేలాది కుటుంబాలు స్థిరపడుతున్నందున బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేస్తే లక్షలా ది మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు అవసర మైన పరిపాలనా, సాంకేతిక చర్యలు చే పట్టాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరారు. రేక్ పాయింట్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, ధాన్యం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్ ఉత్పత్తుల రవాణా సులభతరమై, రవాణా వ్యయాలు తగ్గు తాయని తెలిపారు. తద్వారా రైతులు, వ్యాపారులు, పరిశ్రమలకు ప్రయోజనం కలగడంతో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి పె రుగుతాయని పేర్కొన్నారు.అలాగే హైద రాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్ డీపీఆర్‌లో జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను చేర్చి, జహీరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు. 12,656 ఎకరాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (NIMZ), జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులు అభివృ ద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచస్థాయి రవాణా సదుపాయాలు అవసరమని వివ రించారు.పారిశ్రామిక అభివృద్ధి కోసం వేలాది మంది రైతులు భూములు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలని కోరారు. జహీరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ స్టాప్ ఏర్పాటు చేస్తే పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి, ఎగుమతులు, లాజిస్టిక్స్ రంగాలు మరింత అభివృద్ధి చెందడంతో పాటు తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంత ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.వి నతిపత్రాలను స్వీకరించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించి, అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన ట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పులి వీరన్న జయంతి వేడుకలు

మహబూబ్ నగర్, జూలై 23 (వుదయం ప్రతినిధి):



మహబూబ్ నగర్ మాజీ శాసనస భ్యులు తెలంగాణ ఉద్యమకారుడు పులి వీరన్న 80వ జయంతి వేడుక లను జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ,తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ ,మాజీ మున్సి పల్ చైర్మెన్ ఆనంద్ కుమార్ గౌడ్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి పాల్గొని పులి వీరన్న సేవలను స్మరించుకుని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పులి వీరన్న కుటుంబ సభ్యులు, కార్పొరేట ర్లు, మాజీ కౌన్సిలర్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై శ్రద్ధాంజలి ఘటించారు.

## నీట్' లీకేజీపై కేంద్రానివి దొంగనాటకాలు!

- కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న మోదీ ప్రభుత్వం
- కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు చిలుకూరి మహేందర్ రెడ్డి డిమాండ్

సిద్దిపేట, జులై23 (వుదయం బ్యూరో):



దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యా ర్థుల భవిష్యత్తును నిర్ణయించే 'నీట్' ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ వ్య వహారంలో కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం దొంగ వైఖరి అవలంబిస్తోందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షు లు చిలుకూరి మహేందర్ రెడ్డి తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి పిలుపు మేరకు గురువారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రేయింబవ ళ్లు కష్టపడి చదివి పరీక్ష రాసిన లక్షలా ది మంది నిరుపేద, ప్రతిభావంతులైన విద్యార్థుల కష్టాన్ని నీరుగారుస్తూ నీట్ ప్రశ్నాపత్రాలను మార్కెట్‌లో బటానీల తరహాలో విక్రయించారని మహేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీని కప్పిపుచ్చేందుకు కేంద్ర ప్రభు త్వం పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగి నట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యారంగంపై, విద్యార్థుల భవిష్యత్తుపై కనీస అవగాహన లేని వ్యక్తిని విద్యా శాఖ మంత్రిగా నియమించడం వల్లే దేశంలో వరుసగా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై శాంతియుతం గా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై మోదీ ప్రభుత్వం పోలీసులతో దారుణంగా లాటీఛార్జ్ చేయించి వారి రక్తం కళ్లజూడటం హేయమైన చర్య అనిధ్వజమెత్తారు.బాధితుల తరపున నిలబడి పోరాడుతున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని పోలీసులు రోడ్లపై ఈడ్చుకెళ్లి అక్రమంగా అరెస్టు చేయడా న్ని తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీని ఎంతగా అణచివేయాలని చూస్తే, ఆయన అంతటి ప్రజాదరణతో ముందడుగు వేసి, రాబోయే రోజుల్లో దేశ ప్రధానిగా విద్యార్థులకు ఖచ్చితమైన న్యాయం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నీట్ బాధిత విద్యార్థులకు, లాటీఛార్జ్‌కు గురైన వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, బాధిత విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటం ఆపబోమని హెచ్చ రించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వి ద్యార్థి సంఘాల ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు



- ఫుట్‌పాత్‌లు, మున్సిపల్ స్థలాల ఆక్రమణల తొలగింపు

గద్వాల, జూలై 23 (వు దయం కరస్పాండెంట్):

గద్వాల జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు మరోసారి ఊపం దుకున్నాయి. మున్సిపల్ స్థలాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలు, కట్టడాలను అధికారులు తొలగించే ప్రక్రియను కొనసాగి స్తున్నారు.ఇప్పటికే కృష్ణవేణి చౌక్ నుంచి అగ్రహారం వరకు, అలాగే కృష్ణవేణి చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు రహదారికి ఇరువైపు లా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులు, పోలీసుల సమక్షంలో తొలగించిన విషయం తెలిసిందే.తాజాగా కృష్ణవేణి చౌక్‌లోని అయ్యప్ప జిరాక్స్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వైపు రోడ్డు విస్త రణ పనులను అధికారులు మళ్లీ ప్రా రంభించారు. మున్సిపల్ స్థలాలు, ఫు ట్‌పాత్‌లను ఆక్రమించి ముందుకు నిర్మించిన కట్టడాలను తొలగిస్తూ రహదారి విస్తరణ చేపడుతున్నారు. ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గద్వాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభం కావడంతో పట్టణంలో మరోసారి చర్చనీయాం శంగా మారింది. ప్రజల సౌకర్యార్థ మే ఈ చర్యలు చేపడుతున్నట్లు అధి కారులు పేర్కొంటున్నారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

మహబూబ్ నగర్, జూలై 23 (వుదయం ప్రతినిధి):




గ్రామాల అభివృద్ధికి ఆయా గ్రామ సర్పంచులు కృషి చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవ రకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం, దమగ్నాపూర్ గ్రామంలో కొత్త కోట మండల సర్పంచులతో ముఖాముఖి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించా రు. ఈ సందర్భంగా సర్పంచులను ఉద్దే శించి ఆయన మాట్లాడుతూ సర్పంచుల తో ఆయా గ్రామాల్లో సమస్యలు, ఇటీవల చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసు కున్నారు. ప్రతి గ్రామానికి నూతనంగా పనులు మంజూరు చేసి, ప్రొసిడింగ్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యం లో మహా పాదయాత్ర

- రాహుల్ గాంధీ కి మద్దతుగా నల్ల టీ షర్ట్స్ ధరించి క్లాసిక్ గార్డెన్స్ నుండి గంజి మైదాన్ వరకు పాదయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తిన సంగారెడ్డి
- రాహుల్ గాంధీ కి మద్దతుగా గత మూడు రోజులనుండీ సంగారెడ్డి లో కొనసాగుతున్న ఆందోళనలు

సంగారెడ్డి, వు దయం :



నీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ... రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలను నిర్బంధించి... పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారం టూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు. రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా... నల్ల టీ షర్టు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగా రెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. ప్లకా ర్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్త లు నిరసన ను హోరెత్తించారు.

# "క్యాచ్ ది రేయిన్"తో నీటి సంరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ..

**వర్షపు నీటిని ఒడిసి పట్టాలి -- భవిష్యత్ తరాలకు భరోసా కల్పిద్దాం..**
**మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి**



వర్ధన్నపేట, జూలై 23 వుదయం ప్రతినిధి:వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో "క్యాచ్ ది రేయిన్ -- వర్షమే జీవనధారం, నీరే జీవనాధారం... ఒడిసి పట్టండి, జీవితానికి భరోసా ఇవ్వండి" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులతో కలిసి వర్షపు నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ, నీరు ప్రతి జీవికి ప్రాణాధారం అని, భవిష్యత్ తరాలకు నీటి కొరత తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని ఒడిసి పట్టే బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు, ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి విద్యాసంస్థలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే నీటి విలువను తెలుసుకొని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. అలాగే తమ కుటుంబ సభ్యులకు, పరిసర ప్రాంత ప్రజలకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. నీటిని ఆదా చేయడం అంటే ప్రకృతిని, పర్యావరణాన్ని, భావితరాల భవిష్యత్తును కాపాడినట్టేనని ఆయన పేర్కొన్నారు. అనంతరం అందరూ కలిసి "వర్షపు నీటిని ఒడిసి పట్టుదాం -- నీటి వనరులను కాపాడుదాం -- భవిష్యత్ తరాలకు భరోసా కల్పిద్దాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ చార్జీ అప్రజాస్వామికం!




హనుమకొండ టౌన్, జూలై 23 (వుదయం ప్రతినిధి) : నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్ తర్వాత ఆందోళనతో మరణించిన విద్యార్థులకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, భవిష్యత్తులో ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, సంసద్ ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయటాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఖండిస్తూ కళాశాల ప్రాంగణంలో నిరసన తెలియజేసినారు. జూలై 20న పార్లమెంటు ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయటం వలన వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడటమే కాకుండా ఒక విద్యార్థిని కూడా మరణించటానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అధ్యాపకులు అభిప్రాయపడినారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావటం, సిబిఎస్ఇ పరీక్షల మూల్యాంకనంలో తప్పులు దొర్లటం, క్యూట్ పరీక్ష నిర్వహణలో లోపాలు తలెత్తడంతో దరిదాపు 55 లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురైనారు కాబట్టి ప్రభుత్వం ఈ వైఫల్యాలకు బాధ్యత వహించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని ప్రభుత్వం ఇప్పటివరకు విద్యార్థులకు భరోసా ఇవ్వలేకపోయిందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహించి భవిష్యత్తులో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసినారు. విద్యార్థులపై లాఠీచార్జి చేసి విచక్షణ రహితంగా కొట్టిన పోలీసులపై చర్యలు చేపట్టాలి జరిగిన ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ కొంగ వీరస్వామి, డాక్టర్ కనకయ్య, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్, డాక్టర్ చింతం ప్రవీణ్, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ వెన్నంపల్లి విజయకుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ భక్కి శ్రీనివాస్, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ హరి శంకర్, డాక్టర్ నవీన్, డాక్టర్ వావిళ్ళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత పొగాకు ఉత్పత్తులపై సీసీఎస్ పోలీసుల దాడి

**1,96,430, ల విలువ గల గుట్కా, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం**



భూపాలపల్లి జులై 23(వుదయం విలేకరి)భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై సీసీఎస్ పోలీసుల దాడి నిర్వహించి రూ.1,96,430 విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఈ క్రమంలో భాగంగా గురువారం సీసీఎస్ పోలీసులు భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని చాముండా జనరల్ స్టోర్స్, దుర్గా జనరల్ స్టోర్స్, పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అంబర్, ఆర్ఆర్, అనార్, జేకే, మీరాజ్ తదితర నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించి, మొత్తం రూ. 1,96,430 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మాట్లాడుతూ ప్రజారోగ్యానికి హానికరమైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ చేయడం, విక్రయించడం లేదా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

## పున్నెల్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి: 90 వేల నష్టం



ఐనవోలు , జులై 23 ( వుదయం ప్రతినిధి ):వరంగల్ జిల్లా ఐనవోలు మండలం పున్నెల్ లో గురువారం విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. పున్నెల్ గ్రామానికి చెందిన రైతు తాటికాయల బాబు కు సంబందించిన పాడి గేదె గ్రామ శివారు లో ఎస్సీ కాలనీ కి దగ్గరలో గల వ్యవసాయ క్షేత్రం లో గల ట్రాన్స్ఫార్ కు తగిలి పాడి గేదె అక్కడికక్కడే చనిపోయింది. పాడి గేదె చనిపోవటం వలన రైతుకు రూ. 90,000 నష్టం వాటిల్లిందని బాధిత రైతు తాటికాయల బాబు బాధను వెలిబుచ్చారు. మండల విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వం ద్వారా బాధిత తాటికాయల బాబు రైతుకు తగిన ఆర్థిక సహాయం ఇప్పించ గలరని కోరారు.

# విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి: ?80 వేల నష్టం

**ప్రభుత్వం ద్వారా బాధిత రైతుకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ**
**పర్వతగిరి మండల విద్యుత్ శాఖ అధికారి ఏడిఈ తిరుపతి**



పర్వతగిరి , జులై 23 ( వుదయం ప్రతినిధి ):వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ లో గురువారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. కల్లెడ గ్రామానికి చెందిన రైతు బాల్లే వెంకటయ్య తన పాడి గేదెను ను పొలంలో మేపుతుండగా, అక్కడ చాలా కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి పాడి గేదె అక్కడికక్కడే చనిపోయింది. దీనివల్ల రైతుకు రూ. 80,000 నష్టం వాటిల్లిందని బాధిత రైతు బాల్లే వెంకటయ్య బాధను వెలిబుచ్చారు. విషయం తెలుసుకున్న మండల విద్యుత్ శాఖ అధికారి ఏడిఈ తిరుపతి స్పందిస్తూ, ప్రభుత్వం ద్వారా బాధిత రైతుకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

## నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమంలో చిన్నారులు చి. హర్షిని - వర్షిని లను ఆశీర్వాదించిన.. పర్వతగిరి పిఏసిఎస్ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్




పర్వతగిరి , జూలై 23( వుదయం న్యూస్ ప్రతినిధి):
పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చిడిమిళ్ల అనిత – లక్షణ్ దంపతుల కుమార్తెలు చి. హర్షిని – వర్షిని ల నూతన వస్త్ర పుష్పాలంకరణ యం ఎస్ కన్వెన్షన్ హల్ లో జరిగిన కార్యక్రమంలో పర్వతగిరి పిఏసిఎస్ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్ పాల్గొని చిన్నారులను సుఖసంతోషాలతో నిండు నూరేండ్లు సంతోషంగా చల్లగా ఉండాలని ఆశీర్వాదిచారు. ఆశీర్వాదించిన కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మట్టపెల్లి చిన్న మాధవరావు , గుర్రం యాదగిరి , చిడిమిళ్ల అశోక్ , ముత్తుర్తి సాయిలు , గౌరారపు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



చిట్యాల జులై 23(వుదయం ప్రతినిధి)భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు 'బ్లాక్ స్పాట్ల'పై సీపీ ప్రత్యేక నజర్



వరంగల్ క్రైం, జూలై 23 (వుదయం ప్రతినిధి) :
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత (ఐపీఎస్) ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం జాతీయ రహదారి--163 (హనుమకొండ--హైదరాబాద్) పరిధిలోని కరుణాపురం నుండి పెంబర్తి మార్గంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే 10కి పైగా 'బ్లాక్ స్పాట్ల'ను నేషనల్ హైవే (NHAI), ఆర్టీవో, ఎక్సైజ్ అధికారులతో కలిసి ఆమే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ?వెలుతురు, సైన్ బోర్డులు, గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌ల వద్ద రాత్రి వేళల్లో తగిన లైటింగ్, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలి. ?పార్కింగ్ నియంత్రణ, హైవే వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ?ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, స్థానికుల విజ్ఞప్తి మేరకు కరుణాపురం వద్ద పాదచారుల వంతెన (Foot Over Bridge) నిర్మాణానికి సంబంధిత చీనా× అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. హైవేపై అందుబాటులో ఉన్న అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సౌకర్యాలను పరిశీలించి, సిబ్బంది మరింత వేగంగా స్పందించాలని సూచించారు. ?ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, NHAI పీడీ భరద్వాజ్, ఆర్టీవో, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ 72వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ

**కార్మికుల హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీఎంఎస్ డిమాండ్.**



పరకాల జులై 23 (వుదయం ప్రతినిధి): భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పరకాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. 1955లో స్థాపించబడిన భారతీయ మజ్దూర్ సంఘ్ దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా ఎదిగి, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతూ అన్ని రంగాల కార్మికులకు అండగా నిలుస్తోందని భవన నిర్మాణ మరియు ఇతర రంగాల రాష్ట్ర కార్యదర్శి అడగాని జనార్దన్ రావు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. గతంలో లేబర్ కార్డు కలిగిన కార్మికులకు లేబర్ శాఖ ద్వారానే సంక్షేమ పథకాల లబ్ధి అందేదని, అయితే 2025 జూన్ నుంచి సహజ మరణం, ప్రమాద మరణ బీమా పథకాలను ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పగించడం వల్ల పేద కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పథకాలను తిరిగి లేబర్ శాఖ ద్వారానే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
అలాగే 60 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్, ఆరోగ్య భద్రత కల్పించాలని, లేబర్ కార్డు రెన్యువల్‌ను ఎప్పుడైనా చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. నిరక్షరాస్య కార్మికులు అవగాహన లేక రెన్యువల్‌లో జాప్యం చేస్తున్నందున ప్రభుత్వం ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
కార్మికులకు టూ వీలర్ సౌకర్యం, కార్మిక భవనాల నిర్మాణం, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు, పనిముట్ల పంపిణీ చేపట్టాలని, ప్రమాదాల సమయంలో లేబర్ శాఖ ద్వారా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని బీఎంఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఎస్ ఐ ఆర్ ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమాలలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి.




పర్వతగిరి, జులై 23 ( వుదయం ప్రతినిధి ):పర్వతగిరి మండలం లో గురువారం కల్లెడ గ్రామంలో ఎస్ ఐ ఆర్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని 100% పూర్తి చేసిన అధికారిలను, పార్టీ బి ఎల్ ఓ లను సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ తో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి సన్మానించినారు.
అనంతరం అన్నారం షరీఫ్ గ్రామంలో సర్ సర్వే ప్రక్రియను ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ గార్లతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగ గ్రామానికీ వచ్చిన నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి ని శాలువతో సత్కరించి గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, ఎ ఎం సి డైరెక్టర్ గొడుగు బిక్షపతి శుభకాంక్షలుతెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యధర్శి బోట్ల మహేంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షులు గొడుగు రమేష్, యూత్ అధ్యక్షులు గొడుగు వినయ్, సీనియర్ నాయకులు మోటపోతుల సారంగపాణి, గ్రామ వార్డు మెంబర్లు రాపోలు అనిత రవీందర్, గాడి పెల్లి రాజబాబు, నాయకులు ఈరగాని అఖిల్, మాజీ సర్పంచ్ మునుకుంట్ల యశోద బాబు, రామ్మూర్తి, యాకయ్య, మహేందర్, జంగాల దయాకర్, మైసయ్య, సంపత్, వెంకన్న, యాకయ్య, మరియు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరు లో బుధవారం రోజున బోనలపండుగ



తొర్రూరు జూలై 23 (వుదయం ప్రతినిధి):బుధవారం రోజున బోనాల పండుగ జరుపుకోనుటకు నిర్ణయించడం జరిగింది .మున్సిపల్ చైర్ పర్సన్ తూనం శ్రావణ్ కుమార్ అధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్, కౌన్సిల్ సభ్యుల సమక్షంలో స్థానిక పండితులు కార్తేను అనుసరించి రానున్న ఆగస్టు 05 తేదీ బుధవారం రోజున బోనాల పండుగ నిర్వహించుటకు నిర్ణయించనైనది.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూనం శ్రావణ్ కుమార్, కమిషనర్ శ్యాం సుందర్, మున్సిపల్ కౌన్సిలర్లు తూర్పాటి రవి, మాద్గూల భవాని లత,కిన్నెర కవిత,ముద్దసాని సురేష్,కర్నే నాగరాజు, ధరవత్ పద్మ, స్థానికులు సోమ రాజశేఖర్ భూసాని ఉపులయ్య,బసనబోయిన రాజేష్,చకిలేల మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టు ఆ ప్రజాస్వామికం

**-నీట్,జెఈఈ పరీక్షల లీకేజ్ పై కేంద్రం బాధ్యత వహించాలి**



తొర్రూరు జూలై 23 (వుదయం ప్రతినిధి): నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజ్ కి నిరసనగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ అగ్ర నేతలు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే, ఎంపీ ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం అప్రజాస్వామి కమని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, కాంగ్రెన్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చార్యులు విమర్శించారు. కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టులకు నిరసనగా గురువారం డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజ్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పరీక్షల నిర్వహణపై విద్యార్థులు,యువతలో విశ్వాసం దెబ్బ తిన్నదని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బి. వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, మేకల కుమార్,జక్కుల రామ్ రెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, జలకం శ్రీనివాస్, చెవిటి సుధాకర్, కందాడి అచ్చిరెడ్డి, మహబూబ్ రెడ్డి, రవి నాయక్, గుండాల నర్సయ్య, విక్రమ్ రెడ్డి, సర్పంచ్లు బంగారు రమేష్, ఎర్ర వెంకటరెడ్డి, జాటోత్ రాం లాల్, అభిరాం నాయక్, నరేందర్, విజయ రవి, గంగా నరేష్,నాయకులు వెన్నం సోమిరెడ్డి, మిత్తింటి హరీష్,దొంగరి శంకర్, రాజేష్ యాదవ్,ప్రవీణ్ యాదవ్, మహేష్ యాదవ్, బుచ్చి రాజులు, రమేష్ రావు,వి. రాజు, రాంబాబు, అన్వేష్, పరశురాములు, ఎర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## వానల్లో... ఆరోగ్యంగా...



వానాకాలం మొదలయ్యిందంటే... ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు, జీర్ణసమస్యలతో సతమతమవు తుంటారు చాలామంది. అస్తమానం అన్నింటికీ మాత్రలే అంటే ఎలా? కొన్ని ఆయుర్వేద చిట్కాలు పాటించడం, జీవనశైలి మార్పులు చేసుకోవడం ద్వారా ఉపశమనం పొందొచ్చంటున్నారు వైద్య నిపుణులు. అవేమిటంటే...

ఉదయం నిద్రలేవగానే గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగాలి. ఈ సాధారణ అలవాటు శరీరంలో నుంచి విషపదార్థాలు (టాక్సిన్స్) బయటకు పంపేందుకు సహాయ పడుతుంది. దీనివల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. రుచి కోసం కొంచెం తేనె కలుపుకోవచ్చు.

ఉదయం రెండు నిమిషాల పాటు ప్రాణాయామం చేయాలి. శ్వాసపై ఏకాగ్రత నిలపాలి. దీనివల్ల శరీరానికి తగిన విశ్రాంతి లభిస్తుంది. రీఫ్రెష్ కావడానికి ఇది మంచి మార్గం. సంప్రదాయ ఆయుర్వేదంలో ప్రాణాయా మానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అల్లం, తులసి, నల్లమిరి యాలు వేసి తయారుచేసిన గోరువెచ్చని హెర్బల్ డ్రింక్ తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు.

వర్షాకాలంలో వైరల్ జ్వరాల బారినపడకుండా ఉండటానికి, రోగనిరోధక శక్తి పెంచుకోవ డానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. నువ్వుల నూనెతో పావుగంట పాటు శరీరాన్ని మర్దన చేసు కోవాలి. పిండతైలం కూడా మర్దనకు వాడొచ్చు. మర్దన వల్ల రక్తసరఫరా మెరుగుపడుతుంది. కీళ్లు బిగుసు కుపోకుండా ఉపశమనం కలుగుతుంది. మర్దన తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. వారానికి ఒకసారైనా తైల మర్దన చేసుకోవాలి.

వర్షాకాలంలో తేమ వల్ల ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. అందుకే చర్మాన్ని తడిలేకుండా చూసుకోవాలి. వర్షంలో తడిస్తే వెంటనే వేడి నీళ్లతో స్నానం చేసి తడి లేకుండా తుడుచుకోవాలి. ఈ సీజన్‌లో వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకో వాలి. అలాగే సీజనల్ ఫ్రూట్స్ తప్పనిసరిగా తినాలి. పియర్స్, ఆపిల్స్, దానిమ్మ వంటివి చాలా మంచివి. ఉడికించని కూరగాయలు, సలాడ్స్‌కి దూరంగా ఉండాలి. స్ట్రీట్ ఫుడ్, ఫ్రైడ్‌ఫుడ్ వీలైనంతమేర తగ్గించాలి.

వర్షాకాలంలో వాతం పెరుగుతుంది. ఫలితంగా చర్మం పొడిబారడం, జలుబు, కీళ్ల కదలికలు తగ్గిపోతాయి. కడుపు ఉబ్బరం పెరుగుతుంది. తేనె కలిపిన అల్లం జ్యూస్ తీసుకోవదం వల్ల ఫలితం ఉంటుంది. గ్లాసు గోరువెచ్చటి నీటిలో చిటికెడు ఇంగువ వేసుకుని తాగినా ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. ఈ సీజన్‌లో పగటి నిద్ర మంచిది కాదు. దీనివల్ల జీవక్రియలు నెమ్మదిస్తాయి. బద్ధకం పెరుగుతుంది. కాబట్టి మధ్యాహ్నం నిద్ర దరిచేర కుండా ఏదైనా వ్యాపకంలో మునిగిపోవాలి.



## రన్నింగ్ Vs సైక్లింగ్.. బరువు తగ్గాలంటే ఏది బెటర్..

ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి, బరువు తగ్గించుకోవడానికి కార్డియో వ్యాయామాలు చాలా ఉపయోగపడతాయి. వాటిలో రన్నింగ్, సైక్లింగ్ రెండూ ప్రముఖమైనవి. అయితే, ఈ రెండింటిలో ఏది ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది? ఏది బరువు తగ్గడానికి బాగా ఉపయోగపడుతుంది? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. రన్నింగ్, సైక్లింగ్ రెండూ మంచి వ్యాయామాలే. అయితే ఏది ఎంచుకోవాలనేది మీ ఆరోగ్యం, వయసు, శరీర బరువు, ఫిట్‌నెస్ లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఒకే సమయం పాటు చేస్తే, సైక్లింగ్‌తో పోలిస్తే రన్నింగ్ ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. ఎందుకంటే పరుగెత్తేటప్పుడు శరీరంలోని దాదాపు అన్ని ప్రధాన కండరాలు పనిచేస్తాయి. అలాగే శరీరాన్ని ముందుకు నెట్టడానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. ఉదాహరణకు, 70 కిలోల బరువు ఉన్న వ్యక్తి 30 నిమిషాలు మితమైన వేగంతో పరుగెత్తితే సుమారు 300 నుంచి 400 కేలరీలు ఖర్చవుతాయి. అదే సమయంలో మితమైన వేగంతో సైక్లింగ్ చేస్తే 220 నుంచి 350 కేలరీలు వరకు ఖర్చవుతాయి. అయితే వేగం, తీవ్రత పెరిగితే ఈ సంఖ్యలు మారవచ్చు.

పరుగెత్తేటప్పుడు మోకాళ్లు, కీళ్లపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. అందుకే అధిక బరువు ఉన్నవారు, మోకాళ్ల నొప్పి లేదా కీళ్లవాతం ఉన్నవారు, వృద్ధులు సైక్లింగ్‌ను ఎంచుకోవడం మంచిది. ఇది కీళ్లపై తక్కువ ఒత్తిడి కలిగిస్తూ గుండె ఆరోగ్యాన్ని, శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. త్వరగా కొవ్వు కరిగించుకోవాలనుకునే వారు, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేని వారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. అయితే శరీరంపై తక్కువ ఒత్తిడితో ఎక్కువ కాలం వ్యాయామం చేయాలనుకునే వారికి సైక్లింగ్ కూడా మంచి ఎంపిక. బరువు తగ్గాలంటే వ్యాయామం ఒక్కటే సరిపోదు. సరైన ఆహారం కూడా చాలా అవసరం. రోజూ తగినంత ప్రోటీన్ తీసుకోవాలి. చక్కెర, జంక్ ఫుడ్‌ను తగ్గించాలి. కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలను ఆహారంలో చేర్చాలి. రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీరు తాగాలి. రోజూ 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్ర అవసరం.

త్వరగా కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ సరిపోతుంది. మోకాళ్లు లేదా కీళ్ల సమస్యలు ఉంటే సైక్లింగ్ చేయడం మంచిది.




## ఫిల్టర్ కాఫీ తాగితే వృద్ధాప్యం ఆలస్యమవుతుందా?

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందికి ఉదయం నిద్ర లేవగానే కాఫీ తాగే అలవాటు ఉంటుంది. అయితే రోజూ తాగే కాఫీ ఎలా తయారవుతుందనే విషయం కూడా శరీర వృద్ధాప్యంపై ప్రభావం చూపుతుందా? తాజాగా ఎన్‌పీజే సైన్స్ ఆఫ్ ఫుడ్ జర్నల్‌లో ప్రచురితమైన కొత్త అధ్యయనం ఈ ప్రశ్నకు ఆసక్తికరమైన సమాధానం ఇచ్చింది. యూకే బయోబ్యాంక్‌కు చెందిన దాదాపు 50 వేల మంది వ్యక్తుల డేటాను విశ్లేషించిన పరిశోధకులు, ఫిల్టర్ కాఫీ తాగే వారిలో జీవసంబంధిత వృద్ధాప్యం నెమ్మదిగా ఉండే సూచనలు కనిపించగా, ఇన్‌స్టంట్ కాఫీ తాగే వారిలో వేగంగా వృద్ధాప్యం జరిగే సూచనలు కనిపించాయని వెల్లడించారు. అంటే కాఫీ పరిమాణం మాత్రమే కాకుండా, దాన్ని తయారు చేసే విధానం కూడా ఆరోగ్యకరమైన వృద్ధాప్యంతో సంబంధం కలిగి ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే నిపుణులు ఈ ఫలితాలను చూసి వెంటనే నిర్ణయాలకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ఇది పరిశీలనా ఆధారిత, క్రాస్-సెక్షనల్ అధ్యయనం మాత్రమే. కాబట్టి ఫిల్టర్ కాఫీ వృద్ధాప్యాన్ని తగ్గిస్తుందని లేదా ఇన్‌స్టంట్ కాఫీ వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుందని ఇది నిరూపించదు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన లక్షణాలు, ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు వంటి అనేక అంశాలు కూడా ఈ ఫలితాలపై ప్రభావం చూపి ఉంటాయని పరిశోధకులు పేర్కొన్నారు. వయస్సు అంటే సాధారణంగా పుట్టినప్పటి నుంచి గడిచిన సంవత్సరాల సంఖ్యను సూచిస్తుంది. దీనినే కాలక్రమ వయస్సు అంటారు. అయితే జీవసంబంధిత వృద్ధాప్యం అంటే శరీరంలోని కణాలు, కణజాలాలు, అవయవాలు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయో సూచించే ప్రమాణం. ఒకే వయస్సు ఉన్న ఇద్దరిలో ఒకరి జీవసంబంధిత వయస్సు మరొకరితో పోలిస్తే తక్కువగా లేదా ఎక్కువగా ఉంటుంది. దీనిపై జన్యువులు, జీవనశైలి, ఆహారం, పర్యావరణ ప్రభావాలు, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం వంటి అంశాలు ప్రభావం చూపిస్తాయి. ఫలితాల్లో కాఫీ రకాన్ని బట్టి స్పష్టమైన తేడాలు కనిపించాయి. ఫిల్టర్ కాఫీ తాగే వారిలో జీవసంబంధిత వృద్ధాప్య వేగం తక్కువగా ఉండటంతో పాటు టెలోమీర్‌ల పొడవు ఎక్కువగా ఉండే ధోరణి కనిపించింది. దీన్ని ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి సంకేతంగా పరిశోధకులు పేర్కొన్నారు. ఇన్‌స్టంట్ కాఫీ తాగే వారిలో జీవసంబంధిత వృద్ధాప్య వేగం ఎక్కువగా ఉండటంతోపాటు టెలోమీర్‌లు చిన్నగా ఉండే ధోరణి కనిపించింది. s



## సన్నగా ఉండేవారికి కూడా గుండె జబ్బులు ఎందుకు వస్తాయి..

గుండె జబ్బులు అధిక బరువు ఉన్నవారికే వస్తాయనే అభిప్రాయం ఇప్పటికీ చాలా మందిలో ఉంది. అయితే సన్నగా కనిపించే వ్యక్తులు కూడా గుండెపోటు బారిన పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. సాధారణ కొలెస్ట్రాల్ పరీక్షల్లో అన్నీ సాధారణంగానే ఉన్నా, గుండె సంబంధిత ప్రమాదం దాగి ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల మొత్తం కొలెస్ట్రాల్ విలువను మాత్రమే చూసి గుండె ఆరోగ్యం బాగుందని భావించడం సరైన విధానం కాదని వారు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని అంచనా వేయాలంటే కొలెస్ట్రాల్‌తోపాటు శరీరంలో ఉండే వివిధ రకాల కొవ్వు కణాలు, వాపు (ఇన్‌ఫ్లమేషన్) స్థాయి, జన్యుపరమైన ప్రమాద కారకాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. సాధారణ లిపిడ్ ప్రొఫైల్ పరీక్షల్లో ఈ వివరాలన్నీ కనిపించవు. అందుకే కొందరిలో సాధారణ రిపోర్టులు వచ్చినప్పటికీ గుండెపోటు వచ్చే ప్రమాదం కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన అంశాల్లో లిపోప్రోటీన్ (ఎ) లేదా ఎల్పీ(ఎ) ఒకటి. ఇది రక్తంలో కొలెస్ట్రాల్‌ను మోసుకెళ్లే ప్రత్యేక లిపోప్రోటీన్. దీని స్థాయి ఎక్కువగా ఉండటం ప్రధానంగా జన్యుపరమైన కారణాల వల్ల జరుగుతుంది. ఎల్పీ(ఎ) అధికంగా ఉన్నవారిలో గుండె జబ్బుల ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా సన్నగా కనిపించే వ్యక్తుల్లో శరీరం బయటకు ఆరోగ్యంగా కనిపించినప్పటికీ అంతర్గత అవయవాల చుట్టూ కొవ్వు పేరుకుపోయి ఉండే అవకాశం ఉంది. అలాంటి వారిలో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ట్రైగ్లిసరైడ్లను కూడా గుండె ఆరోగ్యానికి కీలక సూచికగా పరిగణిస్తారు. ఇవి రక్తంలో ఉండే అత్యంత సాధారణ కొవ్వు రూపం. శరీరానికి అవసరం లేని అదనపు క్యాలరీలను ట్రైగ్లిసరైడ్ల రూపంలో నిల్వ ఉంచి, అవసరమైనప్పుడు శక్తిగా ఉపయోగిస్తుంది. అయితే శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, అధిక చక్కెరలు తీసుకునే అలవాటు వల్ల సన్నగా ఉన్న భారతీయుల్లో కూడా ట్రైగ్లిసరైడ్ల స్థాయి పెరిగే అవకాశం ఉంది. ఇవి ఇన్సులిన్ నిరోధకతతో కూడా సంబంధం కలిగి ఉండటంతో గుండె జబ్బుల ప్రమాదం మరింత పెరుగుతుంది. స్మాల్, డెన్స్ ఎల్‌డీఎల్ అనే చెడు కొలెస్ట్రాల్ కణాలు కూడా ప్రమాదకరమైనవిగా చెప్పవచ్చు. సాధారణ ఎల్‌డీఎల్‌తో పోలిస్తే ఇవి పరిమాణంలో చిన్నగా ఉండటంతో రక్తనాళాల గోడల్లో సులభంగా పేరుకుపోయి ఫలకాలు ఏర్పడే అవకాశాన్ని పెంచుతాయి. దీంతో గుండెపోటు ప్రమాదం అధికమవుతుంది. హెచ్‌డీఎల్ లేదా మంచి కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం కూడా మరో ప్రమాద సూచిక. హెచ్‌డీఎల్ రక్తనాళాల్లో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. దక్షిణాసియా ప్రజల్లో, ముఖ్యంగా భారతీయుల్లో బరువు సాధారణంగా ఉన్నప్పటికీ హెచ్‌డీఎల్ స్థాయి తక్కువగా ఉండటం తరచూ కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.



## యూరిక్ యాసిడ్ సమస్య కేవలం పురుషుల్లోనే వస్తుందా..

యూరిక్ యాసిడ్ సమస్య వయసు పైబడిన వారిలో, ముఖ్యంగా పురుషుల్లో మాత్రమే కనిపిస్తుందని చాలా మంది భావిస్తారు. మటన్ లేదా అధిక ప్రోటీన్ తీసుకోవడం వల్లే ఈ సమస్య వస్తుందని కూడా అనుకుంటారు. అయితే జీవనశైలి, జీవక్రియల (మెటబాలిక్) సమస్యలు కూడా యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడానికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సమస్య యువతలో, ముఖ్యంగా 30 ఏళ్ల వయసులో ఉన్న మహిళల్లో కూడా ఎక్కువగా కనిపిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. 30 ఏళ్ల వయసులో ఉన్న ఓ మహిళకు కీళ్ల నొప్పులు, అలసట, బరువు పెరగడం వంటి సమస్యలు రావడంతో పరీక్షలు చేయించగా యూరిక్ యాసిడ్ స్థాయిలు అధికంగా ఉన్నట్లు తేలింది. ఈ సమస్య వృద్ధాప్యంలోనే వస్తుందని భావించిన ఆమెకు ఈ ఫలితం ఆశ్చర్యాన్ని కలిగించింది. దీంతో యూరిక్ యాసిడ్ ఏ వయసులోనైనా పెరుగుతుందనే విషయంపై అవగాహన పెరుగుతోంది.యూరిక్ యాసిడ్ పెరగడానికి కేవలం మటన్ లాంటి ఎర్రని మాంసం లేదా అధిక ప్రోటీన్ మాత్రమే కారణం కాదని నిపుణులు చెబుతున్నారు. అధికంగా చక్కెర తీసుకోవడం, తీపి పానీయాలు ఎక్కువగా తాగడం, ఊబకాయం, తగినంత నీరు తాగకపోవడం, జీవక్రియల్లో లోపాలు, సమయానికి ఆహారం తీసుకోకపోవడం వంటి అనేక కారణాలు కూడా ఈ సమస్యకు దారితీస్తాయి. యూరిక్ యాసిడ్ నియంత్రణ కోసం ఏ ఆహారం తినకూడదనే అంశంపైనే దృష్టి పెట్టడం సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలోని అసలు కారణాలను గుర్తించి మొత్తం జీవనశైలిని మెరుగుపరచడం మరింత ముఖ్యమని చెబుతున్నారు. యూరిక్ యాసిడ్‌ను నియంత్రించేందుకు రోజంతా తగినంత నీరు తాగడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవడం, అధిక చక్కెర తీసుకోవడాన్ని తగ్గించడం వంటి మార్పులు చేయాలని సూచిస్తున్నారు.




## మహిళల గుండె పనితీరుపైనా ప్రభావం చూపే రుతుచక్రం..

మహిళల రుతుచక్రం కేవలం పునరుత్పత్తి ఆరోగ్యానికే పరిమితం కాదని, గుండె పనితీరుపైనా ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు గుండె స్పందన నియంత్రణ వ్యవస్థలో మార్పులకు కారణమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ మార్పులు కండరాల బలం, మానసిక స్థితి లేదా పనులు చేయాలనే ఉత్సాహంపై గణనీయమైన ప్రభావం చూపవని అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిశోధన మహిళల శరీరం సహజ హార్మోన్ల మార్పులకు ఎలా స్పందిస్తుందనే అంశంపై మరింత స్పష్టతను అందిస్తోంది. ముఖ్యంగా మహిళలు, క్రీడాకారిణులు, వైద్య నిపుణులు గుండె ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు రుతుచక్ర దశలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు. హార్ట్ రేట్ వేరియబిలిటీ (HRV) అంటే గుండె కొట్టుకునే ప్రతి రెండు స్పందనల మధ్య ఉండే సమయ వ్యవధిలో కనిపించే చిన్నచిన్న తేడాలను సూచిస్తుంది. గుండె ఒకే రీతిలో కొట్టుకుంటున్నట్లు కనిపించినప్పటికీ, ప్రతి స్పందన మధ్య విరామం స్వల్పంగా మారుతూ ఉంటుంది. ఈ మార్పులను స్వయంచాలక నాడీ వ్యవస్థ నియంత్రిస్తుంది. ఇందులో ఫైట్ ఆర్ ఫ్లైట్ వ్యవస్థ, రెస్ట్ అండ్ డైజెస్ట్ వ్యవస్థ అనే రెండు భాగాలు ఉంటాయి. సాధారణంగా HRV ఎక్కువగా ఉంటే శరీరం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటోందని భావిస్తారు. HRV తక్కువగా ఉంటే శారీరక లేదా మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అనేక స్మార్ట్‌వాచ్‌లు, ఫిట్‌నెస్ ట్రాకర్లు కూడా HRVని కొలుస్తున్నాయి. ఈ అధ్యయనంలో సహజంగా రుతుచక్రం ఉన్న ఆరోగ్యవంతమైన మహిళలను ఎంపిక చేసి, వారి రుతుచక్రంలోని వివిధ దశల్లో గుండె పనితీరు, కండరాల బలం, మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహాన్ని పరిశీలించారు. ప్రారంభ ఫాలిక్యులర్ దశ, అండోత్సర్గం దశ, ల్యూటియల్ దశలలో HRVతో పాటు ఇతర శారీరక మార్పులను పోల్చి హార్మోన్ల ప్రభావాన్ని విశ్లేషించారు.

రుతు సమయంలో స్పష్టమైన మార్పులు..

పరిశోధనలో అత్యంత ముఖ్యంగా గుర్తించిన విషయం ఏమిటంటే, రుతుచక్రంలోని ప్రతి దశలో HRVలో స్పష్టమైన మార్పులు కనిపించాయి. హార్మోన్ల స్థాయిలు మారేకొద్దీ గుండెను నియంత్రించే స్వయంచాలక నాడీ వ్యవస్థ పనితీరులో కూడా మార్పులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ హార్మోన్ల హెచ్చుతగ్గులు గుండె స్పందన నియంత్రణపై ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే కండరాల బలంలో మాత్రం ఎలాంటి గణనీయమైన మార్పులు కనిపించలేదు. అలాగే మహిళల మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహం కూడా రుతుచక్రంలోని వివిధ దశల్లో పెద్దగా మారలేదని అధ్యయనం తెలిపింది. అంటే హార్మోన్ల మార్పులు గుండె నియంత్రణ వ్యవస్థపై ప్రభావం చూపినా, శారీరక పనితీరు మాత్రం చాలా వరకు స్థిరంగానే ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఈస్ట్రోజెన్ రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడటంతో పాటు గుండె స్పందనను ప్రశాంతంగా ఉంచే వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. మరోవైపు ప్రొజెస్టెరోన్ కొన్ని దశల్లో గుండె స్పందనను వేగవంతం చేసే నాడీ వ్యవస్థను ఎక్కువగా చురుకుగా మారుస్తుంది. అందువల్ల ఈ రెండు హార్మోన్ల స్థాయిల్లో నెలనెలా జరిగే మార్పులు HRVలో తేడాలకు కారణమవుతాయి. ఈ ఫలితాల ప్రకారం స్మార్ట్‌వాచ్‌లు లేదా ఫిట్‌నెస్ ట్రాకర్ల ద్వారా HRVని గమనించే మహిళలు నెలసరి సమయంలో సహజంగానే కొన్ని మార్పులను చూడవచ్చు.



## 30 ఏళ్లు దాటిన వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..

30 ఏళ్లు దాటిన తర్వాత శరీరంలో సహజంగానే అనేక మార్పులు ప్రారంభమవుతాయి. జీవక్రియ (మెటబాలిజం) వేగం తగ్గడం, కండరాల బలం క్రమంగా తగ్గడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి మార్పులు భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులకు పునాది వేస్తాయి. అందుకే ఈ వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. 30 ఏళ్ల తర్వాత జీవక్రియ సహజంగానే నెమ్మదిస్తుంది. దీంతో బరువు పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వచ్చే అవకాశం ఎక్కువ అవుతుంది. అలాగే ప్రతి దశాబ్దానికి శరీరంలోని కండరాల పరిమాణం క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. ఎముకల సాంద్రత కూడా తగ్గడం మొదలవుతుంది. ఈ దశలోనే రక్తపోటు, కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్, టైప్ 2 డయాబెటిస్ వంటి సమస్యలు ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ ఒత్తిళ్లు పెరగడం వల్ల దీర్ఘకాలిక ఒత్తిడి కూడా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ వయస్సులో ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. తాజా పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు కలిగిన ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక చక్కెర, ఎక్కువ ఉప్పు ఉన్న పదార్థాలను వీలైనంత వరకు తగ్గించడం మంచిది. ముందుగానే భోజన ప్రణాళికను రూపొందించుకోవడం వల్ల అనారోగ్యకరమైన ఆహారం తీసుకునే అవకాశాలు తగ్గుతాయి. నిత్యవ్యాయామాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలి. వారానికి కనీసం 150 నిమిషాలపాటు మోస్తరు తీవ్రతతో కూడిన వ్యాయామం చేయడంతోపాటు వారానికి రెండు రోజులైనా కండరాల బలం పెంచే వ్యాయామాలు చేయడం అవసరం. నడక, సైక్లింగ్, యోగా, డ్యాన్స్ వంటి ఇష్టమైన వ్యాయామాలను ఎంచుకుంటే వాటిని క్రమం తప్పకుండా కొనసాగించడం సులభమవుతుంది. వ్యాయామం వల్ల బరువు నియంత్రణలో ఉండటమే కాకుండా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి నిద్ర కూడా ఆరోగ్యానికి అత్యంత కీలకం. ప్రతి రోజు 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర అవసరం. తగినంత నిద్ర లేకపోతే బరువు పెరగడం, రోగనిరోధక శక్తి తగ్గడం, మానసిక సమస్యలు పెరగడం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. నిద్రించే ముందు మొబైల్, ఇతర స్క్రీన్‌ల వినియోగాన్ని తగ్గించడం, ఒకే సమయానికి నిద్రపోయే అలవాటు చేసుకోవడం మంచిది. ఒత్తిడిని నియంత్రించడం కూడా అంతే ముఖ్యం. నిరంతర ఒత్తిడి శరీరంలో వాపు సంబంధిత సమస్యలను పెంచడంతోపాటు గుండె జబ్బులు, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ధ్యానం, యోగా, శ్వాస వ్యాయామాలు లేదా ఇష్టమైన హాబీలకు సమయం కేటాయించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవడం కూడా ఉపయోగకరం. శరీరంలోని ప్రతి వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి తగినంత నీరు తాగడం అవసరం. సరిపడా నీరు తాగడం వల్ల శక్తి స్థాయిలు మెరుగుపడటమే కాకుండా జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటుంది. రోజంతా తగినంత నీరు తాగే అలవాటు చేసుకోవాలి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకపోయినా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి పరీక్షలను వైద్యుల సూచన మేరకు చేయించుకోవాలి. మహిళలు గైనకాలజీ పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు. పురుషులు కూడా వయస్సుకు అనుగుణంగా అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమైంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మంచి సంబంధాలను కొనసాగించడం వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత పెరుగుతుంది. బలమైన సామాజిక బంధాలు దీర్ఘకాలిక ఆరోగ్యానికి, ఎక్కువ ఆయుష్షుకు కూడా తోడ్పడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. 30 ఏళ్ల వయస్సు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రారంభించడం ద్వారా భవిష్యత్తులో అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించుకోవచ్చు. చిన్నచిన్న జీవనశైలి మార్పులే దీర్ఘకాలంలో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.



## శాంసంగ్ జడ్ ఫోల్డ్ 8 ఫోన్లు ధరలు ఎలా ఉన్నాయంటే..



శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ తన గెలాక్సీ జడ్ సిరీస్‌లో 3 కొత్త ఫోన్లను విడుదల చేసింది. ఆండ్రాయిడ్ 17 ఓఎస్‌తో, మరింత పల్చటి, తేలికపాటి, పెద్ద డిస్‌ప్లేతో జడ్ ఫోల్డ్ 8 అల్ట్రా, జడ్ ఫోల్డ్ 8, జడ్ ఫ్లిప్ 8 స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. జెమినై ఏఐ ఇంటలిజెన్స్ ఫీచర్లతో ఈ ఫోన్లను తీసుకొచ్చింది. జడ్ ఫ్లిప్8ను కదులుతూ ఉన్న సమయంలోనూ త్వరిత ఇంటరాక్షన్స్, సెల్ఫ్ ఎక్స్‌ప్రెషన్ కోసం డిజైన్ చేశారు. ఏఐ ఆధారిత ఫ్లెక్స్‌విండో ఇందుకు వీలు కల్పిస్తుంది. 7 నుంచి మన విపణిలో లభ్యం: శాంసంగ్ జడ్8 సిరీస్ ఫోన్లు, మన మార్కెట్లో ఆగస్టు 7 నుంచి లభ్యమవుతాయి. బుధవారం నుంచే మొదలయ్యే ప్రీఆర్డరులో అప్‌గ్రేడ్ ఆఫర్ కింద రూ.10,000 వరకు, రూ.9,000 బ్యాంక్/యూపీఐ క్యాష్ బ్యాక్ ఆఫర్ పొందొచ్చు.

# బిజినెస్

## నాలుగో రోజూ నష్టాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా ఫార్మా, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా నాలుగో రోజూ మార్కెట్ సూచీలు నష్టాల బాటపట్టాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.477 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 76,515.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,755.05) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,151.98 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 363.66 పాయింట్లు కోల్పోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.65 పాయింట్లు పతనమై 23,869.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30లో ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, టాటాస్టీల్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 97.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,088.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఏఐ ఎఫెక్ట్.. అమెజాన్, ఉబర్‌లో లేఆఫ్‌లు




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. తాజాగా అమెరికాకు చెందిన ప్రముఖ కంపెనీలైన అమెజాన్, ఉబర్ ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించాయి. ఉబర్‌లో 10 శాతం మందిని తొలగిస్తున్నట్లు కంపెనీ పేర్కొనగా.. ఎంతమందిని తొలగిస్తున్నదీ అమెజాన్ వెల్లడించలేదు. అమెజాన్ కొన్ని నెలల క్రితమే వివిధ విభాగాల్లో సుమారు 16 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఈ సారి ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (AGI) విభాగంలో లేఆఫ్‌లు ప్రకటించింది. తర్వాతి తరం ఏఐ సిస్టమ్స్‌ను డెవలప్ చేయడం ఈ విభాగం బాధ్యత. వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వినియోగదారులకు మంచి విలువను అందించడంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చేపడుతున్నట్లు అమెజాన్ పేర్కొంది. ఏఐ మోడళ్లపై పెద్దమొత్తంలో నిధులు గుమ్మరిస్తున్న వేళ అమెజాన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మరోవైపు ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబర్ టెక్నాలజీస్.. తన కస్టమర్ సర్వీస్ విభాగంలో 10 శాతం ఉద్యోగులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సేవల్లో ప్రక్రియను సులభతరం చేయడం, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ లేఆఫ్‌లు చేపడుతున్నట్లు పేర్కొంది. తొలగించిన ఉద్యోగుల స్థానంలో కస్టమర్లతో ఏఐ సంప్రదింపులు జరపనుంది. ఒకప్పుడు కస్టమర్ సర్వీస్ విభాగం పూర్తిగా మనుషులతో నడిచేది. జనరేటివ్ ఏఐ అందుబాటులోకి వచ్చాక ఈ విభాగంలో ఉద్యోగాలు చాలా వరకు ఏఐతో భర్తీ అయ్యాయి.


## భగ్గుమన్న చమురు ధరలు..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మళ్లీ ఆకాశన్నంటుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ (Brent Crude) ఆరు వారాల గరిష్ఠానికి చేరింది. గురువారం ఉదయం బ్యారెల్ ధర (Oil Prices) 1.5శాతానికి పైగా పెరిగి 95 డాలర్లు దాటి ట్రేడ్ అవుతోంది. ఇక,




వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ఒక్క నెలలో బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటివరకు దాదాపు 30శాతం పెరగడం గమనార్హం. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే చమురు మంటలు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా-ఇరాన్ (US-Iran War) పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా కన్పించట్లేదు. ఈ పరిణామాలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మళ్లీ నెమ్మదించింది. మరోవైపు, ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు ట్యాకర్లపై హూతీలు దాడులు చేశారు. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ చమురు మంటలు, అంతర్జాతీయ పరిణామాలతో దేశీయంగా స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ 300 పాయింట్లు తగ్గి 76,454 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 83 పాయింట్ల నష్టంతో 23,913 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు పెరిగి 96.48గా ట్రేడ్ అవుతోంది.

## 69% తగ్గిన డాక్టర్ రెడ్డీస్ లాభం



ప్రముఖ ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.8,071 కోట్ల ఏకీకృత ఆదాయంపై రూ.434.8 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2025-26 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.8,545 కోట్లు, నికర లాభం రూ.1,409.6 కోట్లుగా నమోదయ్యాయి. ఏడాది క్రితంతో పోలిస్తే, సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 6%, నికర లాభం 69% క్షీణించాయి.
ఉత్తర అమెరికా నుంచి ఆదాయం రూ.3,412.3 కోట్ల నుంచి 35% క్షీణించి రూ.2,204.8 కోట్లకు పరిమితమైంది. భారత్ మార్కెట్లో ఆదాయం రూ.1,471.1 కోట్ల నుంచి 17% పెరిగి రూ.1,717.7 కోట్లకు చేరింది.
ఇతర వర్ధమాన మార్కెట్లలో జనరిక్ ఆదాయం రూ.1,404.2 కోట్ల నుంచి 31% వృద్ధితో రూ.1,832.8 కోట్లకు చేరింది. ఐరోపా దేశాల్లో అమ్మకాలు రూ.1,274.4 కోట్ల నుంచి 13% వృద్ధితో రూ.1,444 కోట్లకు చేరాయి. సెమాగ్లుటైడ్ ఏపీఐలో నాణ్యతా లోపాల కారణంగా కొన్ని బ్యాచ్‌లు నిర్దేశిత ప్రమాణాల మేరకు లేకపోవడంతో, రూ.240 కోట్ల మేరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి వచ్చింది. తయారీ లోపం కారణంగా కొన్ని బ్యాచ్‌ల సెమాగ్లుటైడ్ ఔషధాలు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం లేవని గుర్తించారు. ప్రస్తుతం సరైన నాణ్యతతో కూడిన ఉత్పత్తులను సిద్ధం చేస్తూ, త్వరలోనే సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది. బయోలాజిక్స్ విభాగం గ్లోబల్ హెడ్‌గా శ్రీదేవి కంభంపాటిని నియమిస్తూ బోర్డు ఆమోదం తెలిపింది.

## 15 త్రైమాసికాల్లో తొలిసారిగా బీపీసీఎల్‌కు నష్టం

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో రూ.3,962.13 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత 15 త్రైమాసికాల్లో కంపెనీకి ఇదే తొలి నష్టం. 2025-26 ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.6,123.93 కోట్ల నికరలాభం ఆర్జించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధర 50% వరకు పెరిగినా.. దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ రిటెయిల్ ధరలను ఆ స్థాయిలో పెంచకపోవడమే ఈసారి నష్టాలకు కారణమని కంపెనీ తెలిపింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభించాక.. ముడిచమురు ధర బాగా పెరిగినా, ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ రెండున్నర నెలల పాటు ఇంధన రిటెయిల్ ధరలను స్థిరంగానే ఉంచాయి. మే ద్వితీయార్థంలో లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.7.50 చొప్పున పెంచినా, తయారీ వ్యయాలకు ఏ మాత్రం సరిపోలేదు. గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.89 పెంచారు. వాస్తవానికి పెంచాల్సిన మొత్తంలో అది అయిదో వంతని కంపెనీ వివరించింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ల విక్రయాలపైనే కంపెనీకి రూ.3,485.22 కోట్ల నష్టం వాటిల్లింది. దీనికి అదనంగా, 2026 మార్చికి కంపెనీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.12,318.52 కోట్ల వంటగ్యాస్ సబ్సిడీ బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏడాది క్రితంతో పోలిస్తే సంస్థ కార్యకలాపాల ఆదాయం రూ.1.35 లక్షల కోట్ల నుంచి రూ.1.59 లక్షల కోట్లకు చేరింది. పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలు 13.86 మి.టన్నుల నుంచి 13.62 మి.టన్నులకు తగ్గాయి. శుద్ధి చేసిన ఇంధన పరిమాణం కూడా 10.40 మి.టన్నుల నుంచి 10.15 మి.టన్నులకు పరిమితమైంది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), జూన్ త్రైమాసికంలో రూ.12,265 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది.

# క్రీడలు

## భారత్‌కు తొలి పతకం ఖాయం



స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభం రోజే భారత్‌కు తొలి పతకం ఖాయమైంది. బాక్సింగ్‌లో మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా బొర్గోహెయిన్ నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో లవ్లీనా భారత్‌కు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదుగురు బాక్సర్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో డ్రాలో లవ్లీనాకు బై లభించింది. బొర్గోహెయిన్‌తోపాటు మరో ఇద్దరు నేరుగా సెమీస్‌కు అర్హత సాధించారు. మిగిలిన ఇద్దరు బాక్సర్లు ఏకైక క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడతారు. జులై 31న జరిగే సెమీ ఫైనల్‌లో తువాలుకు చెందిన టీకేబీపీ తాఫాకీతో లవ్లీనా తలపడనుంది. ఇందులో గెలిచిన వారు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధిస్తారు. కెరీర్‌లో ఎన్నో ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాలు సాధించిన లవ్లీనాకు కామన్వెల్త్ క్రీడల్లో ఇదే తొలి పతకం కావడం విశేషం. అస్సాంకు చెందిన ఈ బాక్సర్ టోక్యో ఒలింపిక్స్ (2020)లో కాంస్య పతకం (69 కేజీల విభాగం), 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం (75 కేజీలు) సాధించింది. 2022 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2023 ఆసియా క్రీడల్లో రజతంతో మెరిసింది.

## అర్జెంటీనాపై బ్యాన్ విధించాలనే ఆన్‌లైన్ పిటిషన్ గిన్నిస్ రికార్డు!



డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనా ఫిఫా ప్రపంచ కప్ (FIFA World Cup 2026) ఫైనల్‌లో ఓటమిపాలైంది. స్పెయిన్ విజయం సాధించి కప్పును సొంతం చేసుకుంది. అయితే, అర్జెంటీనా ఫైనల్‌కు వచ్చినప్పుడే.. సోషల్ మీడియా వేదికగా ఆ జట్టుకు వ్యతిరేకంగా ఆన్‌లైన్ పిటిషన్ వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ పిటిషన్ గిన్నిస్ రికార్డునే బ్రేక్ చేసిందని గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు, ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్‌ను మళ్లీ నిర్వహించాలని ఇటు అర్జెంటీనా అభిమానులు డిమాండ్ చేస్తూ ఆన్‌లైన్‌లో ఓ పిటిషన్‌ను తీసుకొచ్చారు.
లియోనెల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా (ARG vs ESP)కు ఫిఫా నిర్వాహకులు పక్షపాతంగా వ్యవహరించారని.. ఆ జట్టుపై నిషేధం విధించాలని డిజిటల్ సంతకాలతో ఓ పిటిషన్ నెట్టింట వైరల్‌గా మారింది. ఆ పిటిషన్‌పై 23 మిలియన్లు (2.3 కోట్ల మంది) సంతకాలు చేయడం గమనార్హం. ఇక ఫైనల్ మ్యాచ్ తర్వాత కూడా స్పెయిన్ ఆటగాళ్లపైకి అర్జెంటీనా ప్లేయర్ పరెడెస్ దూసుకుపోయిన వీడియోలు పెద్ద దుమారమే రేపాయి. దీంతో అర్జెంటీనాను ప్రపంచ కప్ బరిలోకే దిగకుండా చూడాలని విజ్ఞప్తులు పెరిగాయి. దాదాపు 170 దేశాల నుంచి 2.33 కోట్ల సంతకాలను సేకరించామని.. 5 కోట్ల వరకూ తీసుకెళ్లాలనే లక్ష్యంతో వర్కౌట్ చేస్తున్నట్లు కథనాలు వచ్చాయి.
అర్జెంటీనాను బ్యాన్ చేయాలనే పిటిషన్ పరిస్థితి అలా ఉంటే.. మెస్సి సేనకు అనుకూలంగా మరో పిటిషన్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఫిఫా ప్రపంచ కప్ (FIFA World Cup 2026) ఫైనల్‌ను మళ్లీ నిర్వహించాలనేది ఆ పిటిషన్ సారాంశం.
ప్రారంభించిన కాసేపటికే ఆ పిటిషన్‌కు 70 వేల వరకూ డిజిటల్ సంతకాలు వచ్చాయి. రిఫరీ నిర్ణయాలు తమ ప్రత్యర్థి జట్టుకే అనుకూలంగా ఉన్నాయనేది అర్జెంటీనా అభిమానుల ఆరోపణ. పునఃసమీక్షించి ఫైనల్ మ్యాచ్‌ను మళ్లీ నిర్వహించాలని సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఇది తమ కోసం కాదు.. ఫుట్‌బాల్ ప్రపంచ కోసమంటూ పోస్టులు పెడుతున్నారు.

## చైనా ఓపెన్‌లో పీవీ సింధు ఓటమి



చైనా ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగుతేజం పీవీ సింధు పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో చెన్ యుఫీయ్ (చైనా) చేతిలో 16-21, 22-20, 21-18 తేడాతో ఆమె ఓడిపోయింది. ఇటీవలే జపాన్ ఓపెన్‌ను సింధు గెలుచుకున్న సంగతి తెలిసిందే. సెమీస్‌లో యుఫీయ్‌పైనే భారత షట్లర్ గెలిచి ఫైనల్‌కు వెళ్లింది. ఇప్పుడు కూడా చివరి వరకూ సింధు పోరాడినా ఓటమి తప్పలేదు. దాదాపు గంటన్నరపాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్ పీవీ సింధుదే. 21-16 తేడాతో విజయం సాధించింది. ఇక రెండో గేమ్‌లోనూ అదే దూకుడు ప్రదర్శించింది. కానీ, ఆఖర్లో పుంజుకున్న యుఫీయ్ 22-20 తేడాతో సింధుపై గెలిచి స్కోరును సమం (1-1) చేసింది. ఇక నిర్ణయాత్మక చివరి గేమ్‌లోనూ తీవ్ర పోటీ తప్పలేదు. పాయింట్ల కోసం ఇరువురూ శ్రమించారు. చివరికి 21-18 తేడాతో సింధుపై గెలిచిన యుఫీయ్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

## అభిషేక్ ఖాతాలో ఓ రికార్డు



జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు టీమ్ఇండియా సిద్ధమైంది. మూడు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేయాలని భావిస్తోంది. పొట్టి ఫార్మాట్‌లో ఇప్పటికే వరుసగా రెండు సిరీస్‌లను భారత్ కోల్పోయింది. దీంతో ఈ సిరీస్‌లో విజయం సాధించడం అత్యంత అవసరం. మంచి ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మతోపాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నుంచి మంచి ఇన్నింగ్స్ రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. వారిద్దరూ రాణిస్తే టీమ్ఇండియా విజయం నల్లేరుపై నడకే అవుతుంది.
ఈ క్రమంలో అభిషేక్ శర్మ ఓ ఘనతకు కాస్త చేరువగా ఉన్నాడు. అదే సాధిస్తే భారత్ తరపున నాలుగో బ్యాటర్‌గా మారతాడు. మరో 16 పరుగులు రాబడితే.. టీ20ల్లో అతడు 6వేల పరుగుల మార్క్‌ను అందుకొంటాడు. 200 అంత కంటే తక్కువ ఇన్నింగ్స్ ల్లో ఈ ఘనత సాధించిన నాలుగో టీమ్ఇండియా ఆటగాడిగా మారతాడు. అతడి కంటే ముందు కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్ మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం అభిషేక్ 203 మ్యాచుల్లో 199 ఇన్నింగ్స్‌లు ఆడా డు. ఇందులో 53 మ్యాచులు టీమ్ఇండియా తరఫున బరిలోకి దిగాడు. అతడి ఖాతాలో 5,984 పరుగులు ఉన్నాయి. భారత్ తరపున కేఎల్ రాహుల్ కేవలం 166 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించాడు. విరాట్ కోహ్లి (184), శుభ్‌మన్ గిల్ (185) తర్వాత స్థానాల్లో ఉన్నారు.
ఓవరాల్‌గా అత్యంత వేగంగా 6వేల మార్కును అందుకొన్న బ్యాటర్ 'యూనివర్సల్ బాస్' క్రిస్ గేల్. అతడు 162 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు.

## అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘంపై ఎఫ్‌బీఐ విచారణ!

ఫుట్‌బాల్ ప్రపంచ కప్ ఫైనల్‌లో ఓటమి చవిచూసిన అర్జెంటీనాను కష్టాలు వదల్లేదు. రెండోసారి కప్పును సొంతం చేసుకుందామంటే స్పెయిన్ అడ్డుగా నిలిచింది. ఇక ఫైనల్ తర్వాత ప్రత్యర్థి ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించినందుకు విమర్శలు ఎదుర్కొంది. ఇప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలతో విచారణ జరిగినట్లు వస్తోన్న వార్త ఆ జట్టును మరింత కలవరపెడుతోంది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిఫా టోర్నీ ముగించుకుని అమెరికా నుంచి తమ స్వదేశానికి తిరుగు ప్రయాణమైన వేళ.. అర్జెంటీనాకు అనూహ్య సమస్య ఎదురైంది. ఈ దేశ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు క్లాడియో టాపియాను అగ్రరాజ్య ఎఫ్‌బీఐ అధికారులు ప్రశ్నించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.



స్పాన్సర్‌షిప్‌నకు సంబంధించి యూఎస్ బ్యాంకుల ద్వారా వందల మిలియన్ల డాలర్ల మేర మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అర్జెంటీనాపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎయిర్‌పోర్టు వద్ద బస్సులోనే క్లాడియోతోపాటు మరొకరిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలను అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘం ఖండించింది. 'మా సంఘం అధ్యక్షుడు క్లాడియో, ట్రెజరర్ పాబ్లోను ఎవరూ అదుపులోకి తీసుకోలేదు. దీనికి సంబంధించి యూఎస్ కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. మా సంస్థ అధికారులతో సహా పలువురి గురించి సాక్ష్యం ఇచ్చేందుకు థర్డ్ పార్టీని యూఎస్ గ్రాండ్ జ్యూరీ ముందు హాజరుకావాలని సమన్లు పంపిన మాట వాస్తవమే. అంతేకానీ, మమ్మల్ని ఎవరూ అడ్డుకొని ప్రశ్నించలేదు'' అని అర్జెంటీనా బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. అయితే, సదరు థర్డ్ పార్టీ ఎవరనేది మాత్రం అసోసియేషన్ పేర్కొనలేదు. అర్జెంటీనా ఫుట్‌బాల్‌కు సంబంధించిన 300 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 2,896కోట్లు)పైగా వాణిజ్య ఒప్పందాలపై అమెరికా అధికారులు విచారణ చేపట్టారు. మనీ లాండరింగ్ లేదా మోసపూరిత ఉద్దేశాలతో అమెరికా బ్యాంకుల ద్వారా ఈ నగదును తరలించారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. బ్యాంక్ రికార్డుల ప్రకారం ఈ మొత్తం యూఎస్ఏలోని వివిధ ఆర్థిక సంస్థల ద్వారా బదిలీ అయినట్లు సమాచారం.




## '35 - చిన్న కథ కాదు'కు ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ అవార్డు

**ఉదయం సినిమా :** ఈ సినిమా స్క్రీన్‌ప్లేను పుస్తకంగా ప్రచురించడం మరింత సంతోషంగా ఉంది: దర్శకుడు నందకిశోర్ 2024 సంవత్సరానికి గాను '35 చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రం విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికైంది. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సృజన యర్రబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. విడుదల సమయంలో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం, ఇప్పుడు జాతీయ చలనచిత్ర పురస్కారాల్లోనూ తన సత్తా చాటింది. ఈ సందర్భంగా '35 చిన్న కథ కాదు' స్క్రీన్ ప్లే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



## #VenkyAnil5 (#NkrAR2)-తొలి షెడ్యూల్



**ఉదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న #VenkyAnil5 (#NKRAR2) చిత్రం కోసం జతకట్టారు. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమా తొలి షెడ్యూల్ విజయవంతంగా పూర్తైంది. ఈ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్‌లో నిర్మించారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్ కృతి శెట్టి షూటింగ్‌లో పాల్గొన్నారు.ఈ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్ట్‌తో పాటు ఓ అద్భుతమైన పాటను చిత్రీకరించారు. చాలా ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ ఎపిసోడ్స్ సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయి. ఇప్పటికే విడుదల చేసిన కళ్యాణ్ రామ్ పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే అనిల్ రావిపూడి తనదైన క్రియేటివ్ ప్రమోషన్స్ ఇప్పటికే అంచనాలు పెంచారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తోంది.

## 'శ్రీ విష్ణు x రామ్ అబ్బరాజు 2'లో హీరోయిన్ గా సాక్షి మడోల్కర్



**ఉదయం సినిమా:** హిలేరియస్ బ్లాక్‌బస్టర్ సామజవరగమనను అందించిన తర్వాత కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి జతకట్టారు. ప్రతిష్టాత్మక పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్‌ను షేర్ చేశారు. ఈ చిత్రంలో సాక్షి మడోల్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమెకు టీమ్‌లోకి వెల్‌కమ్ చెబుతూ విడుదల చేసిన వీడియోలో షూటింగ్ స్పాట్‌లోని ఫన్ వైబ్‌ను చూపించారు. టీమ్ మొత్తం సరదాగా గడిపిన మూమెంట్స్‌తో ఈ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.'శ్రీ విష్ణు x రామ్ అబ్బరాజు 2' కంప్లీట్ డిఫరెంట్ స్టయిల్ లో కొత్త కథాంశంతో కూడిన ఫ్రెష్ స్క్రిప్ట్. కాన్సెప్ట్, హై-వోల్టేజ్ హ్యూమర్ఎక్కువగా వుండే కథనంతో, ఈ చిత్రం నాన్-స్టాప్ వినోదాన్ని అందించబోతోంది.నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బలమైన తారాగణం, టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది.సామజవరగమనకి పని చేసిన రైటర్స్ భాను భోగవరపు, నందు సావిరిగణ మరోసారి స్క్రిప్ట్ రాయడానికి చేతులు కలిపారు. వారి కొలాబరేషన్ మరో మెమరబుల్ మూవీని అందించబోతోంది.

## నా డ్రీమ్ టైటిల్‌ను స్వచ్ఛందంగా ఇచ్చేశాను దర్శకుడు సుబ్బారెడ్డి



**ఉదయం సినిమా :** దర్శకుడు సుబ్బారెడ్డి తన వద్ద రిజిస్టర్ అయిన 'వారణాసి' సినిమా టైటిల్‌ను దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, దర్శకుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరశంకర్, దర్శకుడు సుబ్బారెడ్డి కలిసి ఇంటర్వ్యూలో చర్చించారు. దర్శకుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ, 2023లో 'వారణాసి' టైటిల్‌ను తన బ్యానర్‌పై రిజిస్టర్ చేసుకుని ఆ కథపై పని ప్రారంభించానని తెలిపారు. అయితే అదే టైటిల్ రాజమౌళి సినిమా కోసం అవసరమైందని తెలిసిన తర్వాత, తెలుగు సినిమా గౌరవం దృష్ట్యా ఎలాంటి సందేహం లేకుండా ఇవ్వాలని నిర్ణయించుకున్నానన్నారు. తన అభిమాన హీరో మహేష్ బాబు, దర్శకుడు రాజమౌళి, నిర్మాత కేఎల్ నారాయణ కలిసి చేస్తున్న ఈ భారీ చిత్రానికి టైటిల్ ఇవ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాపారంగా చూడలేదని, ఒక్క రూపాయి కూడా తీసుకోవాలనే ఆలోచన తనకు రాలేదని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. "టైటిల్ అనేది నాకు ఒక ఎమోషన్. దాన్ని అమ్మడానికి కాదు, మంచి సినిమా కోసం ఇవ్వడానికి సిద్ధపడ్డాను" అని పేర్కొన్నారు. దర్శకుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ, మొదట సుబ్బారెడ్డి ఆ టైటిల్‌పై ఎంతో భావోద్వేగంతో ఉన్నారని, అందుకే వెంటనే మాట్లాడలేదన్నారు. తరువాత రాజమౌళి, కేఎల్ నారాయణ వంటి ప్రముఖుల చిత్రం కోసం టైటిల్ ఇస్తే ఇండస్ట్రీకి మంచి సందేశం వెళ్తుందని వివరించగా, సుబ్బారెడ్డి వెంటనే అంగీకరించారని తెలిపారు. టైటిళ్లను డబ్బు కోసం కాకుండా, పరిశ్రమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పరస్పరం సహకరించుకోవాలని ఈ నిర్ణయం ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని వీరశంకర్ అభిప్రాయపడ్డారు. సుబ్బారెడ్డి చేసిన ఈ నిర్ణయం భవిష్యత్‌లో ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా రాజమౌళి, నిర్మాత కేఎల్ నారాయణ, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి, గేయరచయిత చంద్రబోస్‌లకు తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ, 'వారణాసి' చిత్రం ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## 'కర్మాఖ్య' ట్రైలర్ అద్భుతంగా ఉంది..

**ఉదయం సినిమా:** సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కర్మాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ PVT LTD బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జూలై 31న ఈ చిత్రం గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ వేడుకకు లేడి సూపర్ స్టార్ విజయశాంతి ముఖ్య అతిథి హాజరయ్యారు.ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సినిమాలు చేస్తూ ఈ స్థాయికి వచ్చాం. తప్పకుండా మంచి సబ్జెక్ట్ ఉన్న చిన్న సినిమాలను విజయవంతం చేయాలని మీడియాను, ప్రేక్షకులను కోరుతున్నాను. ఈ సినిమాతో దర్శకుడు అభినయ కృష్ణ విజయం సాధిస్తాడని నమ్మకం ఉంది. మీడియా కూడా ఇలాంటి చిన్న సినిమాలకు మంచి చోటు కల్పించి ప్రోత్సాహం ఇవ్వాలని కోరుకుంటున్నాను. హీరోయిన్ సమైరా చాలా చక్కగా చేసింది. తెలుగు కూడా చాలా చక్కగా మాట్లాడటం అభినందనీయం. ట్రైలర్ చూసినప్పుడు మ్యూజిక్‌లో ఒక వైబ్రేషన్ వినిపించింది. ట్రైలర్ చాలా బాగుంది. ఆర్టిస్టులు అందరూ కూడా చాలా చక్కగా చేశారు. ఈ సినిమాలో నటించిన



లేడీ సూపర్ స్టార్ విజయశాంతి మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ఈ సినిమా టైటిల్ నాకు చాలా నచ్చింది. మొదట 'కామాఖ్య' అనే టైటిల్ చెప్పినప్పుడు చాలా పవర్‌ఫుల్‌గా అనిపించింది. కామాఖ్య అమ్మవారు పవర్ ఫుల్. ఖచ్చితంగా విజయం సాధిస్తుందని అనుకున్నాను. అయితే కొన్ని కారణాల వల్ల ఇప్పుడు 'కర్మాఖ్య' అని పెట్టారు. అందులో కూడా అమ్మవారి పేరు ఉంది. అభి గుండు కొట్టించుకోవాల్సిన అవసరం లేదు. సినిమా డెఫినెట్‌గా హిట్ అవుతుంది. ఈ మధ్య మంచి సబ్జెక్టులతో ఇండస్ట్రీలోకి వస్తున్నారు. నిజానికి చిన్న సినిమాల్లో దమ్ముంది, సబ్జెక్ట్ ఉంది. మేమందరం కూడా చిన్న ఆనంద్ గారు కూడా చాలా మంచి నటుడు. ఈ సినిమాకి నిర్మాతలు చాలా ఖర్చు పెట్టారు. వాళ్ల ధైర్యాన్ని మెచ్చుకోవాలి. ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే ప్రజలందరూ జులై 31న థియేటర్లకు వచ్చి ఈ సినిమాను ఆదరించి విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను.మధు యాష్కీ మాట్లాడుతూ... లేడీ సూపర్ స్టార్ విజయశాంతి గారు ఈ కార్యక్రమానికి వచ్చి బ్లెస్సింగ్స్ అందించడం నిజంగా ఈ టీమ్ మొత్తానికి గొప్ప ప్రోత్సాహం. ఈ సినిమా చాలా ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తోంది. నేను సినిమాలను తరచుగా చూస్తుంటాను.




Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.